PRAJAPAKSHAM

శిథిలం
రూ॥90/-
పేజీలు:96



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఎడిటర్ : కె.శ్రీనివాస్‌రెడ్డి

2024, మార్చి 16 శనివారం

హైదరాబాద్ | సంపుటి 26, సంచిక: 268, పేజీలు: 8
ఖమ్మం : 8+8, కరీంనగర్ : 8+8
మహబూబ్‌నగర్: 8, వెల రూ. 5.00

Published from: **Hyderabad**
**Khammam, Karimnagar, Mahabubnagar**

## ఢిల్లీ మద్యం కేసులో

# కవిత అరెస్టు

### విమానంలో ఢిల్లీకి తరలించిన ఇడి అధికారులు

### తొలుత ఎంఎల్‌సి ఇంట్లో సోదాలు

ప్రజాపక్షం/హైదరాబాద్



ఢిల్లీ మద్యం కుంభకోణంలో కేసులో హైడ్రామా మధ్య బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు శుక్రవారం సాయంత్రం అరెస్ట్ చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఆమె నివాసంలో సోదాలు నిర్వహించిన అనంతరం అరెస్టు చేసినట్లు ప్రకటించి, వెనువెంటనే రాత్రి 8:45 గంటలకు విమానంలో ఇడి అధికారులు ఆమెను ఢిల్లీకి తీసుకెళ్ళారు. హైదరాబాద్ మహానగరం మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గంలో ప్రధాని నరేంద్రమోడీ రోడ్‌షో జరుగుతున్న సమయంలోనే ఆమె అరెస్టు చోటు చేసుకుంది. మానీలాండరింగ్ యాక్ట్ 2002 సబ్ సెక్షన్ 19 సబ్‌సెక్షన్ 1 కింద అరెస్ట్ చేసినట్లు ఇడి ప్రకటించింది. ఈ మేరకు అరెస్ట్‌కు కారణాలు తెలియజేస్తూ సుమారు 14పేజీలతో కూడిన పత్రాన్ని ఇడి అధికారులు ఆమెకు అందజేశారు. అలాగే అరెస్ట్ చేస్తున్నట్టుగా కవిత భర్త డి.ఆర్. అనిల్ కుమార్‌కు సమాచార పత్రాన్ని కూడా అందజేశారు. ఇడి అసిస్టెంట్ డైరెక్టర్ జోగేందర్, అనుప్రియ పటేల్ అధికారుల బృందం కవితను అరెస్ట్ చేసి, అక్కడి నుండి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు తీసుకెళ్లారు. అక్కడి నుండి 8:45 నిమిషాలకు విమానంలో ఢిల్లీకి తరలించారు. కాగా, హైదరాబాద్, బంజారాహిల్స్‌లోని కవిత నివాసంలో శుక్రవారం మధ్యాహ్నం ఇడి అధికారుల బృందం సోదాలు నిర్వహించింది. ఈ విషయం తెలుసుకున్న బిఆర్‌ఎస్, భారత జాగృతినాయకులు కవిత నివాసానికి చేరుకున్నారు. సోదాల్లో కవిత ఫోన్లతో పాటు పలు కీలక డాక్యూమెంట్లను ఇడి అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. సోదాల అనంతరం కవితను అరెస్ట్ చేస్తున్నట్టు ఇడి అధికారులు ప్రకటించారు. సాయంత్రం 5:30గంటలకు అరెస్ట్ చేసినట్టు అరెస్ట్ మెమోలో

తరువాయి 4లో

#### కవిత ఇంటి వద్ద హైడ్రామా

కవిత ఇంటి వద్ద ఇడి అధికారులు సోదాలు నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న బిఆర్‌ఎస్, భారత జాగృతి నాయకులు బంజారాహిల్స్ ఇంటికి చేరుకున్నారు. గేటువద్దనే బైఠాయించారు. కవితను అరెస్ట చేసి ఆమెను వాహనంలో తరలిచేందుకు ఇడి అధికారులు ప్రయత్నించగా, బిఆర్‌ఎస్ కార్యకర్తలు వాహనాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకుని వాహనాన్ని అక్కడి నుండి పంపించారు.

# నేడే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్

**అమల్లోకి రానున్న కోడ్**



**న్యూఢిల్లీ :** యావత్ భారత ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న లోక్‌సభ ఎన్నికల నగరా నేడు మోగనుంది. ఈ నెల 16వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు మీడియా సమావేశంలో కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేయనుంది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌తో పాటు పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు కూడా షెడ్యూల్‌ను ప్రకటించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) శుక్రవారం సామాజిక మాధ్యం 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. ప్రస్తుత లోక్‌సభ పదవీ కాలం జూన్ 16న ముగియనుంది. ఆలోపే కొత్త సభ ఏర్పాటు కానుంది. అదే విధంగా ఆంధ్రప్రదేశ్, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా అసెంబ్లీ పదవీ కాలం జూన్‌లో పలు తేదీల్లో ముగియనుంది. ఇటీవల దేశం వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో పర్యటించిన ఇసి.. స్థానిక రాజకీయ

తరువాయి 4లో

## బాండ్లపై నెంబర్లు ఇవ్వకపోతే

# డబ్బు ఎవరిచ్చారో ఎలా తెలుస్తుంది?

### ఎస్‌బిఐకి సుప్రీంకోర్టు చీవాట్లు



**న్యూఢిల్లీ :** ఎన్నికల సంఘానికి వివరాలు సమర్పించిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎన్నికల బాండ్ల నెంబర్లు ఇవ్వకపోవడంతో ఏ దాత ఏ పార్టీకి విరాళాలు ఇచ్చారో సమాచారం తెలియడంలేదని సుప్రీంకోర్టు మండిపడింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాద తన విధులను సక్రమంగా, సజావుగా నిర్వహించాలని, సోమవారం నాటికల్లా బాండ్లపై నెంబర్లు, సంబంధిత వివరాలను సమర్పించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యానగల ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఆదేశించింది. ఎందుకు బాండ్ల నెంబర్లు ఇవ్వలేదో సంజాయిషీ ఇవ్వాలని ధర్మాసనం ఎస్‌బిఐకి నోటీసు జారీ చేసింది. దాతలు ఏ పార్టీకి ఎంత డబ్బు విరాళంగా ఇచ్చారు? వారి పేర్లు, ఎప్పుడు కొనుగోలు చేశారో సంబంధిత తేదీ...వివరాలన్నీ సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. ఎన్నికల బాండ్ల వివరాలు అందజేసేందుకు జూన్ 30వ తేదీ వరకూ గడువు ఇవ్వాలని ఎస్‌బిఐ దాఖలలు చేసిన పిటిషన్‌ను అంగీకరించవద్దని కోరుతూ సచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ విచారణ జరిగింది. ఈ సంస్థ తరపున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ధర్మాసనం ఎదుట హాజరయ్యారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన

తరువాయి 4లో

## బిజెపి బాండ్ల

# అవినీతి బాగోతం తేలాల్సిందే

### సుప్రీంకోర్టు సమగ్ర దర్యాప్తుకు ఖర్గే డిమాండ్

**న్యూఢిల్లీ :** కేంద్రంలోని అధికార బిజెపి ఎన్నికల బాండ్ల అవినీతి బాగోతం తేలాల్సిందేనని కాంగ్రెస్‌పార్టీ పట్టుపట్టింది. బిజెపి బ్యాంక్ అకౌంట్లలో ఉన్న ఈ అవినీతి సొమ్ము ఖర్చు కాకుండా యుద్ధ ప్రాతిపదికపై తక్షణం స్తంభింపజేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ అంశాలపై సుప్రీంకోర్టు ద్వారా ఉన్నతస్థాయి సమగ్ర దర్యాప్తు చేయాలని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. దీంతో పాటు కాంగ్రెస్‌పార్టీ బ్యాంక్ అకౌంట్లను కుట్రచేసి ఉద్దేశపూర్వకంగా స్తంభింపజేశారనీ దీనిపై కూడా దర్యాప్తు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఐటీ పేరుతో తమ పార్టీని బిజెపి తిప్పలు పెడుతున్నదని విమర్శించారు. ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించకుండా దారుణమైన ఎత్తుగడలు వేస్తున్న బిజెపి పాలకులపై సుప్రీంకోర్టు సమగ్ర దర్యాప్తు జరపాలని ఎక్స్ వేదికగా ఖర్గే కోరారు. అదేవిధంగా

తరువాయి 4లో



## కొత్త ఇసిల నియామకం

# రద్దుకు సుప్రీం తిరస్కృతి

**న్యూఢిల్లీ:** భారత ఎన్నికల సంఘంలో కొత్తగా ఇద్దరు ఎన్నికల కమిషనర్లను నియమిస్తూ అత్యున్నతస్థాయి కమిటీ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నియామకాలు నిలిపివేయాలని కోరిన పిటిషనర్ల వాదనలను సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. ఎన్నికల సంఘంలో ఇద్దరు కమీషనర్లను నియమిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ సారథ్యంలోని త్రిసభ్య కమిటీ ఈనెల 14వ తేదీన నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు ప్రకారం ఈ త్రిసభ్య కమిటీలో భారత సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి కూడా ఉండాలి. కానీ ప్రధానమంత్రి ఈ కమిటీ నుండి ప్రధాన న్యాయమూర్తిని తొలగించి ఆయన స్థానంలో కేంద్ర న్యాయశాఖా మంత్రిని సభ్యుడుగా నియమించారు. దీనిని వ్యతిరేకిస్తూ,

తరువాయి 4లో

# ఎకో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు

### అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

### పర్యాటకులను ఆకట్టుకునేలా వైవిధ్యమున్న ప్రాంతాలు గుర్తించాలని సూచన

ప్రజాపక్షం/ హైదరాబాద్



రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అటవీశాఖ, పర్యాటక శాఖ సమన్వయంతో పని చేయాలని సూచించారు. పర్యాటకులను ఆకట్టుకునేలా వైవిధ్యమున్న ప్రాంతాలను గుర్తించాలని చెప్పారు. రెండు విభాగాలు సంయుక్తంగా పర్యాటక ప్రాజెక్టుల ప్రతిపాదనలు తయారు చేయాలని చెప్పారు. అటవీ అందాలు, వన్య ప్రాణులు, వలస వచ్చే విదేశీ పక్షులు, విభిన్న జీవ వైవిధ్యమున్న ప్రాంతాలు, హెరిటేజ్ ప్రదేశాలు, సంస్కృతికి అద్దం పట్టే ప్రాంతాలన్నింటినీ గుర్తించి, వాటిని అభివృద్ధి చేయాలని అన్నారు. తెలంగాణలో అడవులతో ముడిపడి ఉన్న ప్రకతి అందాలను, పర్యాటక ప్రాంతాలకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సాధించేలా ప్రతిపాదనలు రూపొందించాలని, అందుకు అవసరమైన కృషి చేయాలన్నారు. అవసరమైతే ప్రత్యేకంగా కన్సెల్టెన్సీలను నియమించి ప్రతిపాదనలు తయారు చేయించాలని చెప్పారు. ఉత్తర తెలంగాణలో కవ్వాల్, దక్షిణ తెలంగాణ వైపు అమ్రాబాద్ టైగర్ రిజర్వు ప్రాజెక్టులను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. వన్య ప్రాణులకు హాని కలిగించకుండా ప్రత్యేక పర్యాటక విధానం తయారు చేయాలని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో అటవీ ప్రాంతాల్లోనే పర్యాటకులు విడిది చేసేలా ప్రా జెక్టులు కూడా ఉన్నాయని, వాటిని అధ్యయనం చేసి, అక్కడ అనుసరిస్తున్న రక్షణ, భద్రత చర్యలను రాష్ట్రంలోనూ అమలయ్యేలా చూడాలని చెప్పారు. సచివాలయంలో అటవీ శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ డోబ్రియాల్, సిఎంఒ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు. అటవీ శాఖలో నుంచి డిప్యుటేషన్ పై వెళ్లి ఇతర విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగుల వివరాలను వెంటనే సమర్పించాలని సిఎం

తరువాయి 4లో

### ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధుల వినతులపై త్రిసభ్య కమిటీ

రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఇచ్చిన వినతులను పరిశీలించి పరిష్కరించేందుకు ముగ్గురు సభ్యులతో కమిటీ వేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి నేతృత్వంలో జెఎసి చైర్మన్, రిటైర్డ్ ప్రొఫెసర్ కోదండరామ్, ఐఎఎస్ అధికారి దివ్యను సభ్యులుగా నియమించారు. ఈనెల 10వ తేదీన రాష్ట్రంలోని వివిధ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో ముఖ్యమంత్రి ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆ సందర్భంగా సంఘాల ప్రతినిధులు ఇచ్చిన

తరువాయి 4లో

ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ రద్దు చేయడం మోడీ, అమిత్ షా వల్ల కాదు : సిఎం రేవంత్‌రెడ్డి 03

## ఉద్యమగుమ్మం ఖమ్మంలో

# ఇయు రాష్ట్ర మహాసభలు

### హాజరు కానున్న 250 మంది ప్రతినిధులు

ప్రజాపక్షం/ ఖమ్మం



ఆర్‌టిసి కార్మికులు త్రిశంకు స్వర్గంలో ఉన్న నేపథ్యమిది. గత ప్రభుత్వం నియంత ధోరణితో ఆర్‌టిసిలో యూనియన్లనే రద్దు చేసిన తర్వాత కార్మికుల గొంతుక మూగబోయింది. దశాబ్దాల తరబడి కార్మికుల పక్షాన ఉద్యమ గొంతుకగా ఉన్న ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ల రద్దుతో పాటు యాజమాన్య పెడధోరణులను, ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వస్తున్నది. అవసరమైనప్పుడు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నది. ప్రభుత్వం మారితే ఆర్‌టిసి కార్మికుల జీవితాలలో మార్పుతో పాటు సంక్షేమ పథకాలు ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు, యూనియన్లకు చట్టబద్ధత తదితర విషయాలు అమలవుతాయని ఆశించారు. ప్రజల అభిమతానికి అనుగుణంగా 100 రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పనులు చేసినప్పటికీ ఆర్‌టిసి పట్ల మాత్రం వివక్ష ధోరణినే అవలంబిస్తుందని చెప్పక తప్పదు. 100 రోజుల్లో సింగరేణి సహా అటు కార్పోరేషన్లలోను ఇటు ప్రభుత్వ సంస్థల్లోను మార్పులు చోటు చేసుకున్నా ఆర్‌టిసిలో మాత్రం చింతాకంత మార్పు కనిపించ లేదు. ముఖ్యంగా 2023లో అప్పటి కెసిఆర్ ప్రభుత్వం ఆర్‌టిసి ఉద్యోగులను విలీనం చేస్తున్నట్లు ప్రకటించింది. కానీ ఇంత వరకు కార్యాచరణ రూపు దాల్చలేదు. అపాయింట్‌మెంట్ డేటు నిర్ధారించలేదు. అది ఎప్పుడు జరుగుతుందో, ఎలా జరుగుతుందో ఇప్పటికీ అర్థం కానీ స్థితి. ఆర్‌టిసి కార్మికుల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. గతంలో మాదిరి కార్పోరేషన్ పరిధిలో ఉండి యూనియన్ల పోరాటం ద్వారా తమ హక్కులను సాధించుకోవడమే కాకుండా సంక్షేమ పథకాలను అమలు చేసుకునే అవకాశాన్ని కోల్పోయారు. ప్రభుత్వ ఉద్యోగులుగా లబ్ధి పొందక పోగా ఊగిసలాట ధోరణే మొదలైంది. ఇదే అదునుగా యాజమాన్యాలు పని భారాన్ని పెంచేశాయి. మూడు నెలల్లో 22 కోట్ల మంది ప్రయాణించారంటే ప్రస్తుతం

తరువాయి 4లో

# పర్యావరణ మార్పులపై పాత్రికేయులకు శిక్షణ

### మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ తరగతుల్లో ఈసారి 'వాతావరణ మార్పులు' అనే అంశంపై పాత్రికేయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. యునైటెడ్ స్టేట్స్ కాన్సులేట్ జనరల్ సహకారంతో, వ్యాస్ పర్యావరణ పరిరక్షణ సంస్థ, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీలలో

తరువాయి 4లో



# రాష్ట్ర ఆదాయం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి పోనీయొద్దు

### పేదవాడిపై భారం పడకుండా ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు పెంచుకునేలా చర్యలు

### అధికారులకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆదేశం

ప్రజాపక్షం/ హైదరాబాద్

పేదవాడిపై భారం పడకుండా ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు పెంచుకునేలా రాష్ట్ర ఆదాయాన్ని పెంపొందించేలా చర్యలు చేపట్టాలని అధికారులను డిప్యూటీ సిఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. రాష్ట్ర ఆదాయం ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి పోకుండా చూడాలని సూచించారు. రాష్ట్ర ఆదాయ వనరులు పెంచుకోవడం వనరుల నిర్వహణపై డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో జరిగింది. ఈ సమావేశంలో సభ్యులైన, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి ,శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావువులు, సిఎస్ శాంతి కుమారి, స్పెషల్ సిఎస్ రామకృష్ణారావు, హెచ్‌ఎండిఎ కమిషనర్ దానకిషోర్, సిసిఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్, డిప్యూటీ సిఎం స్పెషల్ సెక్రటరీ కష్ణ భాస్కర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. హైదరాబాద్ లోపల, పరిసరాల్లో ప్రభుత్వ భూములను కాపాడేందుకు అధికారులు నిరంతరం అప్రమత్తతో ఉండాలని, అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు కాపాడటమే ధ్యేయంగా

తరువాయి 4లో



## కాంగ్రెస్‌లోకి బిఆర్‌ఎస్ సిట్టింగ్ ఎంపి

# పసునూరు, ఎంఎల్‌ఎ దానం?

ప్రజాపక్షం/ హైదరాబాద్

బిఆర్‌ఎస్‌కు చెందిన పలువరు ఎంపి, ఎంల్‌ఎలు ఆ పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆ ప్రక్రియ వేగవంతమైంది. వరంగల్ ఎంపి పసునూరు దయాకర్ శుక్రవారం సిఎం రేవంత్‌రెడ్డిని సచి వాలయంలో కలిసారు. వరంగల్ లోక్‌సభ స్థానాన్ని సిట్టింగ్ ఎంపి పసునూరుకు కాకుండా మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి కుమార్తె కడియం కావ్య పేరును బిఆర్‌ఎస్ ప్రకటించింది. దీంతో దయాకర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సిఎంను ఆయన కలవడం ప్రాధాన్యత సంత రించుకున్నది. మరోవైపు ముఖ్యమంత్రి

తరువాయి 4లో

ప్రజాపక్షం

శనివారం, మార్చి 16

# ఇబిఎస్‌పై అనుమానాలెన్నో!

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 2018లో ప్రవేశపెట్టిన ఎలక్టోరల్ బాండ్ల పథకం (ఇబిఎస్)లో పారదర్శకత కొరవడింది. నేరుగా సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని, బాండ్‌లను జారీచేయడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ, ఈ ఏడాది ఫిబ్రవరి 15న రద్దుచేసిన తర్వాత కూడా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) పూర్తి వివరాలు ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేయలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. గోప్యతను కాపాడాలన్న నిబంధన ప్రకారం వివరాలను రహస్యంగా భద్రపరిచామని, వివరాలను డీకోడ్ చేయడానికి జూన్ 30వ తేదీ వరకూ గడువు ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరడంలోనే ఎస్‌బిఐ ఆంతర్యం స్పష్టమైంది. అయితే, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం సమాచారం అందించి తీరాలని ఆదేశాలు జారీచేయడంతో, హడావుడిగా అరకొర సమాచారాన్ని సమర్పించింది. ఓటింగ్ ఎంపికను సమర్థవంతంగా అమలు చేయడానికి రాజకీయ పార్టీల నిధుల గురించి సమాచారం భారత ఎన్నికల కమిషన్‌కు అత్యవసరమన్న ధర్మాసనం వ్యాఖ్యలను కూడా ఎస్‌బిఐ పట్టించుకున్న దాఖలాలు లేవు. బాండ్లను రీడీమ్ చేసిన వివిధ రాజకీయ పార్టీలకు కేటాయించిన 'ఆల్ఫా న్యూమెరికల్ నంబర్'ను వెల్లడించలేదు. దీనిపై వివరణ కోరుతూ ఎస్‌బిఐకి ధర్మాసనం శుక్రవారం నోటీసు జారీ చేసింది. ఈ పథకం అద్భుతమని, పారదర్శకమని కోర్టులో కేంద్రం ఘనంగా వాదించింది. ఓటర్ల సమాచార హక్కును హరిస్తున్నదన్న విమర్శను తోసిపుచ్చి, అసలు రాజకీయ పార్టీలకు అందే నిధులకు సంబంధించిన వివరాలను తెలుసుకునే హక్కు ప్రజలకు లేదని వ్యాఖ్యానించింది. రాజకీయాల్లోకి నల్ల ధన ప్రవాహాన్ని అడ్డుకోవడమే ఇబిఎస్ లక్ష్యమంటూ భుజకీర్తులు తగిలించుకుంది.

ఎలాంటి ప్రయోజనాలను ఆశించకుండా, రాజకీయ పార్టీలకు ఎవరూ భారీ మొత్తాల్లో విరాళాలు ఇవ్వరన్నది నిజం. పరస్పర ప్రయోజనాలే (క్విడ్ ప్రోకో) ఈ పథకం లక్ష్యమన్నది స్పష్టం. పొందే విరాళాల పరిమాణంలో ఉన్న వ్యత్యాసాలు సహజంగానే పార్టీల్లో ఆర్థిక అసమానతలకు కారణమవుతాయి. దేశ రాజకీయాలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ఈ అంశాలనే సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొంది. ఆర్టికల్ 19 (1)(ఎ) ప్రకారం చట్టవిరుద్ధమని ప్రకటించింది. ఇంత విస్తారమైన వాదోపవాదనల అనంతరం సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును కూడా అవహేళన చేసే రీతిలో ఎస్‌బిఐ నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శించడం శోచనీయం. గోప్యత పేరుతో ఎవరు, ఎవరికి, ఎంత మొత్తంలో విరాళాలు ఇచ్చారో తెలియకుండా దాచడంలోనే ఈ పథకం పాదర్శకతపై అనుమానాలకు ప్రధాన కారణం. అపరిమిత కార్పొరేట్ విరాళాలను అనుమతించడం ఎన్నికల ప్రక్రియలో వివిధ కంపెనీల అనియంత్రిత ప్రభావానికి అధికారం ఇవ్వడమే. 2018లో ఆర్థిక మంత్రిత్వ శాఖ 'హైరిస్క్' కంపెనీలుగా ప్రకటించిన సంస్థల జాబితాలో కనీసం మూడు కంపెనీలు భారీ మొత్తంలో బాండ్లను కొన్నట్టు ఎస్‌బిఐ జాబితా స్పష్టం చేస్తున్నది.

ఆర్థిక లావాదేవీల్లో అవకతవకలు.. అవినీతి.. మనీ లాండరింగ్ వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న కంపెనీలు కూడా ఎలక్టోరల్ బాండ్లను కొన్నాయని అంటున్నారు. మొత్తం బాండ్లలో అత్యధిక శాతం బిజెపి ఖాతాల్లోకి చేరడం బహిరంగ రహస్యం.ఎలక్టోరల్ బాండ్ల ద్వారా ఆర్థికంగా బిజెపి లాభపడిందని అందరికీ తెలిసిందే. అందుకే పరోక్షంగా కార్పొరేట్ కంపెనీలకు పలు రకాలుగా అండదండలు అందిస్తున్నది. పన్ను శ్లాబ్ తగ్గించడం నుంచి, రుణాలను మాఫీ చేయడం దాకా, బడా పారిశ్రామికవేత్తలకు లక్షల కోట్లను దోచిపెడుతున్నదన్న విమర్శలకు మోడీ సర్కార్ సమాధానం చెప్పాలి. సుప్రీంకోర్టు విస్పష్టమైన తీర్పు ఇచ్చిన తర్వాత కూడా ఇబిఎస్‌పై ఎందుకు వివరాలను వెల్లడించడం లేదో ఎస్‌బిఐ వివరించాలి.

# దివ్యాస్త్ర ప్రయోగంలోనూ మోడీ ప్రయోజనాలు?

ఒకేసారి పలు లక్ష్యాలను దెబ్బతీసే ఎంఐఆర్‌వి సాంకేతిక పరిజ్ఞానంతో అగ్ని–5 తరం క్షిపణి తొలి ప్రయోగం జయప్రదంగా జరిగినట్లు ప్రధాని నరేంద్రమోడీ 2024, మార్చి 11న ప్రకటించారు. దాన్ని 'దివ్యాస్త్రం'గా వర్ణించారు. ఈ విజయానికి కారకులైన డిఆర్‌డిఓ శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ఈ ప్రకటనతో మీడియా, సామాజిక మాధ్యమంలో పలు రకాల స్పందనలు వెలువడ్డాయి. ఒక్క క్షిపణితో చైనాలోని పలు లక్ష్యాలను దెబ్బతీయవచ్చు అని కాషాయ దళాలు నడిపే పత్రిక స్వరాజ్య ఒక విశ్లేషణను ప్రచురించింది. మిలిటరీ ఉన్మాదంతో ఊగిపోయే వారికి అలా కనిపించటంలో ఆశ్చర్యం లేదు. పరస్పర అనుమానాలు, కుట్ర సిద్ధాంతాలు పెద్ద ఎత్తున ప్రచారంలో ఉన్న నేపథ్యంలో ఏ దేశానికి ఆ దేశం తన రక్షణకు అవసరమైన పాటవాన్ని సమకూర్చుకుంటున్నది, అది ప్రతిదేశానికి ఉన్న హక్కు. అందుకే మనదేశం అణుపరీక్షలు జరిపినా, అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం(ఎన్‌పిటి) మీద సంతకం చేయకపోయినా కమ్యూనిస్టులతో సహా అందరూ మనదేశ వైఖరిని సమర్థించారు. సరిగ్గా ఎన్నికల ముందు పరీక్ష నిర్వహించటం, దాని గురించి ప్రధాని ప్రకటించటం, దానికి చైనా వ్యతిరేకతను నూరిపోస్తూ మీడియా స్పందించటం అర్థం కానంత బ్రహ్మవిద్యేమీ కాదు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో సాధించిన విజయాలు తమ ఘనతే అని రాజకీయపార్టీలు చెప్పుకోవటం ఓట్ల రాజకీయమే. ప్రధాని నరేంద్రమోడీ చిన్న వయస్సులోనే 1958లో అంతకు ముందు విడిగా ఉన్న కొన్ని సంస్థలను కలిపి డిఆర్‌డిఓ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి సమిష్టి కృషితో అనేక విజయాలను మన శాస్త్రవేత్తలు సాధించారు. మన జాగ్రత్తలో మనం ఉండటం సమర్థనీయమే, బస్తీమే సవాల్ అని ఎదుటివారిమీద తొడగొట్టటం వేరు. రెండవది ప్రమాదకరం అని ప్రపంచ చరిత్ర చెబుతున్నది.

ఓట్ల కోసం మనోభావాలను ముందుకు తేవటం, విద్వేషాన్ని నూరిపోయటం గత పది సంవత్సరాలు, అంతకు ముందు నుంచీ చూస్తున్నదే. కొన్ని వాస్తవాలను గమనించాల్సిన అవసరం ఉంది. ఐదవతరం అగ్ని క్షిపణితో నిజంగా పాకిస్థాన్, చైనాలను దెబ్బతీయగలమా! కచ్చితంగా తీయగలం, ఎప్పుడు? వాటి దగ్గర అలాంటివి లేనపుడు, ఉన్నా సన్నద్ధంగా లేనపుడు. ఇప్పుడు అలాంటి పరిస్థితి ఉందా? మనం జరిపింది తొలి పరీక్ష మాత్రమే, ఇది ఐదువేల కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను దెబ్బతీయవచ్చునని చెబుతున్నారు. ఇలాంటి క్షిపణులను మనకంటే ఎంతో ముందుగా అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా, పాకిస్థాన్ సమకూర్చుకున్నాయి. మన క్షిపణి ఒకేసారి ఎన్ని బాంబులను మోసుకుపోగలదో తెలియదు, నాలుగు అంటున్నారు. మిగతా దేశాల(రష్యా శాటన్–2) దగ్గర 16 బాంబులు(అదే సంఖ్యలో లక్ష్యాలు) మోసుకుపోగలవి ఉన్నట్లు మీడియాలో వెతికితే వివరాలు ఉన్నాయి. మనం తొలిపరీక్ష ఇప్పుడు చేస్తే చైనా 2016 నాటికే ఏడు పరీక్షలు జరిపింది, తరువాత కూడా చేస్తున్నది. చైనా వద్ద ఆధునిక డిఎఫ్ 41క్షిపణి 12 నుంచి 15వేల కిలోమీటర్లు అంటే అమెరికాలో ఉన్న లక్ష్యాలను కూడా తాకగలదు. మనం గనుక ఎదురుదాడికి దిగి క్షిపణిని వదిలితే ఎవరూ పసిగట్టలేరని చెబుతున్నారు. ఇదే సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఏ దేశం ఎదురుదాడికి దిగినా అదే జరుగుతుంది. దక్షిణాసియాలో తొలిసారిగా ఎంఐఆర్‌వి సాంకేతిక పరిజ్ఞానంతో పాకిస్థాన్ అబాబీల్ క్షిపణిని రూపొందించిందని గమనంలో ఉంచుకోవాలి. దాని పరిధి 2,200కిలోమీటర్లని వార్తలు. ఒకసారి పరీక్షలు మొదలైన తరువాత విస్తరించటం పెద్ద కష్టమేమీ కాదు. మీడియాలో వచ్చినట్లుగా మనమే ఎదురుదాడికి దిగితే మనకంటే బలంగా ఉన్న చైనా ఊరుకుంటుందా ? ఇప్పటికే అది భూమి, మోటారు వాహనాలు, రైళ్లమీద నుంచి ప్రయోగించే ఎంఐఆర్‌వి క్షిపణులను కలిగి ఉంది. 2019లోనే అలాంటి వాటిని మిలిటరీకి అందచేసింది. మనం పరీక్షించిన తాజా క్షిపణిని మిలిటరీకి అందించాలంటే మరికొన్ని సం.లు పడుతుంది.

గ్లోబల్ ఫైర్ పవర్ అనే సంస్థ ప్రతిదేశానికి సంబంధించి 60అంశాలను పరిగణనలోకి తీసుకొని 145 దేశాలకు 2024 సంవత్సర సూచికలను ఇచ్చింది. దాని ప్రకారం 0.0000 పాయింట్లు వస్తే ఆ దేశం పక్కాగా ఉన్నట్లు. ఈ ప్రాతిపదికన మొదటి స్థానంలో ఉన్న అమెరికాకు 0.0699, రెండవదిగా ఉన్న రష్యాకు 0.0702, మూడవది చైనాకు 0.0706 రాగా నాలుగవ స్థానంలో ఉన్న మనదేశానికి 0.1023 మార్కులు వచ్చాయి. అంటే చైనా కంటే ఎంతో దిగువన ఉంది. తొలి పది స్థానాల్లో మన తరువాత దక్షిణ కొరియా, బ్రిటన్, జపాన్, టర్కీ, పాకిస్థాన్, ఇటలీ ఉన్నాయి. ఒక వేళ యుద్ధమే వస్తే ఇప్పుడున్న ప్రపంచ రాజకీయాలు, సమీకరణల్లో చైనా, పాకిస్థాన్ ఒక్కటయ్యే అవకాశం. రష్యా పరోక్షంగా చైనాకు సహకరించే పరిస్థితి ఉందని యుద్ధం గురించి రంకెలు వేసేవారు గమనించాలి. మన దేశానికి వ్యతిరేకంగా దశాబ్దాల పాటు పాకిస్థాన్‌ను అమెరికా ప్రోత్సహించిన కారణంగానే అది ప్రపంచ మిలిటరీలో తొమ్మిదవ స్థానంలో ఉంది. ఆర్థికంగా ఎంత ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ మిలిటరీ ఖర్చుకు వెనకాడటం లేదు. దాని ఆర్థికస్థితి దిగజారటానికి ఇది కూడా ఒక కారణం. చైనా జిడిపి, దాని విదేశీమారక ద్రవ్యనిల్వల వంటి అంశా



లు మిలిటరీకి పెద్ద ఎత్తున ఖర్చు పెట్టేందుకు వీలు కల్పిస్తున్నది, మనమాపరిస్థితిలో ఉన్నామా? మనకు వచ్చే ముప్పు గురించి స్వంత నిఘా, సమాచారాన్ని బట్టి వ్యవహరించాల్సి ఉంటుంది. అమెరికా చెప్పేదాన్ని నమ్ముకుంటే నట్టేటమునుగుతాం. గాల్వన్ ఉదంతాల తరువాత చైనా దళాల కదలికల గురించి అమెరికా చెప్పిన మాటలను నమ్మి ముందుగానే మన మిలిటరీ లడక్ పర్వతాల మీదకు వెళ్లి కూర్చున్నది. తరువాతే చైనా దళాలను మోహరించినట్లు వెల్లడైంది. ఇప్పుడు మనం కొండలనుంచి దిగిరాలేని స్థితి, ఖర్చు విపరీతంగా అవుతున్నది. చైనా వైపునుంచి కొత్తగా దురాక్రమణ యత్నాలు ఉన్నట్లు మన ప్రభుత్వం ఇంతవరకు చెప్పలేదు. అరుణాచల్ సరిహద్దులో చైనా కొత్తగా గ్రామాలను కడుతున్నట్లు కూడా కొన్ని బొమ్మలను చూపి అమెరికా మనలను తప్పుదారి పట్టించేందుకు చూసిన సంగతి తెలిసిందే. ఆధునిక ఆయుధాలు, నిధులతో ఉక్రేన్‌లో రష్యా సేనలను ఒక్కదెబ్బతో వెనక్కు కొట్టగలమని అమెరికన్లు ఇతర నాటో దేశాలను నమ్మించారు. రెండు సం.లు గడిచినా అలాంటి పరిస్థితి కనిపించటం లేదు. మధ్యలో ఇరుక్కున్న ఉక్రేన్ చావుదెబ్బలు తింటున్నది.

అంతరిక్షంలో అమెరికా మిలిటరీ ఆధిపత్యాన్నే సవాలు చేసే స్థితికి చైనా చేరుకుందనే అంశం మనదేశంలో యుద్ధం గురించి కలలు కనేవారికి తెలుసా? ఇటీవలికాలంలో ఈ రంగంలో అమెరికాకు దగ్గరగా చైనా వచ్చిందని, అమెరికా నిశ్చింతగా లైటార్పి పడుకున్నట్లుగా కనిపిస్తోందని ఆ రంగంలో నిపుణుడు డీన్ చెంగ్ చెప్పినట్లు 2023, డిసెంబరు 13న అమెరికా ఎన్‌బిసి న్యూస్ పేర్కొన్నది. ప్రపంచమంతటా అంతరిక్ష ఉపగ్రహాల ద్వారా మిలిటరీ నియంత్రణలో అమెరికా ముందున్నది. వాటిని దెబ్బతీసే, పనికిరాకుండా చేసే, ఆయుధాలను చైనా తయారు చేస్తున్నదని అమెరికా రక్షణశాఖ పెంటగన్ నివేదికలు గగ్గోలు పెడుతున్నాయి. చైనా 2019–21 సంవత్సరాలలో తన ఉపగ్రహాల సంఖ్యను 250 నుంచి 499కి పెంచుకుందని రక్షణ నిఘా సంస్థలు పేర్కొన్నాయి. ఆధునిక నిఘా బెలూన్లు, హైపర్‌సోనిక్ క్షిపణులను ఉపగ్రహాలకు దిగువన, విమానాలు ఎగిరే ఎత్తుకు ఎగువన చైనా మోహరించింది. ఇటీవల ఉపగ్రహాలకు తిరిగి ఇంధనాన్ని నింపే ప్రయోగాన్ని కూడా విజయవంతంగా నిర్వహించింది. ధ్వనికంటే కనీసం 20రెట్ల వేగంతో ప్రయాణించే క్షిపణులు భూమిని చుట్టివచ్చి లక్ష్యాలను దెబ్బతీసేవాటిని చైనా పరీక్షిస్తున్నదని కూడా అమెరికా భయపడుతోంది. అందువలన మన అగ్ని క్షిపణితో చైనాను దెబ్బతీయగలమని ఎవరైనా కలగన్నా, చెప్పినా అది వాస్తవ విరుద్ధం తప్ప మరొకటి కాదు. భూతలం నుంచి ప్రయోగించే ఖండాంతర క్షిపణుల అంశంలో రెండు దేశాల మధ్య ఉన్న తీవ్ర అంతరం కొంత మేర తగ్గుతుంది. నౌకాదళ బలాబలాల్లో మన దేశం ఎంతో వెనుకబడి ఉంది. జలాంతర్గాములు చైనా వద్ద 61 ఉండగా మనకు 18 మాత్రమే ఉన్నాయి.

ప్రతి దేశమూ తన మిలిటరీ పాటవాన్ని పెంచుకొనేందుకే చూస్తున్నది. ఈ విషయంలో పాకిస్థాన్ కూడా వెనుకబడిలేదు. మనకంటే ముందే 2023 అక్టోబరు చివరిలో ఎంఐఆర్‌వి సాంకేతిక పరిజ్ఞానంతో అబాబీల్ అనే క్షిపణి ప్రయోగం జరిపినట్లు డిప్లోమాట్ పత్రిక నవంబరు 18న ఒక విశ్లేషణ వెలువరించింది. మనదేశం బాలిస్టిక్ క్షిపణి రక్షణ వ్యవస్థ(బిఎండి)ను ఏర్పాటు చేస్తున్నందున దానికి విరుగుడుగా ఎంఐఆర్‌వి క్షిపణులను పాకిస్థాన్ రూపొందించినట్లు దానిలో పేర్కొన్నారు. రాజస్థాన్‌లోని ఉదయపూర్ సమీపంలో నిర్మిస్తున్న బిఎండి రాడార్ కేంద్రం 2024లో అందుబాటులోకి వస్తుందని, మరో కేంద్రాన్ని మధ్యప్రదేశ్‌లో నిర్మిస్తున్నట్లు కూడా డిప్లొమాట్ రాసింది. నౌకల మీద కూడా ఇలాంటి రాడార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. ఐఎన్ఎస్ అన్వేష్ అలాంటి నౌకే. ఇవి రెండు నుంచి ఐదువేల కిలోమీటర్ల పరిధిలో క్షిపణులను పసిగట్టి మధ్యలోనే కూల్చివేస్తాయి.తొలిదశలో న్యూఢిల్లీ, ముంబై నగరాలకు రక్షణ కల్పిస్తారు.

మార్చి 11–16 తేదీల మధ్య ఎప్పుడైనా తాము మూడున్నర వేల కిలోమీటర్ల పరిధిలో క్షిపణి ప్రయోగం జరపవచ్చని ఆ పరిధిలోకి వచ్చేవారు తగు జాగ్రత్తలు పాటించాలని మన రక్షణశాఖ ముందస్తు హెచ్చరికలు జారీచేయటం తెలిసిందే. ఆ సంగతి తెలిసే అగ్ని–5 క్షిపణి ప్రయోగాన్ని చూసి భయపడిన చైనా తన గూఢచారి నౌకను విశాఖపట్టణానికి 260 నాటికల్ మైళ్ల దూరంలో లంగరు వేసినట్లు ఒక పత్రిక రాసింది. చైనా తాను జరుపుతున్న ప్రయోగాల గురించి కూడా ముందుగానే ప్రకటిస్తుంది. మనం కూడా చైనా సమీపంలోని అంతర్జాతీయ జలాల్లోకి నౌకలను పంపి నిఘావేయవచ్చు. ఎంఐఆర్‌వి సాంకేతిక పరిజ్ఞానాన్ని సంపాదించుకొనేందుకు 2012 నుంచి మన శాస్త్రవేత్తలు పని చేస్తున్నది, మన అగ్ని క్షిపణుల సామర్థ్యం బహిరంగ రహస్యం. గతంలో ఒక చైనా నౌక శ్రీలంకకు వచ్చినపుడు, ప్రస్తుతం మాల్దీవుల సమీపంలో ఉన్న మరొక నౌక గురించి కూడా ఇలాగే రాశారు. ఇతరుల బలాబలాలను తెలుసుకొనేందుకు మన దేశం ఎలా ప్రయత్నిస్తుందో ప్రతిదేశమూ అదే చేస్తుందన్నది కూడా అందరికీ తెలిసిందే. మనకే అలాంటి హక్కు ఉండాలి, ఇతరులకు కూడదు అంటే కుదురుతుందా! అమెరికా విమానవాహక యుద్ధ నౌకలు, ఇతర మిలిటరీ నౌకలు నిత్యం ప్రపంచమంతటా తిరుగుతుంటాయి, అనేక ప్రాంతాల్లో లంగరు వేయటం తెలిసిందే. అవి విహారయాత్రలు చేస్తున్నట్లు చెప్పగలమా ?

ఎం కోటేశ్వరరావు

# ఆరోగ్య సంరక్షణ కవచం... టీకాస్త్రం

16 మార్చి 1995న దేశవ్యాప్తంగా 'జోనస్ సాల్క్' కనుగొన్న పోలియో టీకాలను భారత చిన్నారులు అందరికీ ఉద్యమం వలె అందించే 'ఓరల్ పల్స్ పోలియో డ్రైవ్' ప్రారంభమైంది. భారతదేశ ప్రజారోగ్య చరిత్రలో అత్యంత ప్రధానమైన మైలురాయికి గుర్తుగా ప్రతియేట 16 మార్చిన 'జాతీయ వ్యాక్సినేషన్ దినం (నేషనల్ వ్యాక్సినేషన్ లేదా ఇమ్యునైజేషన్ డే)'ను పాటించుట ఆనవాయితీగా మారింది. జాతీయ టీకా దినం–2024 నినాదంగా 'టీకా అందరికీ రక్షణనిస్తుంది (వ్యాక్సిన్ వర్క్ ఫర్ ఆల్)' అనబడే అంశాన్ని తీసుకొని, టీకాలకు భయపడే వారితో పాటు టీకాలను వ్యతిరేకించే వారిని కూడా టీకా పరిధిలోకి తీసుకురావడానికి తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి.

**వ్యాక్సిన్లు దివ్య ఔషధాలు:** పలు ప్రమాదకర వ్యాధులను జీవితకాలం నిరోధించడానికి, ప్రజారోగ్య పరిరక్షణకు, ఆరోగ్య నియంత్రణకు, ప్రాణాలు కాపాడటానికి టీకాలే దివ్య ఔషధాలని ఐరాస డబ్ల్యూహెచ్‌ఓ పిలుపునిస్తున్నది. టీకాలతో ఆరోగ్య, ఆర్థిక, సామాజిక ప్రయోజనాలు కూడా కలుగుతాయని, వ్యాధులు సోకకుండా నాటి నేటి వరకు భారతీయుల ఆరోగ్య కవచంగా నవజాత శిశువు నుండే వయోవృద్ధుల వరకు టీకాలు పలు రోగాల పట్ల వ్యాధినిరోధకశక్తిని పెంపొందించడం, జీవితకాలం వ్యాధులు సోకకుండా కట్టడి చేయడం చూస్తున్నాం. గత మూడేళ్లుగా ప్రపంచ మానవాళిని పట్టి పీడిస్తున్న కొవిడ్19 వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తగా టీకాలు మానవ జాతికి వరాలుగా ఆవిష్కరించబడ్డాయి. 'టీకా పితామహుడి'గా పేరుగాంచిన 'ఎడ్వర్డ్ జెన్నర్' స్మాల్‌ఫాక్స్‌కు తొలిసారి టీకా కనుగొన్నారు.

**భారతంలో టీకాల ఉద్యమాలు:** 1940లో పెద్ద ఎత్తున టీకాల ఉద్యమం మొదలైంది. 1960లో ఎంఎంఆర్ (మీసిల్స్, మంప్స్, రుబెల్లా)టీకా, 1972లో ఏకంగా 'స్మాల్‌ఫాక్స్' నిర్మూలన చేయడం చూశాం. గత అర్థశతాబ్దంగా ఇండియాలో ట్యుబర్క్యులోసిస్(టిబి) సోకకుండా బిసిజి(బాసిల్లే కాల్మెట్‌గ్యురిన్) టీకాను తొలిసారి ప్రారంభించారు. టైఫాయిడ్, డిప్తీరియాలు రాకుండా 1978లో టీకాలను ప్రవేశపెట్టారు. 'ప్రపంచ ఇమ్యునైజేషన్ డే'ను 10 నవంబర్‌న విశ్వ మానవాళి సమైక్యంగా నిర్వహించుకుంటున్నాం.

12 ఏండ్లు దాటిన పిల్లలకు కూడా కరోనా టీకాలు 16, మార్చి 2022 నుంచి అందుబాటులోకి వచ్చాయి. 'మిషన్ ఇంద్రధనుష్' గొడుగు కింద 2014 డిసెంబర్ నుంచి సార్వత్రిక టీకా పరిధిలోకి మహిళలు, పిల్లలను చేర్చి వ్యాక్సినేషన్ వసతులను ఇళ్ల వద్దనే వేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పథకం ద్వారా 2030 నాటికి టీకాల కొరతతో పిల్లల మరణాలను ఆసాంతం కట్టడి చేయడానికి ప్రణాళికలు వేస్తున్నారు.

**ఇండియాలో ఉధృతంగా కొవిడ్ –19 టీకా ఉద్యమం:** 16 జనవరి 2021న ప్రారంభమైన కొవిడ్ 19 టీకా ఉద్యమం ద్వారా మార్చి 2023 నాటికి 2.2 బిలియన్ల డోసులు అందించారు. దేశంలో 95 శాతం 12 ఏండ్లు దాటిన ప్రజలకు కనీసం ఒక డోసు, 88శాతం అర్హతగల ప్రజలకు రెండు డోసులు, 2.3 కోట్ల కు పైగా ప్రజలకు బూస్టర్ డోసుల కోవిడ్19 టీకాలు అందడం ఓ మహత్తర సాఫల్యతగా చెప్పవచ్చు. సీరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా తయారు చేసిన కోవిషీల్డ్ టీకాలు, భారత్ బయోటెక్ తయారు చేసిన కోవాక్సిన్ టీకాలు, డా: రెడ్డి ల్యాబ్స్ తయారు చేసిన స్పుత్నిక్‌వి కోవిడ్19 టీకాలను దేశ ప్రజలు తీసుకున్నారని మనకు తెలుసు.

**చికిత్స కన్న నివారణే మిన్న:** వ్యాధుల నివారణ, ప్రజారోగ్య పరిరక్షణ, ఆర్థిక సామాజిక వెసులుబాటు లాంటి పలు ప్రధాన ప్రయోజనాలు కలిగిన టీకా ఉద్యమం విజయవంతం కావడానికి చేయూత ఇవ్వవలసిన బాధ్యత మనందరి మీద ఉన్నది. మన పిల్లలకు సకాలంలో అర్హతగల టీకాలను అందించాల్సిన కనీస కర్తవ్యం తల్లితండ్రులు, కుటుంబ పెద్దల మీద ఉన్నది. వ్యాధి సోకకుండా ముందే జాగ్రత్త పడదాం. 'చికిత్స కన్న నివారణ మిన్న' అని ప్రచారం చేద్దాం.

*(16 మార్చి 'జాతీయ టీకా దినం')*

# ఎఐ టెక్నాలజీతో నేరాన్ని ముందే పసిగట్టొచ్చా?

పోలీసు వ్యవస్థ కన్నా ముందే నేరాన్ని పసిగట్టేంత దమ్ము ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ టెక్నాలజీకి ఉంటుందా..? అలా అయితే అట్లాంటిక్‌లో ఈ టెక్నాలజీని అన్నిరంగాల్లోనూ ఉపయోగిస్తున్నా అక్కడి క్రైమ్ రేటు తగ్గుముఖం పట్టడం లేదు ఎందుకని..? ఇలా చాలా అనామానాలకు దారి తీస్తోంది సరికొత్త టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్. చాలా దేశాల్లో పోలీసు శాఖల్లో కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్–ఎఐ) సేవలను వినియోగించుకోవడం ఈ మధ్య కాలంలో గణనీయంగా పెరిగిందనే చెప్పాలి.

**ఎఐ టెక్నాలజీ ఆపరేటర్ల శ్రమను, సమయాన్ని తగ్గిస్తుంది**

అన్‌ట్రైట్ అనే ఎఐ స్టార్టప్ సంస్థ రూపొందించిన ఈ ఎఐ సాఫ్ట్‌వేర్ సాయం తో రోజూ హంబర్‌సైడ్ విభాగానికి వచ్చే, వేల కాల్స్‌ను అటెండ్ చేయడానికి, వాటిని విశ్లేషించి మరింత సమర్థవంతంగా, వేగంగా పనిచేయడానికి వీలు కలుగుతుందని అన్‌ట్రైట్ సంస్థ చెప్తోంది. ఆ సాఫ్ట్‌వేర్ రూపొందించేందుకు, హంబర్‌సైడ్‌లో రెండేళ్ల కాలానికి సంబంధించిన గృహహింస కేసుల డేటాను సేకరించి, వినియోగించుకున్నారు. తాము రూపొందించిన ఎఐ సాఫ్ట్‌వేర్ ఆపరేటర్లకు అసిస్టెంట్‌గా పనిచేయడమే కాకుండా, వారి శ్రమను చాలావరకు ఆదా చేస్తుందని, ఆ సమయంలో మరింత సమర్థవంతంగా వారు పనిచేసేందుకు దోహదపడుతుందంటున్నారు సంస్థ కో ఫౌండర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ కమీలా.

అన్‌ట్రైట్ ఎఐ స్టార్టప్ సంస్థ రూపొందించిన ఎఐ మోడల్ ఎక్కువ మొత్తంలో సమాచారాన్ని విశ్లేషిస్తుంది. ప్రతి కాల్‌కు సంబంధించిన ఆడియో ట్రాన్స్‌స్క్రిప్ట్ ఫైల్‌ను విశ్లేషించి, దాని ఆధారంగా ఆ కాల్ ప్రాధాన్యాన్ని నిర్ధారిస్తుంది. ఆ ప్రాధాన్యతను పరిగణలోకి తీసుకొని, స్కోరింగ్ ఇస్తుంది. ఆ వచ్చే ఫలితాన్ని బట్టి పోలీసు అధికారి ఎలా స్పందించాలో కూడా సూచిస్తుంది. ఆ స్కోర్‌ను తక్కువ, మధ్య, అత్యధిక స్థాయి స్కోరింగ్ అంటూ విభజించారు. ఎక్కువ స్కోర్ వచ్చిందంటే పోలీస్ అధికారి ఐదు లేదా పది నిముషాల్లోగా కాల్ చేసిన ఘటనా స్థలికి చేరుకోవాలని అర్థం. అన్‌ట్రైట్ సంస్థ చెప్తున్నదాని ప్రకారం, ఎఐ సాఫ్ట్‌వేర్‌తో ఆపరేటర్ల సమయంలో మూడో వంతును ఆదా అవుతుంది. అంతే కాక, ప్రతి కాల్‌కు కేటాయించే సమయం తగ్గిపోతుందని కమిలా




చెప్పారు.

**ఊహించని రీతిలో సేవలు**

ఎఐ మోడల్‌కు నమూనా పరీక్షలు నిర్వహించిన అనంతరం, తరువాతి దశలో ప్రత్యక్ష పరిశీలన నిర్వహిస్తారు. అందు కోసం అన్‌ట్రైట్ సంస్థ ఇప్పటికే ఎమర్జెన్సీ సర్వీసు విభాగాలు, పోలీసులను సంప్రదించింది. పోలీసుల దర్యాప్తులో సహకారంతో పాటు, కేసుల పరిష్కారాల్లోనూ ఉపయోగపడే సమర్థత కృత్రిమ మేధకు ఉంది. గత డేటాను విశ్లేషించి, మనుషుల కంటే వేగంగా పనిచేయగలదు. అయితే, కొన్నిచోట్ల సాంకేతిక లోపాల కారణంగా తప్పులు జరుగుతున్నాయి. ఉదాహరణకు నిరుడు, అమెరికాలో, ఎఐ ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్ నల్లజాతీయులను గుర్తించడంలో విఫలమైందని, ఎఐ సాఫ్ట్‌వేర్ ఆధారంగా కొంతమంది అమాయకులు అరెస్టయ్యారని వార్తలు వచ్చాయి.

కృత్రిమ మేధ ఆధారంగా అభివృద్ధి చేసిన సాఫ్ట్‌వేర్‌లు మూడు ముఖ్యమైన అంశాల్లో ఉపయోగపడతాయి. వాటిల్లో, మొదటిది లైవ్ ఫేషియల్ రికగ్నిషన్. ఇది నిజమైన వ్యక్తి చిత్రాన్ని క్యాప్చర్ చేసుకుని, తన దగ్గరున్న సమాచారంతో వెతికి, ఆ వ్యక్తి ఎవరో చెప్తుంది. రెండోది గత చిత్రాల్లోని ముఖాలను గుర్తించడం. ఈ పని చేయడం ద్వారా ఆ వ్యక్తి ముఖాన్ని, డేటాబేస్‌లో వేలసంఖ్యలో ఉన్న చిత్రాలతో పోలుస్తుంది. మూడో అంశమేంటంటే, ఆపరేటర్, ఫేష్ రికగ్నిషన్‌ల ఆధారంగా అనుమానితుడి పూర్తి వివరాలు తెలుసుకోవడం. ఆపరేటర్ ఆ వ్యక్తి ఫోటోను తీసుకుని, ఆ సాఫ్ట్‌వేర్‌కు ప్రోగ్రామింగ్ చేసిన ఇమేజ్ డేటాబేస్‌లో వివరాల కోసం అన్వేషిస్తారు. 2023 అక్టోబర్‌లో యుకె పోలీసింగ్ శాఖ మంత్రి క్రిస్ ఫిలిప్ మాట్లాడుతూ, రానున్న ఏడాదిలో యుకెలోని పోలీసు శాఖ అంతటా ఫేషియల్ రికగ్నైజ్ సాఫ్ట్‌వేర్ వినియోగం రెట్టింపు చేస్తాం అని చెప్పారు. అదే సమయంలో, యూకేలోని నేషనల్ ఫిజికల్ లాబొరేటరీ (ఎన్పీఎల్) మెట్రోపాలిటన్, సౌత్ వేల్స్ పోలీసు విభాగం వినియోగిస్తున్న మూడు వేర్వేరు ఎఐలను వేర్వేరుగా పరిశీలించింది. తమ పరిశీలనలో టెక్నాలజీ పరంగా దొర్లే పొరపాట్లను అధిగమిస్తూ, ఆధునిక టెక్నాలజీతో ఏఐ టూల్స్ అభివృద్ధి చెందాయని తేల్చారు. వెస్ట్ మిడ్‌ల్యాండ్ పోలీసులు మరో అడుగు ముందుకేసి కొత్త సాంకేతిక పరికరాలను విశ్లేషించేందుకు ఎథిక్స్ కమిటీని వేయాలని నిర్ణయించారు. ఆ కమిటీకి యూనివర్సిటీ ఆఫ్ నార్తంబ్రియాకు చెందిన ప్రొఫెసర్ మారియన్ ఒస్వాల్డ్ నేతృత్వం వహించనున్నారు.

బిబిసితో ఆయన మాట్లాడుతూ, కమిటీ కొత్త ఫేషియల్ రికగ్నిషన్ సాయంతో అనుమానితుడి ఫోటోను తీసుకుని, ఆ ఫోటోను సాఫ్ట్‌వేర్‌లో ఎలా వెతికి పట్టుకుంటుందో చూడాలి అన్నారు. నేర నియంత్రణలో ఎఐ పాత్ర కీలకంగా మారే అవకాశమూ ఉంది. ఏ ప్రాంతాల్లో నేరాలు ఎక్కువ జరుగుతాయి? ఎవరు ఆ నేరాలకు పాల్పడే అవకాశం ఉంది? అన్న విషయాలు డేటా ఆధారంగా అంచనా వేసి, వాటిని నివారించడంలో ఎఐ కీలకంగా మారొచ్చు. 2002లో విడుదలైన సైంటిఫిక్ ఫిక్షన్ థ్రిల్లర్ 'మైనారిటీ రిపోర్ట్' చిత్రం ఈ ఆలోచన ఆధారంగా రూపుదిద్దుకున్నదే. అయితే, ప్రజలు ఈ కల్పనను ఎఐ నిజం చేస్తుందని ఏఐ నిజం చేస్తోంది. యూనివర్సిటీ ఆఫ్ చికాగోకు చెందిన బృందం 90% కచ్చితత్వంలో వారం ముందుగానే జరగబోయే నేరాలను అంచనా వేసే అల్గారిథమ్‌ను అభివృద్ధి చేసింది. ఆ సాఫ్ట్‌వేర్లు అన్నీ ఏకపక్ష చారిత్రక డేటా ఆధారంగా పనిచేస్తున్నాయని అన్నారు కాహ్నా. అమెరికాలో మేం చాలా సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు చూశాం. అవన్నీ భవిష్యత్తులో జరగబోయే నేరాలపై హెచ్చరిస్తాయి అన్నారు.

వివి.వెంకటేశ్వరరావు,
6300866637

# ఇంటర్ విద్యలో అకడమిక్ గైడెన్స్ సెల్ ఏర్పాటు హర్షణీయం

రాష్ట్రంలోని పాఠశాల విద్యలో అకాడమి అంశాలపై దృష్టి పెట్టేందుకు ఎస్‌సిఇఆర్‌టి, కాలేజీయెట్ విద్య (డిగ్రీ కళాశాల విద్య)లో అకడమిక్ వ్యవహారాలు చూడటానికి అకడమిక్ గైడెన్స్ సెల్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇప్పుడు ఇంటర్ విద్యలో కూడా అకడమిక్ అంశాలపై ప్రత్యేకంగా అకడమిక్ గైడెన్స్ సెల్ ఏర్పాటు చేయడం ఇంటర్ విద్యా వ్యవస్థకు మంచి శుభపరిణామంగా చెప్పవచ్చు. 1969 నుండి ఇంటర్ విద్యలో ఇలాంటి ప్రత్యేక ఏర్పాటు జరగలేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల పర్యవేక్షణకు ఇంటర్మీడియట్ విద్యా కమిషనరేట్, ప్రైవేట్ కాలేజీలు పరీక్షల నిర్వహణకు ఇంటర్ బోర్డు వేరువేరుగా ఏర్పాటు చేయడం జరిగింది. విద్యా సంబంధ విషయాలపై దృష్టి పెట్టేందుకు ఈ అకడమిక్ గైడెన్స్ సెల్ ఏర్పాటు చేసే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి, ఉన్నత అధికారుల అనుమతి కొరకు పంపిచినట్లు వార్తలు వస్తున్నాయి. భారతదేశంలోని పాఠశాల విద్యకు సంబంధించి పరిశోధన, ప్రచురణ, విస్తృత శిక్షణ వంటి పలు రకాల కార్యక్రమాలను 1961లో ఏర్పాటు చేయబడిన ఎన్‌సిఇఆర్‌టి చూస్తుంది. అదే విధంగా 1964 లో మన ఉమ్మ డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్(ఎస్ఐఇ) పేరి ట ప్రారంభించి 1976లో దీనిని ఎస్‌సిఇఆర్‌టిగా పేరు మార్చారు. ఈ సంస్థ రాష్ట్ర స్థాయిలో విద్యా పర్యవేక్షణకు, ఉపాధ్యాయ శిక్షణలకు, వివిధ రకాల ఉపాధ్యాయ వృత్తి పూర్వక, వృత్యంతర శిక్షణ కార్యక్రమాల ఏర్పాటు, విద్యా పరిపాలకులకు, ఉపాధ్యాయులకు కార్యాచరణకు సంబంధించిన ముఖ్యమైన విషయాలపై కాన్ఫరెన్స్‌లు, సెమినార్లు, వర్క్ షాప్‌లు ఏర్పాటు చేయడానికి తోడ్పడుతుంది. ఇదేవిధంగా ఇంటర్ విద్యలో అకడమిక్ గైడెన్స్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లయితే ఎన్‌సిఇఆర్‌టి, ఎస్‌సిఇఆర్‌టిమాదిరిగా అకడమిక్ క్యాలెండర్ రూపకల్పన, ఎగ్జామ్స్ షెడ్యూల్ రూపొందించడం, సిలబస్‌ని ఫ్రేమ్ చేయడం, కరికులం (పాఠ్యప్రణాళికల) రూపకల్పన, వాటి యొక్క మార్పులు చేర్పులు చేయడం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మార్గదర్శకత్వం అందించడం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్నటువంటి విద్యార్థులకు ప్రవేశ పరీక్షల సన్నద్ధతకు శిక్షణ ఏర్పాట్లు చేయడం వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడానికి వీలు కలుగుతుంది.

ఇటీవల ప్రకటించిన జెఇఇ మెయిన్స్ 2024 ఫలితాలలో.. దేశంలోనే ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లోని ఇంజనీరింగ్ కోర్సులో ప్రవేశాల కోసం నిర్వహించిన జెఇఇ మెయిన్స్ సెషన్ 1 పరీక్షకు దేశవ్యాప్తంగా 12,95,617 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా అందులో 12,25,529 మంది పరీక్షకు హాజరయ్యారు. ఫలితాల్లో ... దేశవ్యాప్తం గా 23 మంది విద్యార్థులు 300 మార్కులకు గాను 300 మార్కులు సాధించి 100% సాధిస్తే... ఈ 23మందిలో ఒక్క తెలంగాణ రాష్ట్రం నుండే 7 (ఏడు)మంది విద్యార్థులు, ఎపి నుండి 3(ముగ్గురు) విద్యార్థులు అత్యున్నత శాతం మార్కులు (100%) పొందిన వారుగా నిలవడం గర్వించదగినటువంటి విషయం. తెలంగాణ రాష్ట్రంలోని 412 ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుండి ఒక్క విద్యార్థి కూడా ఈ ఫలితాలలో (100% ) స్థానం సాధించకపోవడం బాధాకర విషయం. ప్రత్యేకమైన అకడమిక్ గైడెన్స్ సెల్ లేకపోవడంతో పాఠ్యప్రణాళికల రూపకల్పన, సిలబస్ ఫ్రేమ్ , జాతీయస్థాయి పరీక్షల సన్నద్ధకు శిక్షణ ఏర్పాట్లు సరైన రీతుల్లో రూపొందించకపోవడం తో పేద, బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థు లు దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థ ల్లో ప్రవేశాలు పొందే అవకాశాన్ని కోల్పోతున్నా రు. కావున ఈ అకడమిక్ గైడెన్స్ సెల్ ను వెంటనే ఏర్పాటు చేసేలా ఉత్తర్వులను జారీచేసి, వచ్చే విద్యా సం.(2024–25) ప్రారంభం నాటికి(జూన్1, 2024) కార్యరూపంలోకి వచ్చినట్లయితే... తెలంగాణ రాష్ట్రంలోని 412 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్నటువంటి విద్యార్థులకు దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందే సదవకాశాలను పొందుతారనిఆశిద్దాం.

షేక్ జాన్ పాషా, 7386847203

## లేఖలు

# భజనకారులు కారు... ఉద్యోగులు ఉద్యమకారులు

ఆనాడు ఉద్యోగులు లేని తెలంగాణ ఉద్యమం లేదు, ఈనాడు ఉద్యోగులు లేని తెలంగాణ నిర్మాణం లేదు. మనం సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో, మన ఉద్యమ నాయకులు, మన ప్రభుత్వంలో, మన ఉద్యోగులకు ఇచ్చిన గౌరవం ఎంత....? ఉద్యోగుల అస్తిత్వం లేకుండా చేసినారు.... గతం నుండి గుణపాఠాలు నేర్చుకుని ప్రభుత్వాల రాజకీయ క్రీడలో ఉద్యోగుల హక్కులు, ఉద్యోగులను బలిపశువును చేయకుండా చూసే బాధ్యత ఉద్యోగ సంఘాల నాయకులది. ప్రభుత్వానికి ప్రజల మధ్య వారధి ఉద్యోగులు, ప్రతి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజలకు చేరాలంటే ఉద్యోగులదే ప్రముఖ భూమిక. అలాంటి ఉద్యోగులను నిర్లక్ష్యం చేసి ఉద్యోగు సంఘాల నాయకులకు రాజకీయ పదవులు ఎర వేసి వాడుకోవడం ప్రభుత్వ నైజం. ప్రభుత్వాలు మొదలు ఉద్యోగులతో బాగానే ఉంటారు....ముందు, ముందు, crocodile festival చూపిస్తారు.... ముందు friendly Govt అంటారు, ఆ తరు వాత unfriendly అవుతారు, గత ప్రభుత్వం, ఉద్యోగులకు చేసిన అన్యాయాలు మరచిపోకుండా, తగు మోతాదులో వ్యవహరించాలి.... భజనలు, పాలాభిషేకాలు మాని, ఉద్యోగుల హక్కుల కై సంఘాలు, సంఘాల నాయకులు పాటుపడాలి, సంఘాల నాయకులు, రాజకీయంగ ఏదగాల అనుకునే వారు, ఉద్యోగుల హక్కుల, ప్రభుత్వానికి గిరివి పెట్టి ఎదగ కూడదు, వారు సంఘాల పదవులకు రాజీనామ చేసి, స్వేచ్ఛగా రాజకీయాలలోకి వెళ్లాలి, గత సంఘాల నాయకులు ఉద్యోగులకు చేసిన అన్యాయం కోలుకోలేని విధంగా చేసినట్లు చేయ కూడదని మనవి....ఉద్యోగులు ప్రముఖ భూమిక పోషించి సాధించిన తెలంగాణ రాష్ట్రంలో, కనీసం ఉద్యోగులకు ఆరోగ్య భద్రత లేదు, Health Card అమలు చేయించు కొలేని దుస్థితి కి కారణం, గత సంఘ నాయకుల స్వార్థ రాజకీయ పబ్బం కోసం....దయ చేసి సంఘాల నాయకులను వేడుకోవడం ఏమనగా, మీరు భజనలు మాని, ఉద్యోగులకు రావలసిన హక్కులను పునరుద్ధాటించాలి....కొత్త ప్రభుత్వం లో ఉద్యోగ సంఘాలను ఆహ్వానించి, చర్చించడం మంచిదే....

చోళ ఓంప్రకాశ్ యాదవ్

## న్యాయసేవా సర్వీసులపై నేడు పది లఘు చిత్రాలు ప్రారంభం

### హైకోర్టు సి.జె

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** జాతీయ లీగల్ సర్వీస్ అథారిటీ పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన పది లఘు చిత్రాలను హై కోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే శనివారం ఆవిష్కరించనున్నారు.అందరి చెంతకు న్యాయ సేవలు చేరడంద్వారా మెరుగైన జీవనాన్ని గడిపేందుకు ఉద్దేశ్యంతో జాతీయ లీగల్ సెల్ అథారిటీ రూపొందించిన ఈ పది లఘు చిత్రాలను బంజారా హిల్స్ లోని ప్రసాద్ లాబ్స్ లో హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికి పలువురు హైకోర్ట్ న్యాయ మూర్తులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపి వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలంగాణ లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి ఎస్. గోవర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియచేసారు.

## అత్యంత పారదర్శకంగా గురుకుల బోర్డు నియామకాలు

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** గురుకుల బోర్డు ద్వారా జరిగిన నియామాకాలు 100 శాతం పారదర్శకంగా, నిబద్ధతతో జరిగాయని, ఈ విషయంలో వివిధ మాధ్యమాలలో వస్తున్న వార్తలు అభ్యర్థులను తప్పు ద్రోవ పట్టించే విధంగా ఉన్నాయని టిఆర్ఇఐఆర్‌బి చైర్మన్ ఆయేషా మసరత్ ఖానం వెల్లడించారు. అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగా డి ఎల్ మరియు జే ఎల్ ఫలితాలను ఇవ్వటం జరిగిందని అన్నారు.. డి ఎల్, జే ఎల్ 1:2 లిస్టును ఫిబ్రవరి 15, 16వ తేదీలలో వెబ్ సైట్ నందు పొందు పరచటం జరిగింది. డెమో తేదీలను కూడా అదే రోజు ప్రకటించి ఫిబ్రవరి 19 నుండి 22 వరకు డెమోలను కండక్ట్ చేయటం జరిగింది. డెమోలను కండక్ట్ చేయగానే వెంటనే ఫలితాలను ఫిబ్రవరి 28వ తేదీ డి ఎల్ ఫలితాలను 29వ తేదీన జే ఎల్ ఫలితాలను ప్రకటించామని వివరించారు.. ఎటువంటి అనుమానాలకు తావివ్వకుండానే మార్చి 4వ తేదీన వెంటనే అభ్యర్థులకు నియామక పత్రాలను అందించడం జరిగిందని, అమలులో ఉన్న నిబంధనల మేరకు అన్ని రిజర్వేషన్లు పాటించి పారదర్శకంగా ఎంపికలు జరిపామని తెలియ చేశారు..

## ప్రజావాణికి 1401 దరఖాస్తులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణిలో 1401 దరఖాస్తులు అందాయి. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. చిన్నా రెడ్డి, ప్రజావాణి ప్రత్యేక అధికారి, మున్సిపల్ శాఖ సంచాలకులు దివ్య, ఇతర అధికారులు ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులు స్వీకరించడం తో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల్లో హౌజింగ్ ః: 397, రెవెన్యూః 350, సివిల్ సప్లయిస్ః 114లకు సంబంధించినవి ఉన్నాయి.

## లోక్‌సభ స్థానాలన్నీ కాంగ్రెస్‌కే

### డాక్టర్ మల్లు రవి

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలన్నీ కాంగ్రెస్ గెలుస్తుందని కాంగ్రెస్ సీనియర్ ఉపాధ్యక్షులు డాక్టర్ మల్లు రవి అన్నారు. తెలంగాణలో ప్రజలు తెలంగాణ మోడల్ పాలన కావాలని కోరుకుంటున్నారని, బీజేపీ నాయకులు చెప్పినట్లుగా గుజరాత్ మోడల్ పాలన కోరుకోవడం లేదన్నారు. తెలంగాణ మోడల్ అంటే ఆరు గ్యారంటీల అమలు, రైతు రుణమాఫీ, కులసంఘాలకు కార్పొరేషన్లు, మహిళలకు వడ్డీ లేని రుణాలు అని ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ లో ప్రజలు 200 ఉచిత యూనిట్ల కరెంట్,10లక్షల భీమా, ఇందిరమ్మ ఇండ్లు ,బుసులలో ఉచిత ప్రయాణం కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలు దేశ వ్యాప్తంగా అమలు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.



## ఎన్‌హెచ్‌ఎంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నేషనల్ హెల్త్ మిషన్ స్కీమ్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించకపోతే ఈ నెల 22 నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర అధ్యక్షులు ఎం నరసింహ తెలిపారు. హైదరాబాద్,కోఠి లోని ఎన్ హెచ్ ఎం డైరెక్టర్ కార్యాలయంలో ఆయన శుక్రవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఎం.నరసింహ మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక విపత్కర పరిస్థితుల్లో విధులు నిర్వహించి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న కిందిస్థాయి ఉద్యోగులైన ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రావాల్సిన మూడు నెలల (డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి) వేతనాలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
కార్మికులకు రావాల్సిన ఏడు నెలల పి.ఆర్.సీ ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలని, ప్రతి నెలా 1వ తేదీన కాంట్రాక్టు ఉద్యోగులందరికీ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ స్పందించకపోతే ఎన్ హెచ్ ఎం విధులు బహిష్కరిస్తామని, ఈనెల 22 నుండి తెలంగాణలో ఎన్.హెచ్.ఎం. ఉద్యోగులు నో వర్క్ నో పే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ కన్నా మాట్లాడుతూ గతంలో విడుదల చేసిన 510,730 జీవోలలో కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని, రానున్న పి ఆర్ సి లో కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగుల బేసిక్ వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ను కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఎఎన్ఎంస్ యూనియన్ రాష్ట్ర ట్రెజరర్ జె పద్మ, జయమ్మ, సునీత, స్వాతి ఎన్.హెచ్.ఎం.రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ సుమన్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు..

# ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్‌లు రద్దుచేయడం ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా వల్ల కాదు

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్‌లు రద్ద చేయడం ప్రధాన మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వల్ల కాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రిజర్వేషన్‌లు అమలు జరిగేలా చూసే బాధ్యత తమదన్నారు. ఎల్.బి. స్టేడియంలో శుక్రవారం ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన హాజరయ్యారు.

సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ హయంలో ముస్లిం మైనారిటీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తామని హామీనిచ్చారు. ముస్లీం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. మైనారిటీ స్కూళ్లకు, రెసిడెన్షియల్ భవనాల కోసం ప్రభుత్వం ఇప్పటికే నిధులు విడుదల చేసిందన్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపి అసదుద్దీన్ ఓవైసీ తదితరులు పాల్గొన్నారు.





**హోటళ్లు, దుకాణాలకు ఉదయం 4 గంటల వరకు అనుమతి : షబ్బీర్ అలీ**

రంజాన్ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్‌లో హోటళ్లు, దుకాణాలు ఉదయం 4 గంటలకు తెరచి ఉంటాయని ప్రభుత్వ సలహాదారుడు(ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ) మహ్మద్ అలీ షబ్బీర్ అన్నారు.

సభ వేదికపై షబ్బీర్ అలీ మాట్లాడుతూ హోటళ్లు, దుకాణాలు ఉదయం 4 గంటల వరకు తెరిచి ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించిందని ప్రకటించారు. అందుకు అనుమతులు మంజూరు చేసినందుకు సిఎం రేవంత్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## బిఆర్ఎస్‌కు ఊపిరి పోయడానికే కవిత అరెస్ట్ : జి.నిరంజన్

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** కొన ఊపిరితో ఉన్న బిఆర్ఎస్ కు ఊపిరి పోయడానికే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బిఆర్ఎస్ ఎంఎల్‌సి కవితను అరెస్టు చేశారని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు జి.నిరంజన్ విమర్శించారు.ఇది బిజెపి, బిఆర్ఎస్ కుమ్మక్కై ఆడుతున్న డ్రామా అని ఒక ప్రకటనలో ఆరోపించారు.ఇన్ని రోజులు ఉలుకు పలుకు లేకుండా ఉన్న ఈడి, ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడానికి ఒక రోజు ముందు కవిత ఇంట్లో ఉదయం నుండి సోదాలు చేసి అరెస్టు చేయడం బిఆర్ఎస్ పట్ల సానుభూతిని పెంచడానికేనని అన్నారు.

# కుమ్రం భీమ్ చరిత్రకు ప్రపంచస్థాయి గుర్తింపు తెస్తాం

### రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)

**ప్రజాపక్షం/ కెరమెరి :** ఆదివాసుల ఆరాధ్య దైవం, పోరాట యోధుడు కుమ్రంభీమ్ జీవిత చరిత్ర, పోరాట గడ్డ జోడేఘాట్ ప్రాంతానికి ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకొస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటిపారుదల, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, ఎస్. పి. సురేష్ కుమార్, ఖానాపూర్ నియోజక వర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జులతో కలిసి జిల్లాలో ఆదివాసుల పోరాట గడ్డ, చారిత్రాత్మక ప్రాంతమైన కెరమెరి మండలం జోడేఘాట్ గ్రామాన్ని సందర్శించి, కుమ్రంభీమ్, కుమ్రం సూరు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కుమ్రం భీమ్ స్మారక మ్యూజియంలో సందర్శించి ఆదివాసుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన విగ్రహాలు, పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ జల్‌జంగల్ జమీన్ అనే నినాదంతో ఆదివాసుల హక్కులు, భూమి, భుక్తి కోసం నిజాం సర్కారుతో వీరోచిత పోరాటం చేసి ఆదర్శవంతంగా నిలిచారని, కుమ్రం భీమ్ పోరాడిన ఈ పుణ్య భూమిని సందర్శించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. కుమ్రంభీమ్ పోరాట స్ఫూర్తి, ప్రాణ త్యాగాన్ని గుర్తిస్తూ ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని, కుమ్రం భీమ్ జీవిత చరిత్ర ప్రపంచ స్థాయిలో తెలిసేలా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. జోడేఘాట్ ప్రాంతంలో అసంపూర్తిగా ఉన్న రెండు పడక గదుల ఇండ్ల సంబంధిత బిల్లులను మంజూరు చేయడంతో పాటు నిర్మాణ పనులను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.

జోడేఘాట్ పరిధిలోని 16 గ్రామాలకు రహదారులు, పక్కా ఇండ్లు, సకల మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, పర్యాటకులకు ఎలాంటి ఇబ్బంది ఏర్పడకుండా అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ఆసిఫాబాద్ నుండి నేరుగా జోడేఘాట్ కు వచ్చేందుకు రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. మహనీయుల పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరు ముందుండాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో భీమ్ మనుమడు కుమ్రం సోనేరావు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కోనేరు కృష్ణారావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్రసాద్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునిర్ హైమద్ నాయకులు ఎలప్ప, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుసుంబ్ రా వు, నాయకులు కూటికెల వెంకటస్వామి, దండుగుల శ్రీనివాస్, వాంకిడి సిఐ. శ్రీనివాస్, తహసిల్దార్ దత్తు ప్రసాద్, మ్యూజియం అసిస్టెంట్ క్యూరేటర్ దుందేరావ్, కుమ్రం భీమ్ ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పెందోర్ రాజేశ్వర్, సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఖమ్మం నగరాన్ని తీర్చిదిద్దుతా

### అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శ నగరంగా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నగరంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. 47వ డివిజన్‌లో రూ.70.21 లక్షలు, 57వ డివిజన్‌లో రూ. 72 లక్షలు, ఐదవ డివిజన్‌లో రూ. 72 లక్షలు, రెండవ డివిజన్‌లో రూ. 72లక్షలు, ఎనిమిదవ డివిజన్‌లో రూ.72 లక్షలు, 27వ డివిజన్‌లో రూ.74లక్షలతో చేపట్టే సిసి రోడ్లు, సైడ్ కాలువ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. రూ. 25 కోట్ల అంచనాలతో చేపట్టే ఖమ్మం, కోదుమూరు, అల్లిపురం నాలుగు లైన్ల రహదారి విస్తీర్ణ పనులకు అల్లిపురం వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వర రావు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం నగరా న్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఖమ్మం నగర ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ప్రజలకు మౌలిక వసతులతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ది చేకూర్చనున్నట్లు తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నలువైపులా విస్తరించిన ఖమ్మం నగరాన్ని అభివృద్ధి కోసం నిధుల కొరత లేకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

కార్పోరేషన్‌లో విలీనమైన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించినట్లు ఆయన తెలిపారు. 57వ డివిజన్ వికలాంగుల కాలనీ వద్ద నగర పాలక సంస్థ సిబ్బందికి చెందిన సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ప్రారంభించారు. ఇట్టి మిషనరీ నగర పాలక సంస్థకు చెందిన లిక్విడ్ వెస్ట్ పై పనిచేసే వారికి, మ్యానువల్ స్కావెంజింగ్ కాకుండా మిషనరీతో క్లీనిం గ్ చేసేటట్లుగా నేషనల్ సఫాయి కర్మచారి ఫైనాన్షియల్ కార్పోరేషన్ ద్వారా సబ్సిడీపై రుణ సౌకర్యం ద్వారా అందించబడింది. ఇట్టి యూనిట్ విలువ రూ.19.34 లక్షలు కాగా సబ్సిడీ మొత్తం రూ.8.50 లక్షలు. సబ్సిడీ పోను మిగిలిన మొత్తం వాయిదాల పద్దతిలో చెల్లించాల్సి ఉంటుంది. ఇట్టి మిషనరీ నగర పాలక సంస్థ ఎంగేజ్ చేసుకుని వారికి ఉపాధి కల్పించనుంది. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి, ఆర్అండ్‌బి ఎస్ఈ శ్యాంప్రసాద్, పిఆర్ఎస్ఈ చంద్రమౌళి, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, కార్పొరేటర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





### ధాన్యం తాజా టెండర్‌తో..

# పౌరసరఫరాల శాఖకు రూ.1,110 కోట్ల లాభం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఏడాది క్రితం అకాల వర్షాలతో తడిచిన ధాన్యం విక్రయాల్లో పౌరసరఫరాల శాఖకు రూ.వెయ్యి కోట్లకుపైగా నష్టం వాటిల్లింది. మెట్రిక్ టన్నుకు రూ.3 వేలకుపైగా తక్కువకు టెండర్ కట్టబెట్టినా కొనుగోలుదారులు ఆ మొత్తం కూడా చెల్లించేందుకు ముందుకురాలేదు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ టెండర్లను రద్దు చేసింది. తాజాగా పిలిచిన టెండర్లలో గతం కన్నా ఒక్కో మెట్రిక్ టన్నుకు రూ.3వేలు అదనంగా టెండర్లు దాఖలయ్యాయి. ఈ లెక్కన పౌరసరఫరాల శాఖకు రూ.1,110.51 కోట్లు అదనంగా సమకూరనుంది. కనీస మద్దతు ధర (ఎఎంఎస్ పి) ప్రకారం మెట్రిక్ టన్ను ధాన్యం ధర రూ.20, 600, గత ప్రభుత్వ హయాంలో టెండర్లు పిలిచి మెట్రిక్ టన్నుకు రూ.17,015. 19కు టెండర్లు ఖరారు చేశారు. ఆ లెక్కన 34.59 లక్షల మెట్రిక్ టన్నులకు పౌరసరఫరాల శాఖకు రూ.5,885.55 కోట్లు రావల్సి ఉంది. ఎఎంఎస్‌పి ప్రకారం చూస్తేరూ.1,239. 99 కోట్లు శాఖ నష్టపోయే పరిస్థితి. అంత తక్కువకే టెండర్లు దక్కించుకున్న కొనుగోలుదారులు ఆ మొత్తం చెల్లించేందుకూ ముందుకు రాలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పాత టెండర్లు రద్దు చేసి, మళ్లీ టెండర్లు పిలిచారు. తాజా టెండర్లలో మెట్రిక్ టన్నుకు రూ.20,225.67కు టెండర్ దాఖలైంది. పాత టెండర్‌తో పోలిస్తే ఇది ఒక్కో మెట్రిక్ టన్నుకు రూ.3,210.48 అదనం. ఈ లెక్కన మొత్తం 34.59 లక్షల మెట్రిక్ టన్నులకు తాజా టెండర్ ప్రకారం రూ. 6,996.06 కోట్లు రాబడి సమకూరనుంది. పాత టెండర్ల రాబడితో పోలిస్తే ఇది రూ.1,110.51 కోట్లు అదనం.

## విధ్వంసకర పాలన నుంచి ప్రజా పాలన.. వందరోజుల పనితీరుపై మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** యావత్ తెలంగాణ చరిత్రలోనే ఒక చారిత్రాత్మక రోజు, ఆత్మ గౌరవం పెంపొందిన రోజు అని రెవెన్యూ హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగు లేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దుతూ, గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను గాడిన పెడుతూ లక్ష్యం దిశగా పనిచేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి శుక్రవారం నాటికి వంద రోజులు పూర్తి చేసుకున్న సంధర్భంగా వంద రోజుల పాలనపై మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ కొద్ది రోజుల్లోనే ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ఒకటవ తేదీన వేతనాలు చెల్లించే స్థాయికి చేరుకున్నామని అన్నారు.''గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో తెలంగాణ వివిధ రంగాలలో ముఖ్యంగా ఆర్థికంగా సామాజికంగా విధ్వంసానికి గురైంది. ఎప్పుడైనా ఎక్కడైనా విధ్వంసం అనంతరం ఆయా వ్యవస్థలను పునర్నిర్మించుకోవడం అంత తేలికైన పని కాదు కానీ తెలంగాణను తిరిగి బాగు చేసుకోవడానికి, పునర్నిర్మించుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం తన శక్తినంత కూడగట్టుకొని ఒక్కో అడుగు వేసుకుంటూ ఇచ్చిన వాగ్దానాలు తూచ తప్పకుండా అమలు చేస్తు విజయవంతంగా ముందుకు సాగుతోంది' అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'తెలంగాణ ఉద్యమకారులతో పాటు యావత్ తెలంగాణ ప్రజానీకం సంతృప్తి చెందేలా వంద రోజుల పాలన ఉంది. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను శరవేగంగా అమలు చేస్తూ వంద రోజుల్లో తెలంగాణలోని ప్రతి పౌరుని హదయాల్లో గొప్ప స్థానాన్ని ఈ ప్రభుత్వం సంపాదించుకుంది.'' అని అన్నారు.

## ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టిన 100 రోజుల పాలన: మంత్రి జూపల్లి

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** ప్రజా పాలనే లక్ష్యంగా తాడిత, పీడిత,బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలన కొనసాగుతుందని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా సాహసోపేత నిర్ణయాలతో ప్రజా సంక్షేమ పాలనను సాగిస్తూ సిఎం రేవంత్ రెడ్డి తన పాలనను కొనసాగిస్తున్నారని కొనియాడారు. గత పాలకుల తీరుకు భిన్నంగా రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రభుత్వం వంద రోజుల పరిపాలన ప్రజల అకాంక్షలకు అద్దం పట్టిందని తెలిపారు. నియంతృత్వానికి దూరంగా ప్రజలకు దగ్గరగా ప్రజా పాలన నిరంతరం కొనసాగుతోందని అన్నారు. అస్తవ్యస్తమైన పాలనను గాడీలో పెట్టడం, ఇచ్చిన హామీలను నెరవేర్చడం, రాష్ట్ర అభివద్ధికి బాటలు వేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని ఓ ప్రకటనలో మంత్రి జూపల్లి పేర్కొన్నారు. కనీసం ఆరు నెలలైనా గడవక ముందే పాలనపై ఓ అంచనాకు రావడం కష్టమని అలాంటిది 100 రోజుల్లోనే ఇచ్చిన హామీలను నెరవేరస్తూ, ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకుని ఇది ప్రజా ప్రభుత్వమని నిరూపించామని వెల్లడించారు.

## ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటి కుటుంబ సర్వేకు (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన) ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కులగణన చేపట్టాలని ఇటీవల జరిగిన శాసనసభ తీర్మానం మేరకు బిసి సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి బుర్ర వెంకటేశం శుక్రవారం జిఓ నంబర్ ఎం.ఎస్.26ను జారీ చేశారు. సర్వే నిర్వహించేందుకు రూ.150 కోట్లు ఖర్చు అవుతుందని బిసి కమిషన్ అంచనా వేసింది.

**హర్షం వ్యక్తం చేసిన జాజుల శ్రీనివాస్‌గౌడ్**

రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి, బిసిల జనాభా లెక్కలను సేకరించేందుకు ప్రభుత్వం జివో జారీచేయడం పట్ల బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు.

బిసిల కులగణన నిర్వహించి, బిసిల లెక్కలు తేల్చాలని రెండు దశాబ్దాలుగా బిసిలు చేస్తున్న పోరాటం ప్రభుత్వం విడుదల చేసిన జివోద్వారా ఫలించిందన్నారు. ఈ జివో జారీ చేసినందుకు సిఎం రేవంత్ రెడ్డి, బిసి సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్, బిసి సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి బుర్ర వెంకటేశంకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## 4 డిఆర్‌లు ప్రకటించకపోవడంతో పెన్షనర్లలో విచారం

**ప్రజాపక్షం / హైదరాబాద్:** పెన్షనర్లకు వెంటనే 4 డిఆర్‌లు ప్రకటించాలని, గత ఏడాది జారీ చేసిన జిఓ 186 ప్రకారం ఇహెచ్‌ఎస్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి అమలుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ నెల 12న జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి పెండింగ్ డిఆర్‌లు ప్రకటిస్తామని ఈ నెల 10వ తేదీన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమక్షములో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలుపుకోకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లలో నిరాశ, నిస్పృహలు వ్యక్తమవుతున్నాయని సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.దామోదర్‌రెడ్డి, సెక్రటరి జనరల్ సి.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## సోమవంశ క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** క్షత్రియ సమాజాన్నంతిటిని కలిపి 'శ్రీ క్షత్రియ, సారోళ్ళు సోమ వంశ క్షత్రియ కార్పొరేషన్'ను ఏర్పాటు చేయాలని ఆ సామాజిక వర్గానికి చెందిన నాయకులు ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శ్రీ క్షత్రీయ రాష్ట్ర నాయకులు కొంగల రాంప్రసాద్, సారోళ్ళు క్షత్రీయ రాష్ట్ర నాయకులు బోరేద ప్రవీణ్ కుమార్, జే.వేదాకర్లు ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో విడుదల చేస్తూ రాష్ట్రంలో బిసి వర్గాల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు పలు ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేసిందని, సంక్షేమ పథకాలను అమలు చేయడానికి ప్రభుత్వం ఇలాంటి ఒక మంచి నిర్ణయం తీసుకుందని వారు సంతోషం వ్యక్తం చేశారు. అదే సందర్భంలో ఏ కులాలు అయితే ఎక్కువగా సంక్షేమ పథకాలు అందుకో





లేకుండా అట్టడుగు స్థాయిలో ఉంటున్నాయో అటువంటి కులాలను గుర్తించి, వారికి కూడా సంక్షేమ పథకాలు అందించే విధంగా కార్పోరేషన్లు, సొసైటీలను బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. గత పాలకులు పాటించని క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అయినా ఈ సారి శ్రీ క్షత్రియ, సారోళ్ళు సోమ వంశ క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. స్వాతంత్రం వచ్చి 70 సంవత్సరాలు గడిచినప్పటికీ కూడా ఇప్పటికి తమ కుల సమాజాకి వర్గానికి ఎలాంటి విద్య ఉద్యోగ సంక్షేమ పథకాలు అందలేదన్నారు. తాము కోరినట్లు తమ కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లయితే అన్ని రకాలుగా క్షత్రియ వర్గాలైన శ్రీ క్షత్రియ, రామ జోగి, సారోళ్లు, సోమవంశ క్షత్రియ, అగ్ని కుల క్షత్రియ, జల క్షత్రియ, వన్యకుల క్షత్రియ, ఆర్య క్షత్రియ, తోగాట, వీర క్షత్రియ, భావసార క్షత్రియ, అన్ని కుల సంఘాలను ఒక తాటిపైకి తెచ్చి వారికి సంక్షేమ పథకాలు అందించినట్లు అవుతుందన్నారు.

**డాక్యుమెంట్స్ పోయినవి**

నేను **కాశబోయిన సమ్మయ్య యాదవ్** తండ్రి ఎల్లయ్య, నివాసం: ఇ.నెం. 2-13, అక్కన్నపేట గ్రామం & మండలం, సిద్దిపేట జిల్లా. నేను 17.02.2024 తేదీన అక్కన్నపేట నుండి హుస్నాబాద్ పోతుండగా నా SSC Memo పోయినది. ఎవరికైనా దొరికినచో **9492194324** సెల్ నెంబర్‌కు దయచేసి తెలపగలరు.

ఇట్లు:
**కాశబోయిన సమ్మయ్య యాదవ్**
అక్కన్నపేట, సిద్దిపేట జిల్లా.

SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS24T 7904 | VENKATESHWARLU BEJJALA | APE XTRA LDX BS6 DIESEL | 2020 |
| 2 | TS24T 7352 | BAGGI RAJU | APE XTRA LDX BS6 DIESEL | 2022 |
| 3 | TS24H 8819 | RAMDHAN MUDU | SONALIKA DI 745 | 2023 |
| 4 | TS04UA 6336 | GUNDARAPU RAJU | TATA LPT 3118 CUMMINS FBT-T | 2015 |
| 5 | TS03UA 5894 | BIBAN | MAHINDRA BOLERO-P | 2014 |
| 6 | TS24T 7565 | EERYA BHUKYA | APE XTRA LDX BS6 DIESEL | 2020 |
| 7 | TS26C 2446 | CHINTHA SRAVANTHI | JOHN DEERE 5310 HARVESTER | 2019 |
| 8 | TS26T 6637 | NEMURUKOMMULA RAVI | SWARAJ 843 XM | 2019 |
| 9 | AP29TB 6758 | MOHAN KUMAR GUJJA | TATA LPT 3118 CUMMINS FBT | 2012 |

**AUCTION DATE 16-03-2024**
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును
**SHRIRAM FINANCE LIMITED**
H.No :15-1-237, Shop No. 1, 2 & 3, 2nd Floor Warangal City Center, Beside Guarduan Hospital, Opp : L B College, Mulugu Road ,
Cell : 9849981545 & 9966196881



## శంషాబాద్ విమానాశ్రయంలో రాష్ట్రపతికి ఘనస్వాగతం

ప్రజాపక్షం/ హైదరాబాద్ : హైదరాబాద్ చేరుకున్న భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు శంషాబాద్ విమానాశ్రయంలో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , పలువురు మంత్రులు, సి.ఎస్.శాంతి కుమారి, అధికారులు సాదర స్వాగతం పలికారు. నగర శివారులోని శాంతి వనంలో నిర్వహించే ప్రపంచ ఆధ్యాత్మిక సమ్మేళనాన్ని ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్రపతి హైదరాబాద్‌కు వచ్చారు.ఈ సమ్మేళనంలో భారత్ సహా వందకు పైగా దేశాల నుంచి దాదాపు మూడు వందల మంది ప్రఖ్యాత సర్వమత గురువులు హాజరుకానున్నారు.

## పసునూరు, ఎంఎల్ఏ దానం?

(మొదటి పేజీ తరువాయి)



నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ బిఆర్ఎస్ ఖైరతాబాద్ ఎంఎల్ఏ, మాజీ మంత్రి దానం నాగేందర్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇంచార్జ్ దీపా దాస్ మున్షీతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్ చౌదరీ, విష్ణు నాథ్, మన్సూర్ అలీఖాన్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి తదితరులు ఉన్నారు. దీంతో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే ప్రచారం ఊపందుకుంది. హైదరాబాద్ నగరంలో ప్రాంతంలో కీలక నేతల్లో దానం నాగేందర్ ఒకరు.

## కవిత అరెస్టు (మొదటి పేజీ తరువాయి)

పొందపర్చారు. అయితే తనను ఏ ప్రతిపాదికన అరెస్ట్ చేస్తారని కవిత ఇడి అధికారులను ప్రశ్నించగా, అరెస్ట్‌కు సంబంధించిన అరెస్ట్ మెమోను, అరెస్ట్ చేసేందుకు కారణాలతో కూడిన కాపీని అధికారుల బృందం కవితకు ఇచ్చారు. ఇడి అధికారుల సోదా నేపథ్యంలో బిఆర్ఎస్ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కవిత ఇంటికి చేరుకున్నారు. సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నప్పుడు ఎలా అరెస్ట్ చేస్తారని ఇడి అధికారులను ప్రశ్నించినట్టు సమాచారం. కవితను అరెస్ట్ చేస్తున్నారనే సమాచారంతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు, మాజీమంత్రి టి.హరీశ్‌రావుతో పాటు బిఆర్ఎస్ సెక్రెటరీ జనరల్ కె.కేశవరావు, ఎంఎల్‌ఏ వేముల ప్రశాంత్ రెడ్డి తదితరులు కవిత నివాసం వద్దకు చేరుకున్నారు. తొలుత పోలీసులు వారిని గేటువద్దనే నిలిపివేశారు. కొద్ది సేపటి తర్వాత వారిని లోపలికి అనుమతించారు. కాగా కవితను ఢిల్లీకి తీసుకెళ్లేందుకు ఇడిఅధికారులు ముందే విమానం టికెట్‌ను బుక్ చేశారు.

**అధికారులతో కెటిఆర్ వాగ్వాదం**

కవిత అరెస్ట్ నేపథ్యంలో కెటి.రామారావు ఇడి అధికారులతో వాగ్వాదానికి దిగారు. అరెస్టు చేయబోమని కోర్టులో చెప్పి, ఇప్పుడు, ట్రాన్సిట్ వారెంట్ లేకుండా ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. సుప్రీంకోర్టులో ఇచ్చిన మాటను ఎలా తప్పుతారని , సుప్రీం కోర్ట్ ఇచ్చిన మాట తప్పుతున్న ఇడి అధికారులు కోర్ట్ ద్వారా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అధికారులు ఉద్దేశపూర్వకంగానే శుక్రవారం వచ్చారని ఆరోపించారు. ఇదిలా ఉండగా కవిత అరెస్ట్‌ను అడ్డుకోవద్దని, పార్టీ కార్యకర్తలు శాంతియుతంగా వ్యవహరించాలని కెటిఆర్, హరీశ్ రావు కోరారు.

**నేడు అన్ని నియోజకవర్గాల్లో నిరసనలు : హరీశ్**

బిఆర్ఎస్ ఎంఎల్‌సి కవిత అరెస్ట్‌ను నిరసిస్తూ శనివారం అన్ని నియోజకవర్గాల్లో నిరసన కార్యక్రమాలను నిర్వహించాలని బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు తన్నీరు హరీశ్ రావు పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు.హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఒక కుట్ర ప్రకారమే, నోటిఫికేషన్ వెలువడుతుండగా కవితను శుక్రవారం అరెస్ట్ చేశారని ఆరోపించారు. తమ పార్టీ నాయకులపై కుట్ర జరుగుతోందని, ఇది రాజకీయ కక్ష సాధింపు చర్య అని అన్నారు. కవిత అరెస్ట్‌ను ఆయన తీవ్రంగా ఖండించారు. ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసమే బిజెపి, కాంగ్రెస్ కుట్ర పన్నాయని హరీశ్‌రావు ఆరోపించారు.

**కవితపై కక్ష సాధించే అవసరం మాకు లేదు : కిషన్‌రెడ్డి**

బిఆర్ఎస్ ఎంఎల్‌సి కవితపై కక్ష సాధింపు చర్యలకు దిగాల్సిన అవసరం బిజెపి ప్రభుత్వానికి లేదని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం 12 మంది ఇడి అధికారులు కవిత నివాసానికి వెళ్లి నాలుగైదు గంటలు విచారించిన అనంతరం ఆమెను అదుపులోకి తీసుకున్నారు. కవిత అరెస్ట్‌పై మంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఢిల్లీ మద్యం కేసులో ఎలాంటి నేరం చేయనప్పుడు కవితకు భయమెందుకని ఆయన ప్రశ్నించారు. ఇడి విచారణకు కవిత పూర్తిగా సహకరించాలని సూచించారు. ఇన్నాళ్లూ ఇడి విచారణకు సహకరించకుండా ఆమె తప్పించుకున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఆమె సహకరించనందునే డి నేరుగా ఆమె ఇంటికి వెళ్లిందన్నారు. ఎవరి పైనా కక్ష సాధింపు చర్యలకు దిగాల్సిన అవసరం తమకు లేదన్నారు. ఇడి స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ అని, విచారణ సంస్థలు తమ పని తాము చేసుకునిపోతాయన్నారు.

## పాత్రికేయులకు శిక్షణ

(మొదటి పేజీ తరువాయి)

రెండు రోజుల పాటు, బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లోని సురవరం ప్రతాప్‌రెడ్డి ఆడిటోరియంలో 'వాతావరణంలో మార్పులు, విపత్తులు' అనే అంశంపై జరిగిన జర్నలిస్టుల శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి కె. శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఇప్పటి వరకు వివిధ అంశాల్లో మీడియా అకాడమీ శిక్షణ ఇచ్చేదని, ప్రస్తుత పరిస్థితుల్లో వాతావరణ మార్పులు పర్యావరణం ఆవశ్యకత దృష్ట్యా పాత్రికేయులకు సంపూర్ణ అవగాహన కల్పిస్తామన్నారు. వర్షాకాలంలో రైతులు ఆకాశం వైపు చూస్తుండగా, మిగతా కాలాల్లో అకాల భారీ వర్షాలు, బోర్లు ఎండిపోవడం, మంచినీటి ఎద్దడి తలెత్తడం, కాలాలకు తగినట్టుగా వాతావరణం ఉండటం లేదని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇందుకు వాతావరణంలో వస్తున్న మార్పులే కారణమని అభిప్రాయపడ్డారు. వాతావరణ మార్పులపై పాత్రికేయులకు అవగాహన కల్పించేందుకు ఈ వర్క్‌షాప్ ఎంతో దోహదపడిందని, ఈ విషయాలను శిక్షణ పొందిన పాత్రికేయులు క్షేత్ర స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. యునైటెడ్ స్టేట్స్ కాన్సులేట్ జనరల్ ప్రజా వ్యవహారాల అధికారి అలెగ్జాండర్ మెక్ లార్సన్ మాట్లాడుతూ వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసేందుకు పాత్రికేయులు తమ వంతు కృషి చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విరహత్ అలీ మాట్లాడుతూ వాతావరణ మార్పులు ప్రపంచానికి సవాళ్లు విసురుతున్న నేపథ్యంలో ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన సామాజిక బాధ్యత పాత్రికేయులపై ఉందని అభిప్రాయపడ్డారు. రెండు రోజుల వర్క్ షాప్‌న కు విశేష స్పందన లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యూస్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భీమారావు, సీనియర్ పాత్రికేయులు యు.సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొనగా, కార్యక్రమానికి వ్యాఖ్యాతగా సీనియర్ పాత్రికేలు పద్మావతి వ్యవహరించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి ఈ శిక్షణ తరగతులకు హాజరైన వంద మంది ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు శ్రీనివాస్ రెడ్డి, అలెగ్జాండర్ మెక్ లార్సన్‌లు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు.

# ధ్యానం, సంగీతంతోనే మానసిక ప్రశాంతత

### రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము కన్హాశాంతి వనంలో ఘనంగా ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవం



ప్రజాపక్షం/షాద్‌నగర్: ధ్యానం, యోగ, శాస్త్రీయ సంగీతాలతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము వివరించారు. శుక్రవారం సాయంత్రం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని నందిగామ మండలం కన్హా గ్రామ పంచాయతీలో నిర్వహించిన ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవం, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, రామచంద్రమిషన్ హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము హాజరయ్యారు. వ్యవస్థాపకులు కమలేష్ జీ పటేల్ , యోగా గురువులు ఘనంగా స్వాగతం ఫలికారు. ప్రపంచ వ్యాప్తంగా 300లకు పైగా ఆధ్యాత్మిక సంస్థలు, మత పెద్దలతోపాటు లక్షలాది మంది యోగా అభ్యాసకులు హాజరయ్యారు. విశ్వ ఆధ్యాత్మిక సమ్మేళానాన్ని (గ్లోబల్ స్పిరిచ్యువాలిటీ మహోత్సవం2024)ను భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము మాట్లాడుతూ ప్రపంచ స్థాయి ఆధ్మాతిక సమ్మేళనం ప్రపంచ శాంతికి ఎంతగానో దోహద పడుతుందని వివరించారు. కన్హా శాంతి వనానికి 130దేశాలతోపాటు భారతదేశంలోని వివిధ రాష్ట్రాల నుండి ఆధ్మాతిక గురువులు, యోగా అభ్యాసకులు రావడంతో ఆశ్రమంలో పండుగ వాతావరణం ఏర్పడిందని వివరించారు. నేటి పోటీ ప్రపంచంలో మానసిక ఒత్తిడి ఎక్కువైందని, దాంతో అనేక రకాల వ్యాధులు వస్తున్నాయని, అందుకోసం యోగా ద్వారా మనస్సుకు ప్రశాంతత లభిస్తుందని గుర్తు చేశారు. యోగాతోపాటు శాస్త్రీయ సంగీతాలపై దృష్టి కేంద్రీకరించేందుకు ప్రజలందరు కృషి చేయాలని పేర్కొన్నారు. భారత రాష్ట్రపతి వచ్చిన నేపథ్యంలో కన్హా శాంతివనంతోపాటు చుట్టు పక్కల గ్రామాలలో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. అదే విధంగా ఈనెల 16వ తేదిన ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ హాజరు కానున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఈ ఆధ్యాత్మిక సమ్మేళనానికి చిన్న జీయర్ స్వామి, అభిజిత్ హెల్టర్, ఆచార్య ధీరేంద్ర కృష్ణ శాస్త్రి, రాందేవ్‌బాబా, భావజైన్, బీకే మృత్యుంజయ, బీకే శివానీ, హర్టుఫుల్‌నేస్ సంస్థ గురూజీ కమలేష్ డీ పటేల్, దస్తూరీజీ ఖుర్షద్, దేవి చిత్రలేఖ, స్వామి చిందానంద్, జగద్గురు రామభద్రాయ చారి, మాతా అమృతామయి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్‌తోపాటు సినీ ప్రముఖులు హాజరయ్యారు. మూడు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు గురువారం ప్రముఖ గాయకుడు శంకర్ మహదేవన్ కచేరి నిర్వహించారు. రెండవ రోజు భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, మూడవ రోజు ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ హాజరవుతున్నట్లు రామచంద్ర మీషన్‌ఖ గురుజీ, పద్మభూషణ్ అవార్డు గ్రహీత కమలేష్ డీ పటేల్ తెలిపారు. ఈ ఆధ్మాతిక సమ్మేళనానికి వచ్చిన యోగా అభ్యాసకులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.

## మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

ప్రజాపక్షం/మైదరాబాద్: వంద రోజుల ప్రజాపాలనలో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందపర్చిన ట్టుగా మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియాను అందించింది. ఇటీవల సౌదీలో రోడ్డు ప్రమాదంలో చనిపోయిన రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఇద్దరు కార్మికుల కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని బావుసాయిపేటకు చెందిన బొడ్డు బాబు మూడు నెలల కిందట బైరన్‌లో ప్రమాదవశాత్తూ మరణించారు. బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లిన బాబు చనిపోవటంతో ఆ నిరుపేద కుటుంబానికి దిక్కులేకుండా పోయింది. వేములవాడ రూరల్ మండలం మర్రిపెల్లికి చెందిన 28 ఏళ్ల శశికుమార్ కూడా డిసెంబర్ నెలలో సౌదీలో జరిగిన రోడ్డు ప్రమాదంతో మృతిచెందారు. పెద్దదిక్కును కోల్పోవటంతో ఆయన భార్య, పిల్లలు తల్లడిల్లిపోయారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబీకులు ఇటీవలే వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ను కలిసి కన్నీళ్లు పెట్టుకున్నారు. దీంతో ఈ విషయాన్ని ఆది శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అందుకు స్పందించిన సిఎం వెంటనే ఆ కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం విడుదల చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

## బాగోతం తేలాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

తమపార్టీ బ్యాంకు అకౌంట్లను స్తంభింపజేయడంపై స్వతంత్ర దర్యాప్తు కూడా జరపాలని ఆయన డిమాండ్ చేశారు. అక్రమ మార్గాల్లో ఎన్నికల ప్రయోజనాలకోసం నీచమైన పద్ధతుల్లో ధనాన్ని సేకరించి ప్రజాస్వామ్యాన్ని దిగజార్చిన బిజెపి ఎన్నికల బాండ్ల వ్యవహారం నడపిందని ఆయన విమర్శించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఎన్నికల బాండ్ల ద్వారా బిజెపి దాదాపు 50 శాతం ధనాన్ని ఎన్నికల బాండ్ల ద్వారానే సంపాదించిందని, దేశంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న తమ పార్టీ కేవలం 11 శాతం నిధులు మాత్రమే సమకూర్చుకుందని ఖర్గే ఎక్స్ వేదికగా తెలియజేశారు. ''ఇంకా చాలామంది సందేహాస్పదమైన దాతలు ఉన్నారు, వీళ్ళంతా ఎవరు? ఏ ఏ కంపెనీలకు చెందినవాళ్ళు వీరంతా? ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సిబిఐ, ఐటీ విభాగాల అధికారులు దాడులు చేసిన తర్వాతనే భారీ ఎత్తున అనేక కంపెనీలు ఎందుకు బిజెపికి బాండ్ల కొనుగోలు దాతలుగా మారిపోయారు? బాండ్లు కొనుగోలు చేయాలని ఈ కంపెనీలపై ఒత్తిడి చేసింది ఎవరు?'' అని ఖర్గే ఎక్స్ వేదికపై బిజెపిని నిలదీశారు. ''ఈ విషయంలో క్విడ్ ప్రో కో (నీకింత లాభం –నాకు అంత లాభం) వ్యవహారం నడిచిందనీ, ఈ విషయం తేలాల్సిందే, బిజెపి చేసిన ఎన్నికల బాండ్ల అవినీతిపై ఉన్నతస్థాయిలో సమగ్ర దర్యాప్తు జరపాలని మేం కోరుతున్నాం, అదేవిధంగా లోక్‌సభ ఎన్నికల సమయంలో ఏదో వంకలు పెట్టి మాపార్టీ బ్యాంకు అకౌంట్లను స్తంభింపజేశారు, చాలా అక్రమ పద్ధతుల్లో మా పార్టీ అకౌంట్లను స్తంభిపజేశారు, పార్టీ కార్యకలాపాలపై ఎన్నికలవేళ దెబ్బకొట్టేందుకే ఇలా చేశారు. అక్రమ పద్ధతుల్లో అవినీతి మార్గంలో ప్రభుత్వ వ్యవస్థలను దుర్వినియోగం చేయడం ద్వారా ఎన్నికల బాండ్ల ద్వారా వేలకోట్లు బిజెపి సంపాదించింది'' అని ఖర్గే దునుమాడారు. ''మా పార్టీ బ్యాంకు అకౌంట్లను స్తంభింపజేశారు. ఈ విషయం మాకు ఎంతో ఆందోళన కలిగిస్తోంది, వందలకోట్ల ను అక్రమ మార్గంలో బిజెపి సేకరించచింది, బిజెపికి వ్యతిరేకంగా ఇంతవర కూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు, ఈ అవినీతి బాగోతం బయటకు రావాల్సిందే, దీనిపై సమగ్ర దర్యాప్తు జరగాలి'' అని ఖర్గే ఎక్స్‌వేదిక ద్వారా కోరారు.

**మిగిలిన 3,346 బాండ్లూ ఏమయ్యాయి?**

కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ కూడా ఒక పోస్టు పెడుతూ, ఏ పార్టీకి ఎంత సొమ్ము ముట్టిందో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పూర్తి గణాంకాలు విడుదల చేయాలని కోరారు. కాంగ్రెస్‌పార్టీ కోశాధికారి అజయ్ మకాన్ ఇంతకుముందు మాట్లాడుతూ, 2018 నుండి ఇప్పటివరకూ 22,217 బాండ్లు విడుదలచేస్తే, ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో మాత్రం కేవలం 18,871 బాండ్లు మాత్రమే ఉన్నాయని విమర్శించారు. మిగిలిన 3,346 బాండ్ల వివరాలు, ఆ జాడ ఏమైపోయిందని ఆయన ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం ఈ వివరాలను దాచిపెట్టేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ బాండ్ల వ్యవహారానికీ, ఇడి, ఐటి, సిబిఐ దాడులకు మధ్య ఏ దో పెద్ద సంబంధం ఉందని అన్నారు. ఈ విషయాలపై సుప్రీంకోర్టు ద్వారా సమగ్ర దర్యాప్తు జరపాలని తమ పార్టీ డిమాండ్ చేస్తోందని మకాన్ అన్నారు.

## ఇయు రాష్ట్ర మహాసభలు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ఆర్‌టిసిలో ఉన్న సిబ్బంది, బస్సుల సంఖ్యను బట్టి సంస్థ కార్మికులపై ఎంతటి పని భారం పడిందో ఊహించుకోవచ్చు. 100 రోజుల పాలనలో కనీసం ఆర్‌టిసి గురించి ప్రభుత్వం ముచ్చటించిన దాఖలాలు లేవు. 2017 వేతన సవరణ కనీసం కార్మిక సంఘాలతో చర్చించకుండానే 21 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చారు. ఇది వాస్తవంగా చాలా తక్కువ... పైగా వేతనాల్లో పెద్ద మార్పు వచ్చిందన్న మీడియా ప్రచారంలో వాస్తవం లేని నేపథ్యం. ఇక హెచ్ఆర్ఏ ప్రభుత్వ ఉద్యోగులదే తగ్గించే ఆలోచనలో ఉన్నప్పుడు ఇక ఆర్‌టిసి కార్మికుల వేతనం మరింత తగ్గే అవకాశం ఉంది. 21 శాతం ఫిట్‌మెంట్‌కు సంబంధించి ప్రభుత్వం పునరాలోచన చేయాలని కార్మికులు కోరుతున్నారు. ఇక ఆర్‌టిసి కార్మికులకు యాజమాన్యం తొమ్మిది డిఏల బకాయి చెల్లించాల్సి ఉంది. దీనిపై ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయడం లేదని ఆర్‌టిసి కార్మికులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని స్వాగతిస్తూనే పెరిగిన ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా సంస్థ సిబ్బందిని, బస్సులను, ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరుతున్నారు. ప్రయాణికుల సంఖ్య పెరిగి విపరీతమైన రద్దీ ఏర్పడుతుందని దీని కారణంగా ఆర్‌టిసి కార్మికులు తీవ్రంగా శ్రమించాల్సి వస్తుందని పని భారం కారణంగా తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని కార్మికులు వాపోతున్నారు. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భారతీయ న్యాయ సంహిత చట్టంలో డ్రైవర్ల పట్ల తీసుకున్న వైఖరి హేతుబద్ధంగా లేదు. ఈ చట్టాన్ని అమలు చేస్తే దేశంలో ఎవరు డ్రైవర్‌గా పనిచేసేందుకు ముందుకు రాకపోవచ్చు. కార్మికుల పోరాట ఫలితంగా తాత్కాలికంగా దీనిని వాయిదా వేసిన భవిష్యత్తులో మళ్లీ అమలు చేసే అవకాశం ఉంది. దీనిని పూర్తిగా రద్దు చేయాలని కార్మికులు కోరుతున్నారు. ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర తృతీయ మహాసభల సందర్భంగా ప్రభుత్వానికి తమ సమస్యలను విన్నవించడమే కాకుండా పరిష్కారం చేయకపోతే ఉద్యమ కార్యాచరణకు సైతం పోరాట చరిత్ర కలిగిన ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ సిద్ధమవుతుంది. ప్రధానంగా ఆర్‌టిసి సిబ్బందిని, బస్సులను పెంపుదల చేస్తూ ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వివిధ స్థాయిల్లో నియమాకాలు చేపట్టాలని 21 శాతం ఫిట్‌మెంట్ పై పునరాలోచన చేయాలని, తొమ్మిది డిఏల బకాయిలను వరుస క్రమంలో చెల్లించాలని, యూనియన్ల పునరుద్ధరించాలని అన్నింటికి మించి ఆర్‌టిసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని మహాసభ లో డిమాండ్ చేయనున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి 250 మంది ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరు కానున్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై చర్చించి తగు కార్యాచరణ రూపొందించనున్నారు.

# చేతుల్లోకి పోనీయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

పనిచేయాలన్నారు. సహజ వనరు ఇసుక ద్వారా ఆదాయం పెంచుకోవడమే కాదు, సామాన్యులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత కాలంలో ఉన్న ఇసుక పాలసీని ప్రస్తుతం కొనసాగుతున్నప్పటికీ ఇసుక ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయనే ప్రచారం జరగడం వెనుక కారణాలు విశ్లేషించి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇసుక బహిరంగ వేలం నిర్వహించాలని, వ్యవసాయ మార్కెట్ యార్డులలో ఇసుక అందుబాటులో ఉంచాలని, ఇసుక కోసం ప్రైవేటు వ్యక్తుల వద్దకు వెళ్లాల్సిన పని లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో గృహ నిర్మాణం ఇతర రంగాల్లో ఆదాయం పెంచుకునే మార్గాలను అన్వేషించాలని డిప్యూటీ సిఎం తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ లీజులను సమీక్షించి లీజు ఛార్జీలు పెంచే కసరత్తు చేయాలని ఆదేశించారు. ప్రధానంగా హెచ్ఎండిఏ, ఇండస్ట్రియల్ ఎస్టేట్స్, పర్యాటక రంగంలో ఉన్న లీజులను సమీక్షించాలన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిసరాలపై దష్టి పెట్టాలని హెచ్ఎండిఏ అధికారులకు సూచించారు. ఈ ప్రాంతాల్లో వివిధ విభాగాల ద్వారా సమన్వయం చేసుకుని ఆదాయం పెంచుకునే అవకాశం ఉందని తెలిపారు. ఎల్ఆర్ఎస్ పథకానికి వచ్చిన దరఖాస్తులు వాటి ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో గతంలో బూమ్ రావడానికి కారణాలు, ప్రస్తుతం పరిస్థితిని సమీక్షించారు. మద్యం తయారు చేసే పరిశ్రమల నియంత్రణ, ఉత్పత్తి చేసే ప్రాంతాల్లో నమోదవుతున్న స్టాక్, మార్కెట్లోకి వచ్చినప్పుడు ఉన్న స్టాకు వ్యత్యాసాలను ఎలా గుర్తిస్తున్నారు అడిగి తెలుసుకున్నారు. నాన్ డ్యూటీ లిక్కర్ రాష్ట్రంలోకి ప్రవేశించకుండా తీసుకుంటున్న చర్యలను ఆదాయాన్ని పెంచుకోవాల్సిన అవసరాన్ని డిప్యూటీ సిఎం వివరించారు. ఇతర రాష్ట్రాల్లో మద్య ధరలు, మన రాష్ట్రంలో మద్యం ధరలకు వ్యత్యాసం పై సమీక్షించారు. కల్తీలను నివారించేందుకు ప్రత్యేక హోలోగ్రామ్స్‌తో సెక్యూరిటీ వ్యవస్థ, సరిహద్దుల్లో చెక్ పోస్టులు పెంచడం తదితర అంశాలపై ప్రతి వారం తనకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రాష్ట్రంలోనే మ ద్యం తయారుచేసి పన్ను చెల్లించడం లేదా, ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం సరఫరా మూలంగా రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయంపై ప్రభావం పడుతుందా తదితర అంశాలను మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సామాన్యుడు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి మట్టి తరలించే క్రమంలో పోలీసులు, మైనింగ్ సిబ్బంది ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఈ అంశంలో జాగ్రత్తగా వివరించాలని అధికారులకు మంత్రులు ఉత్తమ్, జూపల్లిలు సూచించారు. రాష్ట్రంలో లైమ్ స్టోన్ ఖనిజాలతో పాటు ఆదిలాబాద్ జిల్లాలో మాంగనీసు అందుబాటులో ఉందని, ఇలా ఇతర జిల్లాల్లోనూ అందుబాటులో ఉన్న ఖనిజాల వివరాలు సేకరించి ఆదాయం పెంచుకునే అవకాశం ఉందని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. గోదావరి నుంచి ఇసుక తరలించే క్రమంలో ఒకే బిల్లుపై మూడుసార్లు అధిక లోడుతో ఇసుక తరలిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయని, ప్రభుత్వానికి ఒక శాతం ఆదాయం ఇస్తుంటే స్థానికంగా రహదారులు ప్రజల ఆరోగ్యం మూడు రెట్లు దెబ్బతింటుందని, ఈ వ్యవస్థను నియంత్రించాలని మైనింగ్ శాఖ అధికారులకు మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. ఇసుక అక్రమ రవాణా నిరోధానికి ప్రతి రీచ్‌లో సిసి కెమెరాలు, ప్రధాన కార్యాలయంలో కమాం డ్ కంట్రోల్ వ్యవస్థ, ఇసుక రవాణా చేసే వాహనాల ట్రాకింగ్ వ్యవస్థను ఆచరణలో పెట్టి పకడ్బందీగా అమలు చేయాలని తద్వారా రాష్ట్రానికి ఆదాయం పెరగడంతో పాటు సామాన్యులకు ఇసుక అందుబాటులోకి వస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. ఎలక్ట్రికల్ వాహనాలపై ఇప్పుడే పనులు విధించే ఆలోచన విరమించుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు అధికారులకు సూచించారు. ఎలక్ట్రానిక్ వాహనాల ఉత్పత్తికి సంబంధించిన పరిశ్రమలు క్రమంగా మన రాష్ట్రంలోకి వస్తున్నాయి ఈ క్రమంలో పనుల భారం మోపితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, ఉపాధిపై ప్ర భావం చూపే అవకాశం ఉంటుంది అని మంత్రి శ్రీధర్ బాబు అధికారులకు తెలిపారు. జిఒ నెం బర్ 188 పరిధిలో కాలనీలా రిజిస్ట్రేషన్, సింగరేణి కార్మికుల కాలనీల రిజిస్ట్రేషన్ తద్వారా ప్ర భుత్వానికి సమకూరే ఆదాయం గురించి మంత్రి శ్రీధర్ బాబు అధికారులతో సమీక్షించారు.

## నేడే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్

(మొదటి పేజీ తరువాయి)

పార్టీలు, క్షేత్రస్థాయిలో అధికారులతో విస్తృత సమావేశాలు నిర్వహించింది. అనంతరం షెడ్యూల్‌ను సిద్ధం చేసింది. షెడ్యూల్ విడుదలైన వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి రానుంది. కాగా, గత లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ మార్చి 10వ తేదీన విడుదలైంది. ఏప్రిల్ 11వ తేదీ ఎన్నికల ప్రారంభం కాగా, దేశ వ్యాప్తంగా మొత్తం ఏడు విడతల్లో ఎన్నికలను నిర్వహించారు. ఓట్ల లెక్కింపు మే 23న నిర్వహించారు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు దాదాపు 97 కోట్ల మంది అర్హత పొందారు. మొత్తం 12 లక్షల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

## త్రిసభ్య కమిటీ (మొదటి పేజీ తరువాయి)

విజ్ఞప్తులు వినతులన్నింటినీ పరిశీలించి, ఉద్యోగుల సమస్యల పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. వీటిని పరిశీలించి సాధ్యాసాధ్యాలు, పరిష్కార మార్గాలను సూచించే బాధ్యతను త్రిసభ్య కమిటీకి అప్పగించారు. ఉద్యోగ సంఘాలు ప్రస్తావించిన అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని పరిష్కారం చే దిశగా సలహాలు సూచనలతో నివేదికను అందజేయాలని కమిటీకి సూచించారు.

## సుప్రీం తిరస్కృతి (మొదటి పేజీ తరువాయి)

ప్రధాన న్యాయమూర్తి సభ్యుడుగా లేని త్రిసభ్య కమిటీ నిర్ణయం చెల్లుబాటు కాదని పేర్కొంటూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. కానీ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడి ధర్మాసనం పిటిషనర్ల వాదనలు తిరస్కరించింది. ఈ కేసును తిరిగి ఈనెల 21వ తేదీన గురువారంనాడు విచారణకు చేపడతామని ధర్మాసనం స్పష్టం చేసింది. 2023 నాటి ఎన్నికల సంఘం చట్టం కింద సుఖ్‌బీర్ సింగ్, జ్ఞానేశ్ కుమార్‌లను ఎన్నికల కమిషనర్లుగా నియమిస్తూ ప్రధానమంత్రి సారథ్యంలోని త్రిసభ్య కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆ ఇద్దరూ 15వ తేదీన ఎన్నికల కమీషనర్లుగా బాధ్యతలు చేపట్టారు. అదే రోజు సుప్రీంకోర్టు ఈ నియామకాల చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై స్టే ఇచ్చేందుకు తిరస్కరించింది. కాగా ఇంకా ఇదే విషయంపై సుప్రీంకోర్టులో దాఖలైన పలు పిటిషన్లు అన్నింటినీ కలిసి ఈనెల 21న తిరిగి విచారణ చేస్తామని జస్టిస్ సంజీవ్ ఖన్నా సారథ్యంలోని ధర్మాసనం స్పష్టం చేసింది.

**కొత్త ఇసిలు బాధ్యతల స్వీకరణ :** భారత ఎన్నికల సంఘంలో కొత్తగా నియమితులైన ఇద్దరు కమీషనర్లు శుక్రవారంనాడు బాధ్యతలు తీసుకున్నారు. మాజీ బ్యూరోక్రాట్లు సుఖ్‌బీర్ సింగ్, సంధు జ్ఞానేశ్ కుమార్‌లు ప్రధాన ఎన్నికల కమీషనర్ రాజీవ్ కుమార్ సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. కొత్త ఇసిల నియామకం విషయం సుప్రీంకోర్టుదాకా వెళ్ళడంతో ఈ అంశం వివాదాస్పదంగా మారింది. వీరి నియామకం చెల్లదని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యుడుగా లేని కమిటీ వారిని ఎలా ఎంపిక చేస్తుందని ప్రశ్నిస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. మొన్నటివరకూ పనిచేసిన కమిషనర్ గోయల్ ఆకస్మికంగా ఆరోగ్య కారణాల పేరుతో రాజీనామా చేయడం ఒక మిస్టరీగా మారడంతో ప్రజల్లో, రాజకీయపార్టీల్లో పలు సందేహాలు తలెత్తాయి. ఈ పరిస్థితులమధ్య ఈనెల 17వ తేదీన లోక్‌సభ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడనున్న తరుణంలో సుఖ్‌బీర్ సింగ్, జ్ఞానేశ్ కుమార్ల నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. బాధ్యతలు స్వీకరించిన ఇద్దరు కొత్త కమీషనర్లకు ప్రధాన ఎన్నికల కమీషనర్ రాజీవ్ కుమార్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇద్దరు కొత్త ఇసిల నియామకం అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్న అంశమని అన్నారు. ఎన్నికల కమీషనర్ చంద్ర పాండే ఫిబ్రవరి 14వ తేదీన పదవీ విరమణ చేశారు. మరో కమీషనర్ అరుణ్ గోయల్ మార్చి 8న రాజీనామా చేశారు. కాగా 1988 ఐఎఎస్ బ్యాచ్ కు చెందిన సింగ్ కేరళకు చెందినవారు. ఉత్తరాఖండ్ కేడర్‌కు చెందినవారు.

## ఎకో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. అవసరమైతే వెంటనే వారిని వెనక్కి రప్పించే చర్యలు చేపడుతామని చెప్పారు. ఏళ్లకేళ్లుగా ఒకే చోట పని చేస్తున్న ఉద్యోగుల బదిలీ చేయాలని, అందుకు వీలుగా బదిలీలపై నిషేధం ఎత్తివేయాలని అధికారులు సమావేశంలో సిఎం దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ముఖ్యమంత్రి పార్లమెంట్ ఎలక్షన్లు ఉన్నందున, ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత బదిలీల ప్రక్రియపై నిర్ణయం తీసుకుందామన్నారు. ఉద్యోగుల పిల్లల చదువులకు కూడా ఇబ్బంది లేకుండా వేసవిలోనే బదిలీల ప్రక్రియ పూర్తి చేస్తే బాగుంటుందని సిఎం అభిప్రాయపడ్డారు. ఒక్క అటవీ శాఖలోనే కాకుండా అన్ని విభాగాల్లోనూ ఏళ్లకేళ్లుగా ఒకే చోట పాతుకుపోయిన ఉద్యోగులను బదిలీ చేసేలా సాధారణ బదిలీలకు మార్గదర్శకాలు కూడా తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కాలుష్య నిబంధనలు, ప్రమాణాలను పాటించే పరిశ్రమలను ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రతి ఏడాది పర్యావరణ దినోత్సవం వంటి సందర్భాన్ని పురస్కరించుకొని జీరో పొల్యూషన్ పాటించే సంస్థలకు ప్రశంసా పత్రాలను అందించాలని చెప్పారు. కరీంనగర్, వరంగల్, ఖమ్మం నగరాలకు అందుబాటులో ఉండేలా సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, విద్యుత్తు ఉత్పత్తి చేసే ప్లాంట్లను ఏర్పాటు చేయాలని, ఎక్కడ అనువైన ప్రాంతాలున్నాయో పరిశీలించి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిబంధనలను అతిక్రమించి ప్లాస్టిక్ తయారు చేసే పరిశ్రమలకు నోటీసులు ఇవ్వాలని, భారీగా జరిమానాలు విధించాలని చెప్పారు. రాష్ట్రానికి మంజూరైన 81 మంది ఐఎఫ్ఎస్ పోస్టుల్లో ప్రస్తుతం 55 మంది మాత్రమే ఉన్నారని, మిగతా 26 ఐఎఫ్ఎస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చర్చ జరిగింది. ఖాళీలు లేకుండా సరిపడే సంఖ్యలో ఐఎఫ్ ఎస్ లను కేటాయించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని నర్సరీల్లో దాదాపు 22 కోట్ల మొక్కలు అందుబాటులో ఉన్నాయని అధికారులు సీఎంకు నివేదించారు. జూన్ లో వర్షాకాలం ఆరంభంలో వీటిని నాటేందుకు ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. అడవుల్లో చెట్ల నరికివేతతో ఖాళీ అయిన ప్రాంతాల్లో మొక్కలు పెంచాలని, అవసరమైతే అక్కడే బోర్లు వేయించి నీరు అందేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఆక్రమణకు గురవుతున్న పారెస్ట్ ల్యాండ్ ల చుట్టూ కాంపౌండ్ వాల్ లేదా ఫెన్సింగ్ వేసి కాపాడే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కేంద్రం నుంచి వచ్చే కాంపా నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఎవరిచ్చారో ఎలా తెలుస్తుంది?

(మొదటి పేజీ తరువాయి)

విధులు సక్రమంగా నిర్వహించాలని, ఎనికల బాండ్లకు సంంధించి యూనిక్ ఆల్ఫా న్యూమెరిక్ నంబర్లను బహిర్గతం చేయాలని అప్పుడే ఏ రాజకీయపార్టీకి ఎంత విరాళం ముట్టిందో వివరాలు తెలుస్తాయనీ ధర్మాసనం పేర్కొంది. జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌తోపాటు ఈ ధర్మాసనంలో జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ జె.బి.పార్థీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా కూడా సభ్యులుగా ఉన్నారు. ఈ కేసును తదుపరి ఈనెల 18వ తేదీ సోమవారం తిరిగి విచారణ చేస్తారు. ''ఎస్‌బిఐ తరపున ఎవరు కేసు విచారణకు హాజరయ్యారు? ఎందుకంటే మా తీర్పులో చాలా స్పష్టంగా ఆదేవాలు జారీ చేశాం, ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలు ఎవరు కొనుగోలు చేశారు? ఏ తేదీన కొనుగోలు చేశారు? ఏ పార్టీ తరపున నిధులు ముట్టాయి? వంటి సమాచారం తెలియజేయాలని చెప్పాం, బాండ్ల నెంబర్లు కూడా ఇవ్వమని చెప్పాం, ఈ వివరాలన్నీ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమకూర్చవలసి ఉంటుంది'' అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఏ బాండు ఎవరు కొనుగోలు చేశారో స్పష్టంగా తెలియాలంటే యూనిక్ ఆల్ఫా న్యూమెరిక్ నంబర్లు కూడా సంబంధిత వ్యక్తి పేరుతో సరిపోవాలి, ఆ సమాచారం అంతా సమకూర్చండి అని ధర్మాసనం ఆదేశించింది. ''ఎస్‌బిఐ ఇంతవరకూ బాండ్ల నెంబర్లు బహిర్గతం చేయలేదు, వాటిని వెంటనే బహిర్గతం చేయవలసి ఉంటుంది'' అని జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. ''వాళ్ళకి (ఎస్‌బిఐ) ఎలాంటి మినహాయింపూ ఉండదు, ఎందుకంటే వారు కోర్టుకు విధేయంగా ఉండాలి, కోర్టు అడిగిన సమాచారం సమకూర్చాలి'' అని చంద్రచూడ్ హెచ్చరించారు. మార్చి 11 వ తేదీన సుప్రీంకోర్టు ఎస్‌బిఐ విజ్ఞప్తిని తోసిపుచ్చి చిన్న మార్పు చేసింది. ఈనెల 12వ తేదీ నాటికి సమాచారం సమకూర్చాలని, 15వ తేదీ నాటికి ఎన్నికల సంఘం ఈ సమాచారాన్ని వెబ్‌సైటులో అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. ఐతే ఎన్నికల సంఘం ఒకరోజు ముందే సమాచారాన్ని అప్‌లోడ్ చేసింది. ఎన్నికల సంఘానికి సీల్డు కవరు ఏదీ రాలేదని తెలియజేసింది. ఎస్‌బిఐ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ హాజరయ్యారు. 2019 ఏప్రిల్ 12వ తేదీన, గత ఏడాది నవంబరు 2వ తేదీన సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేస్తూ ఎన్నికల సంఘం సీల్డు కవర్లలో దాతల వివరాలు సమర్పించాలని పేర్కొంది. తర్వాత ఈ ఏడాది ఫిబ్రవరి 15వ తేదీన అసలు ఎన్నికల బాండ్లను పూర్తి రద్దు చేయాలని చరిత్రాత్మకమైన తీర్పు చెప్పింది.



## ఎంపిగా గెలిపిస్తే సేవకుడిలా పనిచేస్తా : వంశీచంద్‌రెడ్డి

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : పాలమూరు న్యాయయాత్రకు ప్రజలు చూపించిన ప్రేమ, ఆప్యాయత విశ్వాసాన్ని దృష్టిలో పెట్టుకుని కల్వకుర్తి నియోజకవర్గంలోని స్వగ్రామం శేరి అప్పారెడ్డిపల్లిలో ఉన్న నా ఓటుతో పాటు నా భార్య అశ్లేష రెడ్డి ఓటును మహబూబ్‌నగర్ పట్టణానికి బదాలాయింపు చేసుకున్నట్లు సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి నుంచి మహబూబ్‌నగర్‌కు ఓటు బదలాయించడానికి జిల్లా కేంద్రంలో అర్బన్ తహసీల్దార్ కారాల్యంలో శుక్రవారం దరఖాస్తు అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రజల ఆదరణ, నమ్మకాన్ని మరిచిపోలేనని అన్నారు. పార్టీ కార్యకర్తలు నన్ను కంటికి రెప్పలా చూసుకుంటున్నారని, వారి రుణం తీర్చుకుంటానని తెలిపారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గ ప్రజలు నన్ను ఆదరించి ఎంపీగా గెలిపిస్తే పూర్తి సమయాన్ని నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమానికి, ప్రజలకు కేటాయిస్తానని తెలిపారు. ఆయన వెంట టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎన్.వినోద్ కుమార్, జిల్లా మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్ తదితరులు ఉన్నారు.

## హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశానికి లక్కీ డ్రా



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : విద్యా సంవత్సరం 2024–2025 గాను బేగం పేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో 1వ తరగతి లో ఉచిత విద్యను పొందేందుకు అర్హులైన ఎస్‌సి విద్యార్థుల నుండి దరఖాస్తులను స్వీకరించి జిల్లా నుండి ఒక సీటుకు లక్కీ డ్రా ద్వారా చిట్యాల మన్విత్ మహమ్మదాబాద్ మండలంను ఎంపిక చేసినట్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన రావు తెలిపారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ భవనం లోని సమావేశ మందిరంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్ . మోహన్ రావు , జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డి.డి పాండు, జిల్లా విద్యా శాఖ అధికారి, ముగ్గురు హెడ్మాస్టర్లు సంబంధిత జిల్లాల నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిటీ విద్యార్థుల తల్లి దండ్రుల సమక్షంలో లక్కీ డ్రా తీసి ఒక సీటుకు చిట్యాల మన్విత్ ను ఎంపిక చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ డి.డి.పాండు మాట్లాడుతూ మొత్తం 17 దరఖాస్తులు స్వీకరించగా, అందులో సరిపడా వయస్సు, కుల ధ్రువీకరణ పత్రం లేకపోవడం, తదితర కారణాల వలన మూడు దరఖాస్తులు తిరస్కరించినట్లు మిగిలిన 14 దరఖాస్తులు నుండి లక్కీ డ్రా ద్వారా మహమ్మదాబాద్ మండలం చిట్యాల మన్విత్ ఎంపిక అయినట్లు తెలిపారు. అదనంగా ఇద్దరిని వెయిటింగ్ జాబితా ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు.

## డిఎస్‌సి కోచింగ్ దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలకు చెందిన ఎస్‌సి అభ్యర్థులకు రెసిడెన్సియల్ పద్ధతి లో రెండు నెలల డిఎస్‌సి ఉచిత కోచింగు ప్రోగ్రాంకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి వి.పాండు, ఎస్‌సి స్టడీ సర్కిల్ డైరెక్టర్ కాడం శ్రీనివాస్‌లు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోచింగు ప్రోగ్రాంకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు డిఎస్‌సి–2024 టీచర్స్ రిక్రూట్ మెంట్ పరీక్షకు దరఖాస్తు చేసుకుని ఉండవలెనని తెలిపారు. డైట్ , బీఈడి, రెండింటి నందు ఉత్తీర్ణత సాధించాలని, టెట్ నందు కూడా తప్పనిసరిగా ఉత్తీర్ణులై ఉండాలని వారు తెలిపారు. అభ్యర్థులు కుటుంబ వార్షిక ఆదాయం 3 లక్షలకు మించరాదని తెలిపారు. ప్రస్తుతం ఉద్యోగంలో ఉన్నవారు, ఇతర కోర్సులు చేసేవారు, ఇంతకుముందు జిల్లా కేంద్రాలలో ప్రభుత్వం అందించిన కోచింగు తీసుకున్న వారు కోచింగ్ ప్రోగ్రాంకు అర్హులు కారని వారు తెలిపారు. పై అర్హతలు కలిగిన మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలకు చెందిన ఎస్సి అభ్యర్థుల నుండి ఈ నెల 26 లోగా వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి వి.పాండు ఎస్సి స్టడీ సర్కిల్ డైరెక్టర్ కాడం శ్రీనివాసులు ఈ ప్రకటన లో తెలిపారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ నందు నోటిఫికేషన్ సందర్శించగలరని వారు తెలిపారు.

## పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

### డిఇఓ గోవిందరాజులు



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : పదోతరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ పకడ్బందీ ఏర్పాట్లు పూర్తిచేసిందని డిఇఓ గోవిందరాజులు తెలిపారు. శుక్రవారం గగ్గలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు హాల్‌టికెట్లను అందజేశారు. ఈసందర్భంగా డిఇఓ మాట్లాడుతూ పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని పదోతరగతి విద్యార్థులకు సూచించారు. పరీక్షకేంద్రాల ఏర్పాటు, విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఉండేలా వసతుల కల్పనకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల నిర్వహణ అధికారి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌రావు, నోడల్ అధికారి కుర్మయ్య, ఓపెన్‌స్కూల్ కో ఆర్డినేటర్ నాగరాజు, జిల్లాసైన్స్‌అధికారి కృష్ణారెడ్డి, స్ట్రాంగ్‌టీచర్ వెంకటేశ్వరశెట్టి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిఎఎ, ఎన్ఆర్‌సి రద్దు చేయాలి

### సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్



ప్రజాపక్షం/పాన్‌గల్ : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సిఏఏ ఎన్ఆర్సీని రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జబ్బార్ అన్నారు. పాన్‌గల్ మండల కేంద్రంలోని శుక్రవారం సిపిఎం పార్టీ పాన్‌గల్ మండల నాయకులు ఎం. వెంకటయ్య అధ్యక్షతన సమావేశంను నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందాలని ఉద్దేశంతో ఎటువంటి చర్చ లేకుండా ఆగమేఘాల మీద తీసుకొచ్చిన సిఏఏ ఎన్ఆర్సీని రద్దు చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నదన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎమెల్సీ ఎన్నికల కోడ్ పేరుతో 200 యూనిట్ల ఉచిత కరెంటును అమలుకు ఆటంకంగా మారిందని, ఈ నేపథ్యంలో ప్రజలందరికి జీరో బిల్లులు ఇచ్చే విధంగా ఎన్నికల కమిషనర్‌కు ముఖ్యమంత్రి లేఖ రాసి పక్క అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల నాయకులు, వేణుగోపాల్, జంబులయ్య, భీమయ్య, జి. వెంకటయ్య, కాజా, సూర్యవంశం రాము, ఎన్. ఆంజనేయులు పాల్గొన్నారు.

## బాండ్ల కొనుగోలులో హైదరాబాద్ మేఘా సంస్థదే రెండోస్థానం

# బిఆర్‌ఎస్‌కు రూ.1,214.7 కోట్లు విరాళాలు

న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్ల కొనుగోలు ద్వారా దేశంలో రాజకీయపార్టీలకు భారీగా విరాళాలు ఇచ్చిన రెండవ అతిపెద్ద కంపెనీ ఏదైనా ఉందంటే అది కేవలం హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న మేఘ ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ(ఎంఇఐఎల్). గోదావరి నది నుండి తెలంగాణలోని ప్రాంతాలకు నీటిని సరఫరా చేసేందుకు ఉద్దేశించిన రూ.1.51 లక్షల కోట్లు విలువైన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం (కెఎల్‌ఐపి) పనులు చేసింది. ఎన్నికల సంఘం విడుదల చేసిన సమాచారం ప్రకారం, తెలంగాణ రాష్ట్రాని రెండు విడతలుగా పాలించిన కె.సి.ఆర్ నాయకత్వంలోని బిఆర్‌ఎస్ పార్టీకి 2019 నుండీ 2023 వరకూ ఎన్నికల బాండ్ల ద్వారా రూ.1,214.7 కోట్లు విరాళాలు లభించాయి. ఇచ్చింది. బిజెపి, తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్‌పార్టీల తర్వాత అత్యధికంగా, భారీగా విరాళాలు పొందిన నాలుగోపార్టీ బిఆర్‌ఎస్ పార్టీ అని కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ విడుదల చేసిన సమాచారం వెల్లడించింది. 2020 అక్టోబరులో రూ.20 కోట్లు విలువైన ఎన్నికల బాండ్లను ఈ సంస్థ కొనుగోలు చేసిందని కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. పారిశ్రామికవేత్త పరిమిరెడ్డి పిచ్చిరెడ్డి ఈ అన్‌లిస్టెడ్ ప్రైవేటు కంపెనీని 1989లో స్థాపించారు. మేఘా ఇంజనీరింగ్ ఎంటర్‌ప్రైజెస్, మాన్యుఫ్యాక్చరింగ్ పైప్స్ ఫర్ మునిసిపాలిటీస్ అనే పేరుతో ఈ కంపెనీ పెట్టారు. తర్వాత ఈ కంపెనీ తన పేరును మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌గా 2006లో మార్చుకుంది. పెద్ద పెద్ద డ్యామ్‌లు, సహజవాయువు పంపిణీ నెట్‌వర్క్, విద్యుత్ ప్లాంట్లు, రోడ్ల నిర్మాణం వంటి భారీ ప్రాజెక్టులను చేపట్టింది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే చాలా తక్కువమందికి తెలిసిన ఈ కంపెనీ ఇటీవలి సంవత్సరాలలో ప్రతిష్టాత్మకమమైన జోజిలా టన్నెల్ నిర్మాణ ఒప్పందంతోపాటు ఇతర ప్రాజెక్టులు చేపట్టింది. సిటీ గ్యాస్ నిర్వహిస్తోంది. ఒక మీడియా గ్రూపును కూడా నిర్వహిస్తోంది. 2020లో జోజిలా సొరంగం ప్రాజెక్టును 2020 ఆగస్టులో మేఘా సంస్థ చేపట్టింది. 2020లో జమ్మూ కశ్మీలో అన్ని కాలాలలోనూ బ్రహ్మాండంగా ఉపయోగపడే సొరంగ నిర్మాణ ప్రాజెక్టును చేపట్టింది. తర్వాత రిటైల్ సిఎన్‌జిలకు, పైపుల ద్వారా కొన్ని నగరాల్లో వంటగ్యాస్ సరఫరాకు ప్రాజెక్టులు చేపట్టింది. 2019–20, 2023–24 మధ్యకాలంలో ఈ సంస్థ రూ.966 కోట్లు విలువైన ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసింది. కాగా పరిమిరెడ్డి పిచ్చిరెడ్డి మేనల్లుడు పి.వి.కృష్ణారెడ్డి 1991లో ఆయనతో జత కలిశారు. కంపెనీ నిర్వహణలో ఆయన భాగస్వామ్యమయ్యారు. ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, కేంద్ర పాలిత జమ్మూ కశ్మీర్ సహా దేశంలోని అనేక ప్రాంతాలలో ఈ సంస్థ అనేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను నిర్మించింది. విద్యుత్, ఇవి, నీటిశుద్ధి ప్రాజెక్టులను నిర్వహించింది. ఆసియాలోనే అతి పెద్దదైన జోలియా రోడ్ టన్నెల్ ప్రాజెక్టును ఈ సంస్థే న్విహించింది. కశ్మీరు లోయలో ఈ ప్రతిష్టాత్మకమైన సొరంగ మార్గాన్ని రూ.4,500 కోట్లతో నిర్మించింది. కశ్మీరు లోయను లఢఖ్ ప్రాంతంలో కలిపే రోడ్డు ఇద. ఉత్తర ప్రదేశ్‌లో అంతర్రాష్ట విద్యుత్ లైన్ల నిర్మాణ ప్రాజెక్టులు నిర్వహించింది. కర్ణాటక ప్రభుత్వం తలపెట్టిన జలజీవన్ మిషన్‌లో భాగంగా యాద్గిరిలో అనేక గ్రామాలకు నీటి సరఫరా ప్రాజెక్టులు నిర్వహించింది. రేణిగుంట నాయుడుపేట రోడ్ ప్రాజెక్టు, ఆంధ్రప్రదేశ్‌లో 960 మెగావాట్ల పోలవరం హైడ్రో పవర్ ప్రాజెక్టులను కూడా ఈ సంస్థే నిర్వహించింది. 2023లో ఈ సంస్థ అన్ని ఖర్చులూ పోను రూ.1,345 కోట్లు లాభాలు చూపించింది. రూ.14,341 కోట్లు ఆదాయాలు చూపించింది. అదేవిధంగా ఈ ఎన్నికల బాండ్ల వివాదం తలెత్తాక పిటిఐ వార్తాసంస్థ ఎంఇఐఎల్ సంస్థను ఇటీవల ఒక ప్రశ్న అడిగింది. కానీ ఈ కంపెనీ అందుకు సమాధానం చెప్పకుండామౌనంగా ఉండిపోయింది.

# ప్రాంతీయ పార్టీలకు రూ.5వేల కోట్ల విరాళాలు

## బిజెపి కన్నా రూ.839 కోట్లే తక్కువ!

న్యూఢిల్లీ : ఎన్నికల సంఘం తన వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిన ఎలక్టోరల్ బాండ్ల వివరాల ప్రకారం దేశంలో ప్రాంతీయ పార్టీలకు కూడా భారీగానే లబ్ధి చేకూరినట్లు స్పష్టమవుతోంది. 2019 ఏప్రిల్ 2024 జనవరి మధ్య ఎలక్టోరల్ బాండ్ల ద్వారా ప్రాంతీయ పార్టీలు రూ. 5,221 కోట్లకుపైగా విరాళాలు అందుకున్నాయి. బిజెపికి రూ.6,061 కోట్ల విరాళాలు రాగా, ఆ తర్వాత ప్రాంతీయ పార్టీలకే ఎక్కువగా విరాళాలు అందాయి. ఆ పార్టీకి వచ్చిన విరాళాలతో పోలిస్తే ప్రాంతీయ పార్టీలకు వచ్చిన విరాళాలు రూ.839 కోట్లు మాత్రమే తక్కువ కావడం గమనార్హం. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా మరో జాతీయ పార్టీ కాంగ్రెస్‌కు 1,422 కోట్ల విరాళాలు రాగా, ఆమ్ ఆద్మీ పార్టీకి కేవలం రూ. 65.45 కోట్ల విరాళాలు వచ్చాయి. జాతీయ పార్టీలు, బిఎస్‌పి, సిపిఐ(ఎం), ఎన్‌పిపి ఎలక్టోరల్ బాండ్ల ద్వారా ఎటువంటి నిధులను పొందలేదు. ప్రాంతీయ పార్టీల్లో తృణమూల్ కాంగ్రెస్ అత్యధికంగా రూ.1,609.53 కోట్లు సమీకరించింది. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా టిఎంసికి వచ్చిన విరాళాలు 22 ప్రాంతీయ పార్టీలు అందుకున్న మొత్తం విరాళాల్లో 30 శాతం ఉండడం విశేషం. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బిఆర్‌ఎస్‌కు రూ.1,214.70 కోట్లు, బిజు జనతా దళ్‌కు రూ.775.50 కోట్లు, డిఎంకెకు రూ.639 కోట్లు, వైసిపికి రూ.337 కోట్లు, టిడిపికి రూ.218.88 కోట్లు, శివసేనకు 159.38 కోట్లు విరాళాలుగా అందాయి. అదే విధంగా ఆర్‌జెడికి రూ.73.5 కోట్లు, జెడిఎస్‌కు రూ.43.40 కోట్లు, సిక్కిం క్రాంతికారీ పార్టీకి, రూ.36.5 కోట్లు, ఎన్‌సిపికి రూ.31 కోట్లు, జనసేనకు రూ.21 కోట్లు, జెడియుకు రూ.14కోట్లు, జెఎంఎకు రూ.13.5 కోట్లు, ఎఐఎడిఎంకెకు రూ.6.05 కోట్లు, సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్‌కు రూ.5.5 కోట్లు వచ్చాయి.

**మూడు పార్టీలకు కోటి కన్నా తక్కువే**

మహారాష్ట్రవాది గోమంతక్ పార్టీ, జమ్ముకశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్, గోవా ఫార్వర్డ్ పార్టీలకు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా కోటి రూపాయల కంటే తక్కువ విరాళాలు వచ్చాయి. అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ నివేదిక ప్రకారం 2018 మార్చి నుంచి 2024 జనవరి వరకు రూ.16,518 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్‌లను విక్రయించారు.

**మొత్తం బాండ్లలో 54.77 శాతం బిజెపికే**

ఎలక్టోరల్ బాండ్ల ద్వారా అత్యధికంగా రూ. 6,566 కోట్లతో మొత్తం బాండ్లలో 54.77 శాతం విరాళాలను అందుకుంది. కాంగ్రెస్ రూ.1,123 కోట్లతో 9.37 శాతం, తృణమూల్ కాంగ్రెస్ రూ. 1,092 కోట్లతో 9.11 శాతం విరాళాలను అందుకున్నాయి. 2019 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 15 మధ్యకాలంలో దాతలు మొత్తం 22,217 ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేశారు. వాటిలో 22,030 బాండ్లను రాజకీయ పార్టీలు విత్ డ్రా చేసుకున్నాయని ఎస్‌బిఐ సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొంది. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఎన్నికల సంఘం తన వెబ్‌సైట్‌లో గురువారం పొందుపరిచింది. వెబ్‌సైట్‌లో ఉంచిన మొత్తం 337 పేజీల డేటాలో రూ.11,671 కోట్ల విలువైన బాండ్లను వివిధ సంస్థలు, వ్యక్తులు కొనుగోలు చేసినట్లు స్పష్టమైంది.

# సిఏఏపై స్టే ఇవ్వాలా? వద్దా?

### 19న సుప్రీంకోర్టు విచారణ

న్యూఢిల్లీ : వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టాన్ని (సిఎఎ) అమలు చేయకుండా స్టే ఉత్తర్వులు ఇవ్వాలా? వద్దా? అనే విషయంపై సుప్రీంకోర్టు ఈనెల 19వ తేదీ మంగళవారం విచారణ చేస్తుంది. సిఎఎ అమలును తక్షణం నిలిపివేయాలని కోరుతూ ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఐతే సిఎఎ అమలును నిలిపివేయాలని కోరుతూ ఈ విషయంలో జోక్యం చేసుకునే అధికారం ఐయుఎంఎల్‌కు ఎక్కడిదని, ఆ సంస్థకున్న తాహతు ఏమిటని కేంద్ర ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టుకు హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ప్రశ్నించారు. ఈ విషయంలో ఎవ్వరికీ ప్రశ్నించే హక్కు లేదని, ఇది పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన చట్టమని తుషార్ మెహతా వాదించారు. కాగా 2019 నుండి ఇప్పటివరకూ సిఎఎకు వ్యతిరేకంగా 237 పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లు అన్నీ విచారణ లేక సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పిటిషన్లు అన్నీ స్టే ఇవ్వాలని లేద అమలు చేయాలని అనుకూల ప్రతికూల వాదనలతో దాఖలు చేసిన పిటిషన్లే. రాబోయే మంగళవారంనాడు 19వ తేదీన సిఎఎకు సంబంధించిన 197 పిటిషన్లపై విచారణ ప్రారంభిస్తామని ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ చెప్పారు. ఈ కేసులో ఐయుఎంఎల్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ ధర్మాసనం ఎదుట వాదనలు చేస్తున్నారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్థీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కేసు విచారణ చేస్తుంది. 2019లో పార్లమెంటులో గందరగోళం, తీవ్ర వ్యతిరేకతలమధ్య బిజెపి ప్రభుత్వం సిఎఎ బిల్లును ఆమోదించింది. ఐతే సంబంధిత నిబంధనలు, విధివిధాన రూపకల్ప న చేయడానికి మాత్రం ఐదేళ్ళు సమయం పట్టింది. లోక్‌సభ ఎన్నికలు సమీపించిన తరుణంలో ఈ చట్టాన్ని అమలు చేయడాన్ని ఐయుఎంఎల్ సవాలు చేసింది. ఈ చట్టం వల్ల మైనారిటీ వర్గాలు తీవ్ర అభద్రతకు గురవుతున్నాయని ఐయుఎంఎల్ ఆ పిటిషన్‌లో ధర్మాసనానికి తెలియజేసింది. కేరళ రాష్ట్రం కేంద్రంగా పనిచేస్తున్న రాజకీయ పార్టీ ఐయుఎంఎల్ ప్రధానంగా సిఎఎను రద్దు చేయాలని కోరుతున్నది. కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని ఇటీవల అమలులోకి తెచ్చాక ఐయుఎంఎల్‌పాటు మరో మూడు సంస్థలు కూడా సిఎఎ రద్దు కోరుతూ పిటిషన్లు దాఖలు చేశాయి. సిఎఎ చట్టం కింద శరణార్థులై వచ్చిన ముస్లింలు భారత పౌరసత్వాన్ని కోరే హక్కు లేదు.

## పెట్రోల్, డీజిల్‌పై రూ. 2 తగ్గింపు

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఒక రోజు ముందు కేంద్ర ప్రభుత్వం ఇంధన ధరను స్వల్పంగా తగ్గించింది. పెట్రోల్, డీజిల్‌పై రూ. 2 చొప్పున తగ్గించింది. దాదాలు రెండు సంవత్సరాల తరువాత ధరల సవరించడం ఇదే తొలిసారి. సవరిచిన రేట్లు శుక్రవారం ఉదయం నుంచి అమల్లోకి వచ్చాయి. రూ. 2 తగ్గింపుతో దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 96.75 నుంచి రూ. 94.72కు తగ్గింది. డీజిల్ ధర రూ. 89.62 ఉండగా, 87.92గా ఉంది. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గత వారం కూడా కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ సిలిండర్ ధరను రూ. 100 తగ్గించగా, సిఎన్‌జి ధరల కిలోకి రూ. 2.50 తగ్గించింది. సాధారణ వినియోగదారులు 14.2 కిలోల సిలిండర్‌కు రూ. 803 చెల్లించాల్సి ఉండగా, ఉజ్వల పథకం కింద కనెక్షన్ పొందిన వారు రూ. 300 సబ్సిడీ మినహాయించగా, రూ. 503 చెల్లించాలి. సవరించిన ఈ ధరలు మార్చి 15 శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి అమలులోకి వస్తాయని కేంద్ర చమురు మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. చమురు మార్కెటింగ్ కంపెనీలు పెట్రోల్, డీజిల్ ధరలను దేశవ్యాప్తంగా సవరిస్తున్నట్లు సమాచారం ఇచ్చాయని పెట్రోలియం శాఖ వెల్లడించింది. ఈ తగ్గింపు నిర్ణయం వినియోగదారులకు ఊరటనిస్తుందని, డీజిల్‌తో నడిచే 58 లక్షల గూడ్స్ వాహనాలు, ఆరు కోట్ల కార్లు, 27 కోట్ల ద్విచక్రవాహనాల నిర్వహణ ఖర్చులు తగ్గుతాయని పేర్కొంది. లీటర్ పెట్రోల్‌పై రూ.2 తగ్గిస్తూ తీసుకున్న తాజా నిర్ణయంతో దేశంలోని ప్రధాన నగరాల్లో పెట్రోల్, డీజిల్ ధరలను పరిశీలిస్తే... ముంబయిలో లీటర్ పెట్రోల్ ధర రూ. 104.21, కోల్‌కతాలో రూ. 103.94, చెన్నైలో రూ. 100.75గా ఉంది. డీజిల్ ధరలు ముంబయిలో రూ. 92.15, కోల్‌కతాలో రూ. 90.76, చెన్నైలో రూ. 92.34గా ఉన్నాయి. స్థానిక పన్నుల ఆధారంగా ఆయా రాష్ట్రాల్లో ధరల్లో వ్యత్యాసం ఉండనుంది.

# మైనార్టీల సంక్షేమానికి కృషి

### ఎంఎల్ఏ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రంజాన్ మాసంలో తొలి శుక్రవారం సందర్భాలలో మహబూబ్‌నగర్ పట్టణంలోని సుదర్శన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డితో కలిసి పాల్గొని ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మాట్లాడారు. మైనార్టీ సోదరులు పవిత్రమైన ఈ రంజాన్ మాసాన్ని ఎంతో నిష్టతో, భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారని, మీ అందరికి ఆ భగవంతుని ఆశీర్వాదం మెండుగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. మహబూబ్‌నగర్ ఎంపిగా మనం వంశీచంద్‌రెడ్డి ని అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంటుకు పంపిస్తే మన గొంతుకై ఢిల్లీలోని పార్లమెంటులలో వినిపిస్తారని మైనార్టీల సంక్షేమానికి అధిక శాతం నిధులు మంజూరు చేయించుకుని వస్తారని ఆయన తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా నిరూపయోగంగా ఉన్న ఉర్దూ ఘర్ నిర్మాణం కోసం 15 కోట్ల, షాదీఖాన నిర్మాణం కోసం 25 కోట్లు, కబ్రస్థాన్ కోసం 5 ఎకరాల భూమి అలాగే 5 కోట్ల రూపాయలను ఇచ్చుటకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, పార్లమెంటు ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత నిర్మాణాలకు సంబంధించిన ప్రొసిడింగ్స్ వస్తాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు డా.చల్లావంశీచంద్‌రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, ఎస్సి సెల్ అధ్యక్షుడు సాయిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, కాంగ్రెస్ నాయకులు ఎన్‌పి వెంకటేశ్, మారేపల్లి సురేందర్‌రెడ్డి డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, జమీర్, మౌసమ్, ఖాదర్, ఉర్ఫ్ , సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మ ణ్ యాదవ్, రహీం, డా.సలీం, ఇబ్రహీం ఖాద్రీ, ఐఎన్‌టియుసి రాములు, పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు అజ్మత్ అలి, హనీఫ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## మైనర్‌పై అత్యాచారం ఆరోపణలు..

# యడ్యూరప్పపై పోక్సో కేసు

బెంగళూరు : కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, బిజెపి సీనియర్ నేత బిఎస్ యడ్యూరప్పపై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. గత నెలలో బెంగళూరులోని తన నివాసంలో మైనర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న అభియోగాలపై అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. 81 ఏళ్ల యడ్యూరప్ప తన కుమార్తెపై అత్యాచారం చేశారని, తమకు న్యాయం చేయాలని, పూర్తి విచారణ కోరుతూ సిట్‌ను ఏర్పాటు చేయాలంటూ ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అత్యాచారం జరిగిన తరువాత యడ్యూరప్ప క్షమాపణలు చెప్పారని, ఈ విషయాన్ని ఎవరికీ చెప్పవద్దని కోరినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి కంప్లైంట్‌తో అధికారులు యడ్యూరప్పపై కేసు పెట్టారు. బెంగళూరులోని సదాశివనగర్ పోలీసులు పోక్సో చట్టంలోని సెక్షన్ 8 (లైంగిక వేధింపులకు పాల్పడటం), ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి) సెక్షన్ 354 (ఎ) (లైంగిక వేధింపు) కింద కేసు నమోదు చేశారు. ఈ ఆరోపణలపై మాజీ సిఎం స్పందించారు. కొద్ది రోజుల క్రితం ఓ మహిళ తన కూతురిని తీసుకుని తన వద్దకు వచ్చారని చెప్పారు. వారు సమస్యను పరిష్కరించాలని కోరినట్లు చెప్పారు. దీంతో తాను ఆ సమస్యను పరిష్కరించాలని కోరుతూ నగర పోలీసు కమిషనర్ ఫోన్ చేసినట్లు తెలిపారు. ఇంత జరిగినా వారు తనకు వ్యతిరేకంగా ఎందుకు మాట్లాడుతున్నారో ఇప్పటికీ అర్థం కావడం లేదని యడ్యూరప్ప అన్నారు. వారి ఇబ్బందులు చూడలేక కొంత డబ్బు కూడా ఇచ్చినట్లు వివరించారు.



## ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

ప్రజాపక్షం/జడ్చర్ల : డా.బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ కళాశాల జడ్చర్లలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవంను కళాశాల ప్రిన్సిపాల్ డా.అప్పియా చిన్నమ్మ అధ్యక్షతన నిర్వహించడమైంది. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ రవీందర్ రావు మాట్లాడుతూ వినియోగదారు ప్రతి కొనుగోలు పై ప్రభుత్వంకు పన్ను చెల్లిస్తున్నాందున వారికి ప్రభుత్వం రక్షణ కల్పిస్తుందని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ వినియోగదారులుగా వస్తువులు కొన్నప్పుడు సేవలు పొందేటప్పుడు రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని అప్పుడే చట్టం మనకు రక్షణ కల్పిస్తుందని తెలిపారు. కామర్స్ డిపార్టుమెంట్ హెడ్ డా.మంజుల వినియోగదారునిగా మన హక్కులకు వినియోగదారుల చట్టం 1986 ప్రకారం జిల్లా రాష్ట్ర జాతీయ ఫోరం ద్వారా రక్షణ పొందవచ్చునని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వినియోగదారులుగా రక్షణ పొందాలంటే రసీదు తో పాటు, తగు సమయం లో కాంప్లేంటు చేసినట్లయితే చట్టం ద్వారా పొందవచ్చునని తెలిపారు. కామర్స్ అధ్యాపకులు ఈ.వెంకట్‌రెడ్డి, మాట్లాడుతూ వినియోగదారు హక్కులు, భాధ్యతలు ఒక నాణ్యానికి బొమ్మ, బోరుసు లాంటిది అన్నారు.

# పెండింగ్ వేతనాలు చెల్లించాలి

### తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం. నర్సింహ్మ



ప్రజాపక్షం / వనపర్తి టౌన్ : వనపర్తి జిల్లా పరిధిలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ సమక్షంలోని ఆత్మకూర్ , ఖిల్లా ఘనపూర్ , రేవెల్లి , వీపనగండ్ల ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాలలో పని చేస్తున్న శానిటేషన్ పేషంట్ కేర్ సెక్యూరిటీ సూపర్వైజర్ కార్మికులకు చెల్లించాల్సిన 8 నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని, కార్మికుల వేతనం పిఎఫ్ ఈఎస్ఐలలో అక్రమాలకు పాల్పడుతున్న వెంకటయ్య సెక్యూరిటి సర్వీసెస్ ఏజెన్సీపై విచారణ జరిపి చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం. నర్సింహ, రాష్ట్ర కార్యదర్శి పి. సురేష్‌లు శఉక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ జాయింట్ సెక్రెటరీ ఎం. శ్రీదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎం. నర్సింహ మాట్లాడుతూ జిల్లా పరిధిలోని వివిధ ప్రభుత్వ సామాజిక ఆసుపత్రుల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషంట్ కేర్ సూపర్‌వైజర్ కార్మికులకు దాదాపు 8 నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని దీనితో కార్మికులు అష్ట కష్టాలు పడుతూ అప్పుల ఊబిలోకి వెళ్లారని మండిపడ్డారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తున్న పేద ప్రజల మల మూత్రాలు ఎత్తిపోస్తూ ఆసుపత్రిలో పరిశుభ్రతకు పాటుపడుతూ ప్రభుత్వ ప్రతిష్టను పెంచుతున్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే గౌరవం వేతనాలు ఇవ్వకుండా ఉండడమేనా అని ప్రశ్నించారు. 8 నెలలకు వేతనాలు చెల్లించకపోతే కార్మికుల పరిస్థితి దయానియంగా మారిందన్నారు. ఆత్మకూరు ఖిల్లా ఘణపూర్ వీపనగండ్ల సామాజిక ఆరోగ్య కేంద్రాల ఏజెన్సీ కాంట్రాక్టర్లు కేవలం కార్మికులకు 11000 వేతనం 600 పిఎఫ్ చెల్లిస్తున్నారని రేవల్లి ఆసుపత్రిలో కేవలం తొమ్మిది వేల వేతనం మాత్రమే ఇస్తున్నారని , ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 60 ప్రకారం 15600లో పిఎఫ్ 3023 రూపాయలు, ఈఎస్ఐ 484 రూపాయలు పోను 12093 రూపాయలు వేతనం చెల్లించాలని , వైద్య విధాన పరిషత్ కమిషనర్ స్పష్టమైన ఆదేశాలతో కూడిన సర్కిలర్ ఇచ్చిన కాంట్రాక్టర్ పరిగణలోకి తీసుకోకుండా కార్మికుల వేతనాల్లో పిఎఫ్ ఈఎస్ఐల చెల్లింపులో భారీ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని వివరించారు. ఇప్పటికే అనేక పర్యాయాలు డిసిహెచ్‌ఎస్ జిల్లా కలెక్టర్ స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకురావడం జరిగిందని చర్యలు తీసుకోవాలని అనేక రూపాల్లో కార్మికులు ఆందోళన చేపట్టారని అయినా కాంట్రాక్టర్ల అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేయ్యలేకపోతున్నారన్నారు. కాంట్రాక్టర్ల అవినీతిపై క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి ఏజెన్సీల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్టర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్‌లు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌ను కలిసిన ఎంపిపి



ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి : పెద్దకొత్తపల్లి మండల పరిషత్ అధ్యక్షులు సూర్యప్రతాప్‌గౌడ్ గురువారం రాత్రి సిఎం రేవంత్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలేబొకే అందజేశారు. పెద్దకొత్తపల్లి మండలంలో చేపట్టవలసిన వివిధ అభివృద్ధి పనులగురించి సిఎం రేవంత్‌రెడ్డికి వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్ టూరిజంశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఉన్నారు.




## ప్రమాదంలో రాజ్యాంగం

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : కేంద్రప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరువల్ల భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, మతతత్వశక్తులను ఓడించడానికి కలిసి పోటిచేస్తున్న బిఆర్‌ఎస్ బిఎస్‌పి కలయికను రాష్ట్రప్రజలు స్వాగతించాలని బిఎస్‌పి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కేంద్రాన్ని ప్రశ్నిస్తే రాజకీయంగా ఎదిగినవారిని ఈడి సిబిఐ సిఐడిపేరుతో దాడులకు పాల్పడటం దారుణమన్నారు. ప్రజాస్వామ్యబద్ధ పాలనకై యువకులు, మహిళలు , విద్యార్థులు , మేధావులు, ఉద్యోగులు పార్లమెంట్ అభ్యర్థులుగా ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నామన్నాని అన్నారు. ఈ సమావేశంలో బిఎస్‌పి జిల్లా నాయకులు కొత్తపల్లికుమార్, పృథ్వీరాజ్, రాంచందర్ పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** కెపిహెచ్ బి కాలనీ డివి జన్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్ ఫేజ్–1లో భగత్ సింగ్ విగ్రహాన్ని శుక్రవారం మంత్రి తుమ్మల నాగే శ్వరరావు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత భగత్‌సింగ్‌ను ఆదర్శం గా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ బండి రమేష్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, తూము వేణు, కొప్పిశెట్టి దినేష్ కుమార్, శేరి సతీష్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గంధం రాజు, రాఘవేందర్, లక్ష్మయ్య, ప్రవీణ్ కుమార్, శివచౌదరి, పుష్ప రెడ్డి, రజిత, రేష్మ, వనజ, సంధ్య పాల్గొన్నారు.



## ఘనంగా మహిళా దినోత్సవం



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగి చెర్ల శాఖ సిపిఐ సభ్యత్వ నమోదు, మహిళా దినో త్సవ కార్యక్రమాన్ని ఘనంగా శుక్రవారం నిర్వ హించారు. మండల సిపిఐ కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు, మహిళా దినోత్స వాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చెంగిచెర్ల శాఖ కార్యదర్శి సిహెచ్ మాధవి, బికెఎంయు మండల కార్యదర్శి కె.మహాలక్ష్మి, నాగమణి, అనూష, జి.స్వరూప, కె.వరలక్ష్మి, ఏ సుజాత, ఆర్ కమలమ్మ, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

## హౌసింగ్ సొసైటీల పేరుతో జర్నలిస్టులు మోసపోవద్దు



**ప్రజాపక్షం/బోడుప్పల్:** హౌసింగ్ సొసైటీలో సభ్యత్వం తీసుకోకపోతే ఇళ్ల స్థలాలు రావంటూ జరుగుతున్న ప్రచారాన్ని జర్నలిస్టులు నమ్మి మోస పోవద్దని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల అధ్యక్షులు శివశంకర్, కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, గడ్డమీది బాలరాజులు కోరారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రేటర్ పరిధిలోని వివిధ నియోజకవ ర్గాలు, మండలాలలో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులను గందరగోళానికి గురి చేస్తూ కొందరు హౌసింగ్ సొసైటీ పేరుతో డబ్బులు వసూలు చేస్తు న్నట్లు తెలిసిందన్నారు. ఈ ప్రచారం అవాస్తవమని తెలిపారు. ఎవరు సొసై టీలకు డబ్బు చెల్లించవద్దని కోరారు. త్వరలోనే ప్రభుత్వం జర్నలిస్టుల ఇండ్ల స్థలాలపై స్పష్టమైన వైఖరి వెల్లడిస్తుందని తెలిపారు.

## ఘనంగా కాన్షీరామ్ జయంతి



**ప్రజాపక్షం/బోడుప్పల్:** మేడ్చల్ అసెంబ్లీ బిఎస్పీ నాయకులు సుక్క దయా నంద్ ఆధ్వర్యంలో కాన్షీరామ్ జయంతిని మండల కేంద్రంలోని అమరవీ రుల స్థూపం వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పంగ ప్రణయ్ కుమార్ హాజరై కాన్షీరామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన రాజ్యాధికారం కోసం కాన్షీరాం స్ఫూర్తితో పోరాటం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ ఫిర్జాదిగూడ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి పాశం రాజు యాదవ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బండారి సాయి, పాశం సత్యం, మనోజ్, వెంకార్, శివ, పరమేష్, యాకన్న పాల్గొన్నారు.

## నీళ్ల ట్యాంకర్‌ను ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

ఆరుగురికి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం /శామీర్‌పేట :** మొక్కలకు నీళ్లు పోస్తున్న హెచ్‌ఎండిఎ ట్యాంక ర్‌ను ఆర్‌టిసి బస్సు ఢీకొట్టడంతో బస్సులో ప్రయాణిస్తున్న డ్రైవర్‌తో పాటు ప్రయాణికులకు తీవ్రగాయాలైన సంఘటన తుర్కపల్లి జీనోమ్‌వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక డిపోకు చెందిన బస్సు (టిఎస్36టి7407) గల ఆర్ టిసి బస్సు ప్రయాణికులతో హైదరాబాద్ వైపు వెళ్తుంది. ఈ క్రమంలో లాల్ గడిమలక్‌పేట పరిధిలోని ట్రక్ లే బై వద్దకు రాగానే బస్సు అదుపు తప్పి రాజీవ్ రహదారిపై మొక్కలకు నీళ్లు పోస్తున్న ట్యాంకర్‌ను వెనకాల నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తో పాటు బస్సులో ప్రయాణి స్తున్న నలుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. ఏలాంటి ప్రాణ నష్టం జరుగులేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నా మని తుర్కపల్లి పోలీసులు తెలిపారు.

## ఆలయాల నిర్మాణానికి సహకారం



**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట :** జీడిమెట్ల డివిజన్ పరిధిలోని వినాయక్ నగర్ లో, శ్రీదుర్గామాత ఆలయ పునర్ నిర్మాణానికి సహకరించమని రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, పెద్దలు, కెయం ప్రతాప్‌ని, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు, యువ నేస్తం ఫౌండేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షులు కె.పి. విశాల్ గౌడ్ ని కోరిన దుర్గామాత ఆలయ కమిటీ సభ్యులు. ఈ సందర్భం గా ప్రతాప్. మాట్లాడుతూ శ్రీ దుర్గా మాత ఆలయ పునర్ నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. వినాయక్ నగర్ ఆలయ కమిటీ వారికి, సంక్షేమ సంఘం వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటా నన్నారు. కార్యక్రమంలో వినాయకనగర్ ఆలయ కమిటీ సభ్యులు, నర్సిం గరావు, నదీమ్రాయి, యాదగిరి, వెంకటయ్య, చంద్రయ్య, సుధాకర్, నందు సింగ్, మురళి, పాండు, నాగరాజు, అనంతయ్య పాల్గొన్నారు.

## కృష్ణారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మేడ్చల్ మాజీ ఎంఎల్‌ఎ మలిపెద్ది సుదీర్‌రెడ్డి శామీర్‌పేట మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు కమటం కృష్ణారెడ్డి జన్మ దినం సందర్భంగా శుక్రవారం ఆయనను సన్మానించారు. కేక్ కట్‌చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్ చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, శంకర్‌గౌడ్, ఎంపిటిసి అశోక్‌రెడ్డి, విష్ణుగౌడ్, బిక్షపతి, మధుసూదన్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## 'అద్రాజా – నారీ శక్తి సమ్మాన్' అవార్డులు అందజేత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఫౌండేషన్ ఫర్ ఫ్యూచరిస్టిక్ సిటీస్ అధ్యక్షురాలు, కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఇంజనీర్స్ ఇండియా లిమి టెడ్ బోర్డు డైరెక్టర్ కరుణా గోపాల్ వర్తకవికి అమిటీ గ్లోబల్ యూనివర్శిటీ ప్రతిష్టా త్మక అవార్డు 'అద్రాజా నారీ శక్తి సమ్మాన్' అవార్డు శుక్రవారం అందజేశారు. ఈ అవార్డులు కరుణా గోపాల్‌తో పాటు లక్ష్మీ సింగ్ (ఐపిఎస్), మాజీ రాజ్యసభ సభ్యులు రూపా గంగూలీ, కథక్ డ్యాన్సర్ పద్మశ్రీ శోవన నారాయణ్‌కు దక్కాయి. వివిధ రంగాలలో గణనీయమైన కృషి చేసిన ఆదర్శప్రాయమైన మహిళలకు ప్రదానం చేసే ఈ అవార్డును, పట్టణ సంస్కరణలు, ఆవిష్కరణలు, పాలన, పాలసీ రంగాలలో రెండు దశాబ్దాలుగా ప్రశంసనీయమైన సేవలకు గుర్తిం పుగా అవార్డును ఆమెకు అందజేశారు. సమ్మిళిత నగరాలను రూపొందిం చడంలో ఆమె కీలకపాత్ర పోషించారు. అభివృద్ధి, సామాజిక రంగాలలో చేసిన కృషికి గానూ ఆమెకు ఈ విశిష్ట గుర్తింపును తెచ్చిపెట్టింది.

# ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులదే కీలకపాత్ర

జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** పార్లమెంటు ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులదే కీలక పాత్ర అని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాల యంలో శుక్రవారం జిల్లా ఎస్‌పి కోటిరెడ్డి, అదనపు కలె క్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్‌తో కలిసి కలెక్టర్ సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ నోడల్ అధికారులందరూ వారికి కేటయించిన అంశా లపై పూర్తిగా అవగాహన కలిగి ఉండి ఎలాంటి పొరపా ట్లకు తావివ్వకుండా పార్లమెంటు ఎన్నికలను విజయవం తంగా నిర్వహించాలన్నారు. అన్ని విషయలపై నోడల్ టీమ్‌లకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, ఎన్ని కల సామాగ్రికి సంబంధించిన ఎప్పటికప్పుడు రాష్ట్ర స్థాయి నోడల్ అధికారులతో సంప్రదింపులు చేస్తూ ఎన్నికల సామాగ్రిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవా లని ఎన్నికల మెటీరియాల్ మేనేజ్మెంట్ నోడల్ అధికిర డిడబ్లును అదేశించారు. ట్రాన్స్‌పోర్ట్స్‌లో భాగంగా అవసర మైన వాహనాల ఏర్పాటు చేసుకోవాలన్నారు. అంతరాష్ట్ర సరిహద్దులలో, జిల్లా సరిహద్దు చెక్ పోస్టులలో సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో పోలీస్, ఆర్డీ, ఆర్టీసీ ఎక్సైజ్ ఉద్యోగులను నియమించాలని సూచించారు. ఎన్ని కలకు సంబంధించిన అన్నింటిపై అవగాహన కల్పించాల న్నారు. పార్లమెంటు ఎన్నికలకు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్‌పిని కోరారు. ఎన్నికల ప్రవర్తనా నియమా వళి అమల్లోకి వచ్చిన వెంటనే ఎన్నికల కమిషన్ అదేశాల మేరకు 24గంటల 42గంటలు, 72గంటల్లో తీసుకోవాల్సి న చర్యలపై ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు చేస్తు ముందుకెళ్లాలని నోడల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసు కోవాలన్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా ఎన్నికల విధులను నిర్వహించాలని నోడల్ అధికారులకు, సిబ్బందికి కలెక్టర్ సూచించారు. సమావేశంలో అడిషనల్ ఎస్‌పి రవీందర్‌రెడ్డి, తాండూర్ ఆర్‌డిఓ శ్రీనివాస్, డిఎస్ పిలు, సిఐలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్‌ఎను కలిసిన బిఆర్‌ఎస్ ఎంపి అభ్యర్థి రాగిడి

**ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి:** బిఆర్‌ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి శుక్రవారం మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డిని ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్ గౌడ్ తదిత రులు పాల్గొన్నారు.



## ఫిర్జాదిగూడ అభివృద్ధికి నిధులు

సిఎం రేవంత్‌రెడ్డి, వజ్రేష్ యాదవ్‌కు తుంగతుర్తి రవి కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/బోడుప్పల్:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమ యంలో ఇచ్చిన హామీ మేరకు మేడ్చల్ నియోజకవర్గం అభివృద్ధికి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద రూ.కోటి మంజూరు చేసినందుకు ముఖ్యమం త్రికి, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాద వ్‌కు ఫిర్జాదిగూడ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధుల నుంచి రూ.36 లక్షలను ఫిర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో మంచినీటి సరఫరాకు, బుద్ధానగర్‌లోని సీనియర్ సిటిజెన్స్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.8 లక్షలు, 17వ డివిజన్‌లో కమ్యూ నిటీ హాల్‌కు రూ.5 లక్షలు, 15వ డివిజన్ క్రాంతి కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 8 లక్షలు, 10వ డివిజన్‌లో డ్వాక్రా బిల్డింగ్ నిర్మా ణానికి రూ.2 లక్షలు, 13వ డివిజన్‌లో కమలానగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.4 లక్షలు, 3వ డివిజన్‌లో సిసి రోడ్డుకు రూ.3 లక్షలు, 23వ డివిజన్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.3 లక్షలు, 8వ డివిజ న్‌లో బిబి సాహెబ్ మక్త రోడ్డు నెం.5 నిర్మాణానికి రూ.3 లక్షలు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు సంబంధించి సంబంధించిన అధికారులతో శుక్రవారం రవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయ కులు రాంరెడ్డి, నగేష్, రంజిత్‌రెడ్డి, పవన్‌గౌడ్, మోహన్, జనగాచారి, ఐలేష్ యాదవ్, సుదర్శన్‌రెడ్డి, బర్రె నాగరాజు, మణిరాం నాయక్, దుర్గ, ఉదయ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బడుగు, బలహీనవర్గాలకు పెద్దపీట

ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు :** ఏకకాలంలో 16 కార్పొరేషన్‌లను ఏర్పాటు చేసి బడుగు బలహీలన వర్గాలకు పెద్ద పీట వేసిన ఘనత సిఎం రేవంత్‌రెడ్డికే దక్కిం దని తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని, మనోహర్‌రెడ్డి అన్నారు. ముదిరాజ్‌లకు ప్రత్యేక ముదిరాజ్ కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ శుక్రవారం తాండూరు ముదిరాజ్ సంఘం ఆద్వర్యాన ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డితో పాటు రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మెంబర్ ఎం. రమేష్ మహారాజ్‌లు పాల్గొన్నారు. తాండూరు నియోజకవర్గం ముదిరాజ్ సంఘం ఆద్వర్యాన సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ తాను ఎంఎల్‌ఎగా విజయం సాధించడంలో ముదిరాజ్‌ల పాత్ర కీలకమైందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 100రోజుల్లో ఐదు పథకాలను అమలు చేసిన ఘన సిఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. ఎన్నికల ముందు తాను ముదిరాజ్ లకు ఇచ్చిన మాట ప్రకారం తాండూరు ముదిరాజ్ భవనాన్ని తాను సొంత నిధులు వెచ్చించి నిర్మించడానికి నిర్మిస్తానన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్ని కలలో ముదిరాజ్ సంఘం నుంచి పూర్తి మద్దతు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి అత్యాధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ముదిరాజ్‌లను బీసి డి గ్రూప్ నుండి బిసి ఎలోకి మార్చాలని రాష్ట్ర ఫైనాన్స్ కమీషన్ మెంబర్ రమేష్ మహ రాజ్ కోరారు. ముదిరాజ్ సంఘానికి కెటాయించిన భూమికి సంబంధించిన సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న పరిమళ్, ముదిరాజ్ సంఘం నాయకులు ఉత్తమ్‌చంద్, పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, రాకేష్ మహారాజ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి దారాసింగ్, ఆకుల రాములు, బీసి సంఘం నాయకులు రాజ్‌కుమార్, జిల్లా మత్స్య సహకారం సంఘం అధ్యక్షులు శ్రీదర్, కాంగ్రెస్ పార్టీ ఎబ్లాక్ అధ్యక్షులు లొంక నర్సిములు, మహిళ నాయకులు పరిమళ, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు బంటు వేనుగోపాల్, సంతోష్, వివిధ మండల పార్టీల అధ్యక్షులు, ముదిరాజ్ సొదరులు పాల్గొన్నారు.



### పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం తాండూరు పట్టణ శివారులోని ప్రజాభవన్ కార్యాలయంలో ఎంఎల్‌ఎ మనోహర్‌రెడ్డి విద్యాధి కారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లా డుతూ విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీటి సదు పాయం కల్పించాలని, విద్యాశాఖ నియమ, నిబంధనలను పాటించాలని సూచించారు. పరీక్ష కేంద్రాలలో మొబైల్ ఫోన్స్ పూర్తిగా నిషేధించడం జరిం గని, ఎవ్వరైన ఫోన్‌లు వాడినట్లయితే సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పరీక్ష జరగుతున్న సమయంలో జీరాక్స్ సెంటర్లు మూసివేయించాలన్నారు. ఆర్‌టిసి అధికారులు పరీక్షల సమయానుకూలంగా బస్సులు నడపాలన సూచించారు. ఈ సందర్భంగా పదోతరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు ఎంఎల్‌ఎ ఆల్‌ది బెస్ట్ తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, ఎంఈఓలు వెంకటయ్యగౌడ్, సుధాకర్‌రెడ్డి, జడ్పీటిసి ధారాసింగ్, మురళీకృష్ణగౌడ్ తదితరులు ఉన్నారు.

# చెక్కుల పంపిణీలో ప్రోటోకాల్ రగడ

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణిలో ప్రోటోకాల్‌పై బిఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల మధ్య ఘర్షణ నెలకొంది. శుక్రవారం మూడుచింతల పల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణి కార్య క్రమం చేపట్టారు. చెక్కులను పంపిణీ చేయుటకు అధికారులు అన్నిఏర్పాట్లు చేశారు. మాజీమంత్రి మల్లారెడ్డి ఆలస్యంగా వచ్చారు. ఎంపిపి హారికమురళిగౌడ్, జడ్‌పిటిసి హరివర్ధన్‌రెడ్డి, వైస్ ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డిలు సమ యానికి వచ్చి మల్లారెడ్డి కొరకు ఎదురుచూశారు. కార్యక్రమానికి మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్ వచ్చి వేదికపై ఆసీనుల య్యారు. బిఆర్‌ఎస్ ఎంపి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి సమావేశానికి రావడం తో బిఆర్‌ఎస్ శ్రేణులు ఆయనను స్టేజిపైకి పిలువాలని అధికారులతో వాదిం చారు. దీంతో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ కార్యకర్తలు నినాదాలు చేశారు. వజ్రేష్ యాదవ్ ఏహోదాలో వేదికపైకి వచ్చారని బిఆర్‌ఎస్ నాయకులు ప్రశ్నిం చారు. రాగిడి లక్ష్మారెడ్డిని స్టేజిపైకి పిలువడంతో ఇరుపార్టీల కార్యకర్తలు శాంతించారు. అధికారిక కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించాలని జడ్‌పి టిసి హారివర్ధన్‌రెడ్డి అధికారులకు సూచించారు. మాజీమంత్రి మల్లారెడ్డి చెక్కుల పంపిణీ అనంతరం మాట్లాడకుండానే వెళ్లిపోయారు. కాంగ్రెస్ కార్యకర్తలు జై రేవంత్, కాంగ్రెస్ న్యాయకత్వం వర్ధిల్లాలి అంటు పెద్దపెట్టున నినాదాలు చేశారు. మూడుచింతలపల్లి మండలానికి సంబంధించి 21 చెక్కు లను పంపిణీ చేసినట్లు తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి తెలిపారు. కార్యక్ర మంలో ఎంపిటిసి పొరుపల్లి నాగరాజు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, బిర్‌ఎస్ మండలాధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, మాజి సర్పంచ్ జాం రవి, తదితరులు పాల్గొన్నారు.





**ఘట్‌కేసర్ :** ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, పోచారం మున్సిపాలిటీకి చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రరెడ్డి, ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సబేర్‌అలీ, మున్సిపల్ వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, పోచారం మున్సిపల్ వైస్ చైర్మన్ రెడ్యానాయక్‌లతో కలిసి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్య క్రమంలో కౌన్సిర్లు చందుపట్ల వెంకట్ రెడ్డి, కొమ్మగోని రమాదేవి,బొక్క సంగీత, బండారి ఆంజనేయులుగౌడ్, బేతళ నర్సింగ్‌రావు, కుతాడి రవీం దర్, సాయిరెడ్డి, ఎంపీటీసీ బాస్కర్‌రెడ్డి, బోడ్డు వినోద పాల్గొన్నారు.

## డిఫాల్ట్ మిల్లర్లు సిఎంఆర్ రైస్‌ను ఏప్రిల్ మాసంలో అందించాలి

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ కలెక్టర్ కార్యాలయం తన ఛాంబర్‌లో శుక్రవారం జిల్లాలో డిఫాల్ట్ అయిన రైస్ మిల్లర్లతో అదనపు కలె క్టర్ లింగ్యానాయక్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ 2021–22 సంవత్సరానికి సంబంధించిన సిఎంఆర్ రైస్‌ను గడువు లోగా పౌరసరఫరాల సంస్థకు అందించని నేపథ్యంలో జిల్లాలో కొందరు రైసు మిల్లర్లను డిఫాల్టర్లుగా ఉండిపోయారన్నారు. ఇలాంటి రైస్ మిల్లర్లు సమ యాన్ని విధిస్తు పెండింగ్ సిఎంఆర్ రైస్ ను ఏప్రిల్ నెల వరకు పౌరసరఫర సంస్థకు వంద శాతం చేరవేసేలా చర్యలు చేపట్టాని ఆయన తెలిపారు. జిల్లాలోని రైస్ మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. డిఫాల్టర్లుగా ఉన్న రైస్‌మిల్లర్లు వందశాతం దాన్యం నిల్వలను పౌరసరఫరాల శాఖకు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లాలోని రైస్‌మిల్లర్ల ప్రతినిధులు, యజమనులు రాజేశ్వర్, సుగుణబాయ్, బాలేష్ గుప్త, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



## పది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** పదిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాదించా లని తూంకుంట మున్సిపల్ దేవరయాంజాల్ యువకుడు బర్రెంకబావి శ్రావంత్‌రెడ్డి అన్నారు. దేవరయాంజాల్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తర గతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని అందజేశారు. అలాగే శామీర్‌పేట మండలం అలియాబాద్‌లో బండి రాఘవరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో తూంకుంట కాంగ్రెస్ అధ్యక్షుడు బీమిడి జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్ నర్సింగ్ గౌడ్, ప్రధానోపాధ్యాయుడు బాలేష్, బండి అక్షిత, శ్రీకాంత్‌రెడ్డి, రుచిత, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విజెఐఇటి కళాశాలలో కల్చరల్ ఫెస్ట్

సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థుల సందడి

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాం పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లిలోని విఎన్‌ఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇంజనీ రింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో "సిన్టిలేషన్స్ 2k24" పేరిట కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ వేడుకల్లో భాగంగా ఎథ్నిక్ డే సంద ర్భంగా విద్యార్థినీ విద్యార్థులు రంగు రంగుల సాంప్రదాయ దుస్తుల్లో కళకళ లాడుతూ, మిత్రబృందాలతో కలిసి సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. ఆకర్షణీయంగా, హొయలొలికించేలా ర్యాంప్ వాక్ చేసిన విద్యార్థుల్లో





న్యాయనిర్ణేతలు మిస్టర్ సిన్టి అండ్ మిస్ సిన్టి పేరిట విజేతలను ఎంపిక చేశారు. కళాశాల మ్యూజిక్ క్లబ్ క్రెసెండో సభ్యులు తమ సంగీతంతో ఆహుతు లను అలరించగా కొంచెం హాట్‌కే చిత్ర బృందం నుండి మనోజ్ ది స్పిరిట్ ఆఫ్ హాట్‌కే గీతాలాపన చేశారు. ప్రముఖ చలన చిత్ర గాయనీ గాయకులు హరిచ రణ్, రమ్య బెహారా తమ మ్యూజికల్ నైట్‌తో వేడుకకి మరింత ఊపుని తీసు కుని రాగా తన బ్యాండ్ ఎలీజియం సంగీత కార్యక్రమంతో గాయకుడు దన్ కర్ బృందం మరింత ఉత్సాహాన్ని విద్యార్థుల్లో నింపారు. కార్యక్రమంలో పొటెల్ చిత్రబృందం పాల్గొని రాబోయే తమ చిత్రాన్ని విద్యార్థులకు పరి చయం చేశారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులకు, అధ్యాయపకులకు పోటీ కార్యక్రమాలు జరిగాయి. కల్చరల్ ఫెస్ట్‌తో విఎన్‌ఆర్ విజెఐఈటి కళాశాల ప్రాంగణం మెరిసిపోయింది.

## ప్రభుత్వం టెట్ ప్రకటించడం పట్ల హర్షం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం టెట్ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని రాజ్యసభ సభ్యులు, జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఇది నిరుద్యోగుల పోరాట విజయమన్నారు. హైదరాబాద్ విద్యానగర్‌లోని బిసి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీనివల్ల టీచర్ పోస్టులకు లక్షలాదిమంది బిఇడి, డిఇడి అభ్యర్థుల అర్హత లభిస్తుందన్నారు. నిరుద్యోగుల పోరాటానికి ప్రభుత్వం స్పందించడం మంచి పరిణామం అన్నారు. ఈ సమావేశంలో బి.సి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నీల వెంకటేశ్, గుజ్జ కృష్ణ, అనంతయ్య, వేముల రామకృష్ణ, నందా గోపాల్, జి. కృష్ణ యాదవ్, విజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** తెలంగాణ రాష్ట్రంలో ఎంతో మంది కమ్మ సామాజికంలో నిరుపేదలు ఉన్నారని గుర్తించి కమ్మ కార్పొరేషన్‌ని ఏర్పాటు చేయడం హర్షనీయమని కమ్మ నాయకుడు రంగరాయ ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా రంగరాయ ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కమ్మ సామాజికం ప్రజల స్థితిగతులను అధ్యయనం చేసి ఎంతో మంది పేద ప్రజలు ఉన్నారని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం కమ్మ కార్పొరేషన్‌ని ఏర్పాటు చేసిన సిఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలను తెలిపారు. రాబోవు కాలంలో కమ్మ సామాజికం వారిని ఇబిసి కేటగిరిలో చేర్చి వారికి మరిన్ని అవకాశాలను కల్పించే విధంగా ప్రభుత్వం పని చేయాలని కోరారు.




## రైల్వే అండర్ బ్రిడ్జి పనులు నాణ్యతతో చేపట్టాలి

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి పరిధిలోని లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి దగ్గరలో వరద ముంపు సమస్యను పరిష్కరించాడానికి శాశ్వత పరిష్కారం దిశగా రూ. 4 కోట్ల రూపాయల అంచనా వ్యయంలో అండర్ బ్రిడ్జి పనులను ప్రారంభించారు. అండర్ బ్రిడ్జి పనులు నాణ్యతతో చెపడుతున్నార లేదా అని శుక్రవారం శేరిలింగంపల్లి ఎంఎల్ఏ అరికెపూడీ గాంధీ , జిహెచ్‌యంసి అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతతో చెపట్టి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఏన్నో ఏండ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా రానున్న వర్షకాలంలో అండర బ్రిడ్జి వద్ద ఎటు వంటి ఇబ్బందులు తలేత్తకుండా ముందు జాగ్రత్తగా పనులను ప్రారంభించామని తెలిపారు. అండర్ బ్రిడ్జి పనులు పూర్తైతే వాహనదారులకు ఎటు వంటి ఇబ్బందులు లేకుండా సుఖ ప్రయాణానికి పనులను పూర్తి చేసినట్లౌతుందని తెలిపారు. కార్యక్రమంలో జిహెచ్‌యంసి ఎస్ఈ శంకర్ నాయక్, ఈఈ కెవిఎస్ రాజు, డిఈ దుర్గా ప్రసాద్, ఏఈ సంతోష్ రెడ్డి, శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, చందానగర్ బీఆర్ఎస్ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, నాయకులు సందిప్ రెడ్డి పాల్గొన్నారు.

## నేడు–రేపు ఖమ్మంలో ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభలు

**ప్రజాపక్షం/వనస్థలిపురం :** ఈ నెల 16, 17న ఖమ్మంలో నిర్వహించే టీఎస్ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని హయత్ నగర్ డిపో అధ్యక్ష, కార్యదర్శిలు సత్తిరెడ్డి, ఆమనగంటి వెంకన్న లు అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అయిన తరువాత ఎంప్లాయిస్ యూనియన్ 3వ రాష్ట్ర మహాసభల్లో ఆర్‌టిసి యూనియన్ సమస్యలపై రెండు రోజుల పాటు ప్రతినిధులతో కలిసి సుదీర్ఘకంగా చర్యలు జరపనున్నారని వారు తెలిపారు. ఈ మహాసభకు టీఎస్ ఆర్‌టిసి యూనియన్ నాయకులు భారీగా పాల్గొని మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభలో ఎంప్లాయిస్ యూనియన్ ఎదురుకుంటున్న సమస్యలపై చర్చించి భవిషత్‌లో పోరాటాలకు సిద్ధం కావాలని, పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని వారు పేర్కొన్నారు. ఈ మహాసభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు పాల్గొంటారని తెలిపారు.

## లోవోల్టేజీ సమస్య నియంత్రించేందుకే ట్రాన్స్‌ఫార్మర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** లోవోల్టేజీ సమస్యలను నియంత్రించేందుకే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని కొందుర్గు మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి వివరించారు. శుక్రవారం కొందుర్గు మండల పరిధిలోని పులుసుమామిడి గ్రామంలో నీలంభాయి వద్ద రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని 100అస్వర్ల ట్రాన్స్‌ర్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ షాద్‌నగర్ ఎంఎల్ఏ వీర్లపల్లి శంకర్ సహాయ సహకారాలతోనే మండలంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎక్కడ లోవోల్టేజీ సమస్య లేకుండా అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో నేతలు అమర్నాథ్‌రెడ్డి, జాంగీర్, నర్సింహ్మారెడ్డి, మైపాల్‌రెడ్డి, బలవంత్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సుధాకర్ గౌడ్, పెంటారెడ్డి, మల్లారెడ్డి, బాలకృష్ణ, సత్యనారాయణ గౌడ్‌లు ఉన్నారు.

## ఉపాధి పనులను వేగవంతం చేయాలి



**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండలంలో ఉపాధి పనులను వేగవంతం చేయాలని రంగారెడ్డి డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీలత అన్నారు. శుక్రవారం యాచారం, నల్లవెల్లి గ్రామాల్లో అమే పర్యటించారు. ఉపాధి పనులను పరిశీలించారు. నర్సరీ బెడ్లను చూశారు. ఈ సంధర్భంగా అమే మాట్లాడుతూ కూలీల సంఖ్యను పెంచాలని అన్నారు. ఉపాధి హామీ పథకంలో చేస్తున్న పనులు నాణ్యంగా ఉండాలని అన్నారు. ఫాంపండ్ పనులతో ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. భూగర్భ జల మట్టం పెరుగుతుందని చెప్పారు. పని కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి పని చూపాల్సిన అవుసరం ఉందని అన్నారు. ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యతగా పని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. మాస్టర్‌లో ఎలాంటి తప్పులు లేకుండా చూడాల్సిన బాధ్యత ఫిల్ల్ అసిస్టెంట్లపై ఉంతైనా ఉందన్నారు. లాండ్ లేవలింగ్ తదితర పనులు చేయించాలని అన్నారు. ఉపాధి సిబ్బందికి తగిన వసతులు కల్పించాలని చెప్పారు.వేసవి కావడంతో నర్సరీలు నీరు లేక ఎండిపోయే అవకాశం ఉంది. మొక్కలు ఎండి పోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిఆర్‌డిఏ అడిషినల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుభాషిణి, ఇబ్రహింపట్నం ఎపిడి సక్రియనాయక్, ఎంపిడిఓ నరేంధర్‌రెడ్డి, ఉపాధి ఇంజనీర్ శివశంకర్‌రెడ్డి,ఉపాది ఎపిఓ లింగయ్య, అసిస్టెంట్లు , పంచాయతి కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంఎల్ఏ శంకర్‌కు అస్వస్థత మాజీ ఎంఎల్ఏ ప్రతాప్‌రెడ్డి పరామర్శ



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** విశ్రాంతి లేకుండా ఎండలో పర్యటించడంతో ఎంఎల్ఏ వీర్లపల్లి శంకర్ కొంత అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఈ విషయం తెలుసుకున్న షాద్‌నగర్ మాజీ శాసన సభ్యులు చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, కొత్తూరు మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్‌తో పాటు దంగు శ్రీనివాస్ యాదవ్, చెంది తిరుపతిరెడ్డిలు ఎంఎల్ఏ వీర్లపల్లి శంకర్ నివాసానికి చేరుకొని ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఉదయం నుండి సాయంత్రం వరకు కొత్తూరు మండలం నుండి మొదలుకొని నందిగామ, కేశంపేట, ఫరూఖ్‌నగర్ మండలాలతోపాటు కొందుర్గు మండలానికి చేరుకోగానే ఉన్నఫలంగా ఒక్కసారిగా వాంతులు కావడం, అస్వస్థతకు గురి కావడం కొంత బాద వేసిందని వివరించారు.

# హైదరాబాద్ నగర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగర అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ అన్నారు. ఆరు రాష్ట్రాలకు చెందిన శిక్షణలో ఉన్న ఐఏఎస్‌లు బెస్ట్ ప్రాక్టీసెస్‌పై అధ్యయనం చేయడానికి జిహెచ్‌ఎంసిని సందర్శించారు. ముస్సోరిలో ట్రైనింగ్ పొందుతున్న హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు చెందిన 16 మంది ఐఏఎస్‌లు రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం జిహెచ్‌ఎంసికి వచ్చారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయం పన్వర్ హాల్‌లో కమిషనర్ రోనాల్డ్ రోస్ జిహెచ్ఎంసి బెస్ట్ ప్రాక్టీసెస్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించారు. పరిపాలన పరమైన అంశాలను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో శిక్షణలో ఉన్న ఐఏఎస్‌లు రమేష్ ఆర్ దామోర్, దుని చంద్ రాణా, రోహిత్ జామ్ వాల్, దిశా ప్రణయ్ నాగ్ వంశీ, అనురాగ్ సక్సేనా, శుచి స్మిత సక్సేనా, అవినాష్ ప్రభాకర్ రావ్ పాతక్, డాక్టర్ ప్రవీణ్ కుమార్ పితాంబర్ దియోరే, ప్రకాష్ బాబురావు ఖాప్లే, గోరక్ష మహాదేవ్ గదిల్ కార్, మకరంద్ ప్రహ్లాద్ దేశ్ముఖ్, మిలింద్ కుమార్ వామన్ రావు సాల్వే, సచిన్ కాలన్ ట్రే, ప్రియాంక గోస్వామి, పుఖ్ రాజ్ సేన్, ప్రకాష్ చంద్రలు, జిహెచ్‌ఎంసి అధికారులు ఇవిడిఎం డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, ఈఎన్‌సి జియా ఉద్దీన్, అదనపు కమిషనర్లు శివ కుమార్ నాయుడు ఉన్నారు.

# సిజేరియన్‌ల సంఖ్య తగ్గాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక





**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** ప్రైవేటు ఆసుపత్రులలో సి సెక్షన్ ప్రసవాలను తగ్గించి,నార్మల్ డెలివరీలను పెంచుతూ..ప్రజలకు సామాజిక దృక్పధంతో నాణ్యమైన వైద్య,ఆరోగ్య సేవలను బాధ్యతాహితంగా అందించడంతోపాటు ఈబర్త్ పోర్టల్ ను కచ్చితంగాఉపయోగించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక వైద్యులను ఆదేశించారు. శుక్రవారం గచ్చిబౌలిలోని ఎఐజిహాస్పిటల్ లో రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో రిజిస్టర్డ్ ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు,గైనకాలజిస్టులకు పిసి అండ్ పి ఎన్ డి టి చట్టము, ఎంటిపి, సరోగసి చట్టల పై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా రాష్ట్ర సంయుక్త సంచాలకులు డాక్టర్ పద్మజా తో కలిసి జిల్లా కలెక్టర్ శశాంక ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన నియమ నిబంధనలు సిసెక్షన్ డెలివరీ విధానంలో తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. అదేవిధంగా చట్టబద్ధ గర్భస్రావాలు చేసేటప్పుడు కూడా నిర్దిష్ట ప్రమాణాలు పాటించాలని చెప్పారు. లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, సిసెక్షన్ ఆడిట్ చేసేటప్పుడు తప్పనిసరిగా తగిన రికార్డులు చూపించాలని ప్రైవేట్ వైద్యులకు జిల్లా కలెక్టర్ శశంక ఆదేశించారు.అనంతరం జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా ఆరోగ్య రంగంలో అభివృద్ధి చెందినప్పటికీ కూడా నార్మల్ డెలివరీలు , 06 సంవత్సరముల పిల్లల సెక్స్ రేషియో (లింగ నిష్పత్తి) లో వెనుకంజలో ఉండడానికి గల కారణాలను అధిగమించడానికి ప్రయత్నించాలని వైద్యులను అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సృజన మాట్లాడుతూ మాత శిశు ఆరోగ్యం మెటర్నల్ ప్రోటోకాల్స్,సరోగసి ప్రోటోకాల్స్ తప్పనిసరిగా రికార్డ్స్ నిర్వహించి, సంబంధిత అధికారులతోపాటు బర్త్ మానిటరింగ్ పోర్టల్ లో నమోదు చేయాలని తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే ప్రతి టిబి కేసును సంబంధిత ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో నమోదు చేయవలసిందిగా జిల్లా క్షయ నిర్మూలన అధికారి డాక్టర్ అరుణకుమారి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరో గ్య శాఖ అధికారులు,ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్య వైద్యులు, గైనకాలజిస్టులు పాల్గొన్నారు.

# సేవ ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత




**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** సేవ కార్యక్రమాలని నిర్వహించడానికి ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా గుర్తించి తమకు వచ్చే సంపాదనలో కొంతైనా సేవ కార్యక్రమాలకు వెచ్చించాలని లయన్స్ క్లబ్ 320 ఎ,పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జూలూరు రఘు అన్నారు.శుక్రవారం చైతన్యపురి బస్ స్టాప్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఎవరెస్ట్, యంగ్ లైన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదాచారులకు,ఆటో రిక్షా కార్మికులు,అడ్డమీది మీద కూలీలకు, కోచింగ్లకు వచ్చే విద్యార్థిని,విద్యార్థులకు, ప్రజలందరికీ చల్లని నీటిని అందించే విధంగా స్వచ్ఛమైన నీటిని క్యాన్లలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.ఇట్టి వసతినీ ప్రజలందరూ ఉచితంగా ఉపయోగించుకొని,వారి దాహార్తిని తీర్చుకోవాలని ఇది ఒక మంచి సేవా కార్యక్రమం అని లయన్స్ క్లబ్ 320ఎ, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జూలూరు రఘు పేర్కొన్నారు. చలివేంద్ర ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పూర్తి ఖర్చులను భరించి ఇంత గొప్ప కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న యంగ్ లయన్స్ ఎవరెస్ట్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ వారిని హైదరాబాద్ లైన్స్ క్లబ్ గవర్నర్ రఘు అభినందించారు. ఇటువంటి గొప్ప సేవా కార్యక్రమాలని నిర్వహించడానికి ప్రతి ఒక్కరు కూడా సామాజిక బాధ్యతగా గుర్తించి తమకు వచ్చే సంపాదనలో కొంతైనా సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తే సమాజంలో ఎంతో బీద స్థితిని అనుభవిస్తున్న వారికి చేయూత నిచ్చిన వారు అవుతారని రఘు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సామాజిక సేవా సంఘం నాయకులు మొగుళ్ళపల్లి ఉపేందర్, ప్రముఖ న్యాయవాది పివి రవికుమార్, లయన్స్ బృందం సభ్యులు కాటం సునీల్, అధ్యక్షులు అరవింద్, రవీందర్,ఎదులకంటి శ్రీనివాస్, ఎం శ్రీనివాస్, పాల్గొన్నారు. ఈ సేవా కార్యక్రమానికి ముఖ్యంగా ఆర్థిక సహాయం అందించిన దాతలు లయన్స్ క్లబ్ సభ్యులు పసుపులేటి సుబ్బయ్య,మహేందర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, డి జె రమేష్ ,మంత్రి రాజు, రాము గౌడ్, సుధాకర్, తెలంగాణ ఎడ్యుకేషనల్ అడ్వైజర్స్ సభ్యులు మామిడి అశోక్ ,కన్నెఆనంద్ కుమార్, రమణారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పైప్‌లైన్ పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/చర్లపల్లి:** నియోజకవర్గ అభివృద్ధికి అధికారులు,ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఉప్పల్ ఎంఎల్ఏ బండారి లక్ష్మారెడ్డి అన్నారు.శుక్రవారం చర్లపల్లి డివిజన్ వివిఎస్ రెడ్డి నగర్ కాలనీలో 36 లక్షల వ్యయంతో సివరేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఎంఎల్ఏ ప్రారంభించారు.ఈ సందర్భంగా నియోజక వర్గంలో అధిక నిధులు కేటాయిస్తూ అభివృద్ధి చేస్తున్నామని,పనులు వేగవంతం చేస్తూ ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డిజిఎం సతీష్,ఏఇ రోహిత్,జిహెచ్‌ఎంసి అధికారులు,నాయకులు సప్పిడి శ్రీనివాస్ రెడ్డి,అనిల్,వెంకటేష్‌గౌడ్,కనకరాజ్‌గౌడ్,రాజేశ్వర్‌రెడ్డి,శివగౌడ్,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కుషాయిగూడలోని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించానున్నమని కోర్టు సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి కోర్టు న్యాయమూర్తి,జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ బిఆర్ మధుసూదన్‌రావు,రాచకొండ కమిషనర్ తరుణ్‌జోషి,జిల్లా కలెక్టర్ గౌతమ్‌లు పాల్గొంటారని వారు తెలిపారు.జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోట రాంచంద్రరెడ్డి సూచించారు.




## స్టోన్ క్రషర్స్ యాజమాన్యం సమ్మెబాట

మైనింగ్ అధికారుల వేధింపులకు నిరసన: నేటి నుండి బంద్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మైనింగ్ శాఖ అధికారుల వేధింపులకు నిరసనగా తెలంగాణ స్టోన్ క్రషర్స్ అసోసియేషన్ సమ్మెకు పిలుపునిచ్చింది. శనివారం నుంచి రాష్ట్రంలో నిర్మాణ కార్యకలాపాలు నిలిచిపోనున్నాయి. స్టోన్ క్రషర్ల యజమానులపై అధికారులు వేధింపులకు నిరసనగా ఈ సమ్మె చేపట్టినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.కమలాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కూన శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు నందారెడ్డి తెలిపారు. 30 ఏళ్ల నుండి లీజు నడుపుకుంటున్న యజమాన్యాలపై అక్రమంగా జరిమానాలు వేస్తున్నారని అన్నారు. ఓఆర్‌ఆర్‌ను ఆనుకుని అక్రమంగా నడుస్తున్న క్రషర్లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ స్టోన్ క్రషర్ రంగంపై దాదాపు 50 లక్షల మంది ప్రత్యేక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారని, ఈ సమ్మె వల్ల వారు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని, మైనింగ్ శాఖ అధికారుల వేధింపులను నివారించాలని కోరారు. ఈ మేరకు బిబి నగర్‌లోని ఓ కన్వెన్షన్‌లో 300 మంది అసోసియేషన్ ప్రతినిధులు సమావేశమై, ఈ సమ్మె ప్రకటన చేశారు. ఈ సమ్మెతో రవాణ రంగంతో పాటు నిర్మాణ రంగానికి భవన నిర్మాణ సామగ్రి కొరత ఏర్పడుతుందన్నారు.

## గాంధీభవన్ కేంద్రంగా భూదాన్ భూముల అక్రమ దందా

**ప్రజాపక్షం/వనస్థలిపురం:** రద్దు అయిన భూదాన్ బోర్డ్ పేరుతో గాంధీ భవన్ అడ్డగా పెట్టుకున్ని భూదాన్ భూముల దంద చేస్తున్న బోర్డు మాజీ చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డిని గాంధీ భవన్ నుంచి తరిమి కొట్టి వారిపై సిబిఐ విచారణ చేయించాలని సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షులు రమావత్ శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. సర్వేదయ మండలి జిల్లా మహాసభ నాగోల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే మొదటి సారిగా భూములను దానంగా పోచంపల్లి గ్రామంలో వేదిరే రామ చంద్రరెడ్డి ఇచ్చి గ్రామాన్ని భూదాన్ పోచంపల్లిగా పేరు తెచ్చారన్నారు. భూదాన్ భూములు అన్యక్రాంతం, అక్రమణకు గురికాకుండా కాపాడుకోవాలని, అందుకోసం మరోసారి భూదాన్ ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చా రు. భూదాన్ భుములు అన్యాక్రాంతం కాకుండా ఉండాలంటే గున్న రాజేందర్‌రెడ్డి లాంటి భూభకాసురులను జైల్లో పెట్టాలన్నారు. ఖాళీగా ఉన్న భూములను అర్హులైన పేద రైతులకు, నిర్వహసితులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సర్వోదయ మహాసభలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా కె. చందును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సహేదా బేగం, యాకుబ్ పాష, ధనమ్మ, శ్రీనివాస్, ఆరేకంటి రాములు, మేడం రాజేష్, కొమ్ము యాదగిరి, కమల, కొమ్ము రాములు, మున్నా, శ్రీనివాస్, షమీమ్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

## కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/శాబాద్ :** కురుమ సంఘానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మండల కురుమ సంఘం అధ్యక్షుడు కూతురు మహేందర్ అన్నారు. శుక్రవారం శాబాద్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు మా కురుమ కులస్తుల జీవితాలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆర్థికంగా వెనుకబడిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక నిధులు కెటాయించాలని డిమాండ్ చేశారు.

# ఘనంగా ఎంఎల్ఏ వీర్లపల్లి శంకర్ జన్మదిన వేడుకలు






**ప్రజాపక్షం/కేశంపేట:** షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జన్మదిన వేడుకలను కేశంపేట మండలంలో కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. మండలంలోని భైర్‌ఖాన్‌పల్లిలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి అందజేసేందుకు కాంగ్రెస్ నాయకుడు కొట్టం శశివర్ధన్‌రెడ్డి తన తాత కొట్టం రాంరెడ్డి, తండ్రి కొట్టం లక్ష్మారెడ్డిల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్‌ను ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా దాత శశివర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేసిన శశివర్ధన్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గూడ వీరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు రూప్లానాయక్, రాఘవేందర్‌రావు, శ్రీధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కరుణాకర్‌రెడ్డి, గిరియాదవ్, తుమ్మల గోపాల్, వెంకట్‌రెడ్డిలతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఇప్పలపల్లిలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం**

మండలంలోని ఇప్పలపల్లిలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జన్మదినం సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకులు పిప్పళ్ల శ్రీనాథ్ ఆధ్వర్యంలో ఐపిఎల్ సీజన్ 5 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు క్రీడాకారులను యూనిఫాంలను అందజేసి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మంజుల, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గూడ వీరేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, నాయకులు రాజశేఖర్, గిరియాదవ్, కరుణాకర్‌రెడ్డి, పర్వతాలు, కిషన్‌నాయక్, తుమ్మల గోపాల్, రాజేష్, సచిన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

**సేవా కార్యక్రమాలు నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు**

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట భవాని మాత దేవాలయంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎంఎల్ఏ వీర్లపల్లి శంకర్‌కు స్వగృహం వద్ద మాజీ శాసన సభ్యులు చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి సభ్యులు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, కేశంపేట జడ్పిటిసి సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, కాంగ్రెస్ మైనార్టీ నేత మహ్మద్ ఇబ్రహీం, ఫరూఖ్‌నగర్ జడ్పిటిసి సభ్యుడు పి.వెంకట్‌రాంరెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్‌లు పూలమాలలు, శాలువాలు వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేయడంతోపాటు వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు అందె మోహన్, లింగారెడ్డిగూడ అశోక్, సీతారాములు, ఎంపిటిసి సభ్యుడు శ్రీశైలం, ముబారక్, రవి, సందీప్, పులిమామిడి రాజేష్ గౌడ్, మహేష్, రాయికల్ శ్రీను, జగదీష్, శేఖర్‌లు పాల్గొన్నారు.

షాద్‌నగర్ ఎంఎల్ఏ వీర్లపల్లి శంకర్‌కు ఫరూఖ్‌నగర్ జడ్పిటిసి సభ్యుడు పి.వెంకట్‌రాంరెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

**ప్రజాపక్షం/కేశంపేట :** షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దేవుని కృపతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో బాగుండాలని కేశంపేట జడ్పిటిసి తాండ్ర విశాలశ్రావణ్ రెడ్డి అకాంక్షించారు. గురువారం కేశంపేట మండలంలో కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డితో పాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వడదెబ్బతో సొమ్మసిల్లి పడిపోయారు. జడ్పిటిసి విశాలశ్రావణ్‌రెడ్డి దంపతులు శుక్రవారం ఎమ్మెల్యే శంకర్‌ను కలిసి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని అనంతరం పుష్పగుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.





# అర్హులైన అందరికీ ఇండ్లు, ఇంటిస్థలాలు ఇవ్వాల్సిందే..

సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు బాల్‌నర్సింహ్మ



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** అర్హులైన వారందరికీ ఇండ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాల్సిందేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా సమితి సమావేశం సిపిఐపార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఉండే దళితులు, ఆదివాసులు గిరిజనులకు ప్రభుత్వమే సొంత స్థలాలు ఇచ్చి ఇండ్లనిర్మాణం పూర్తి చేసి ఇవ్వాలన్నారు. అసలైన లబ్ధిదారులను గుర్తించి ఇండ్లను పూర్తిగా నిర్మాణంచేసి ఇవ్వాలన్నారు. అదేవిధంగా గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని తెలంగాణ ప్రాంతంలో ఉండే కూలీలు ఇతర రాష్ట్రాలకు వలస పోకుండా సొంతగ్రామంలోనే పనులు కల్పించాలన్నారు. రోజువారి వేతనం రూ.600లు దినసరి కూలీపని ప్రదేశాలలో మంచినీటి వసతులు, టెంటు లు, గడ్డపారలు, తట్టలు పనిచేసినవారం రోజులకే కూలీ డబ్బులను అకౌంట్‌లో జమచేయాలన్నారు. సమావేశంలో రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వార్ల వెంకటయ్య, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి ఏసయ్య, జిల్లా అధ్యక్షులు రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటయ్య, జిల్లా సహాయ కార్యదర్శి మద్దిలేటి, కార్యవర్గ సభ్యులు కరీం, రామయ్య, గోవింద్, బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి పోరాడాలి



**ప్రజాపక్షం/వరంగల్ :** సమస్యల పరిష్కారం కోసం బిసిలు పోరాడాలని, బిసి జనాభా ప్రతిపాధికన చట్ట సభల్లో సీట్లు కేటాయించాలని బిసి హక్కుల సాధన సమితి జిల్లా నిర్మాణ బాధ్యు లు పంజాల రమేష్ అన్నారు. బిసి హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం పరికాల రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా పంజాల రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వివిధ బిసి కులాల కార్పోరేషన్లకు బిసిలకు చెందిన నాయకులను మాత్రమే కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించాలని తద్వారా కార్పోరేషన్ల నిధులు బిసిలకు అందరికి ఎలాంటి అవినీతి అక్రమాలు జరగకుండా అదేవిధంగా చర్యలు చేపట్టి బిసిల అభివృద్ధి కోసం ప్రభుత్వాల పాటుపడాలని, అందుకోసం బిసిలు చైతన్యవంతమైన రాజకీయాల వైపు పయనిస్తూ సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి ఎస్‌కే భాష మియా, బిసి హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి వలబోజు వెంకన్న, సిపిఐ జిల్లా సభ్యులు బూస రవీందర్, దండు లక్ష్మ ణ్, గండె బద్రి, ఎలందర్, మియాపురం గోవర్ధన్, చిట్యాల సువర్ణ, మెర్గు మల్లయ్య, మేడిది అశోక్, లలిత, స్వప్న, యాదగిరి, సతీష్, ఏకామ్రాచారి పాల్గొన్నారు.

# సిపిఐతోనే సమస్యలు పరిష్కారం



**ప్రజాపక్షం/మోత్కూర్:** కమ్యూనిస్టులతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సిపిఐలో చేరిన నాయకులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిఆర్‌ఎస్ నాయకులు చెప్పిన మాయమాటలు విని, సిపిఐని వీడిన వారి తిరిగి పార్టీలో చేరారన్నారు. పార్టీలో చేరిన వారిలో జంగా నరసయ్య, నిలిగొండ అశోక్ వున్నారు. భవిష్యత్తులో పార్టీ నిర్ణయాలకు కట్టుబడి పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, పట్టణ కార్యదర్శి పుల్కరం మల్లేష్, చాపల అంజయ్య, గొలుసుల యాదగిరి, పోచం కన్నయ్య, తాడూరు లక్ష్మీ నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు వత్తిడికి గురికావొద్దు



**ప్రజాపక్షం/అడ్డగూడూరు:** పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు ప్రశాంతంగా రాయాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి కోరారు. షాహిద్ భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పదవతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లుమరియు పెన్నులు శుక్రవారం అందజేశారు. అడ్డగూడూరు మండలంలోని అడ్డగూడూరు, చౌల్లరామారం, డి.రేపాక, అజింపేట, ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదివే విద్యార్థులకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పిఎసిఎస్ అడ్డగూడూరు మండల వైస్‌చైర్మన్ చెడే చంద్రయ్య సహకారంతో ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 23న భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. విద్యార్థులు పరీక్షలు రాసే సమయంలో భయభ్రాంతులకు గురికాకుండా పట్టుదలతో రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలని భగత్‌సింగ్ స్ఫూర్తితో లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, రామలింగయ్య ,శివాజీ, యాదగిరి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సూరారం జానీ, అడ్డగూడూరు మండల నాయకులు పిల్లి సతీష్, విద్యార్థులు సిహెచ్ బన్నీ సిహెచ్ సన్నీ ఎస్ మచ్చ గిరి ఎన్ నవదీప్ ఏం ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులు ఇచ్చేంత వరకు సర్వే నిర్వహించం



**ప్రజాపక్షం/నాంపల్లి :** గత రెండు సంత్సరాల క్రితం నిర్వహించిన లెప్రసి సర్వేకు సంబంధించిన పెండింగ్ బిల్లులు ఇచ్చేంతవరకు లెప్రసి సర్వే నిర్వహించమని పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని నాంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డా. ఇశ్రాత్‌కు తెలంగాణ రాష్ట్ర ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటి పిలుపులో భాగంగా ఆశావర్కర్ల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నిర్వహించిన సర్వేకు సంబంధించిన బిల్లులు ఇంతవరకు చెల్లించలేదని మరల లెప్రసి సర్వే చేయమని అది కూడా ఉదయం 6 గంటలకే చేయాలని చెప్పడం ఆశా వర్కర్ల శ్రమను దోపిడి కి గురిచేయడం అని అన్నారు. తక్షణమే సర్వే సమయాన్ని మర్చాలని, కావాల్సిన పరికరాలను ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ నాంపల్లి మండల ప్రధాన కార్యదర్శి మెగావత్ సునీత, సిహెచ్ సైదమ్మ, రేణుక, విజయ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసిలో కార్మికులపై

# పనిభారం



పనిభారం తగ్గించాలి.. వేధింపులు ఆపాలి

ఎంప్లాయిస్ యూనియన్ నేత బాబు

నేటి నుంచి ఖమ్మంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభలు

హాజరుకానున్న ఉప ముఖ్యమంత్రి భట్టి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆర్‌టిసి కార్మికులపై విపరీతమైన పనిభారం పడుతుందని విధుల నిర్వహణ కత్తిమీద సాములా మారిందని రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు పనిభారాన్ని తగ్గించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాబు కోరారు. యాజమాన్యం వేధింపులు కార్మికులపై పెరిగాయని ఆయన ఆరోపించారు. శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాబు మాట్లాడుతూ ఆర్‌టిసిలో ట్రేడ్ యూనియన్ల ఉనికి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. నిరంకుశంగా నియంతలా వ్యవహరించిన కెసిఆర్ ప్రభుత్వం ట్రేడ్ యూనియన్లను రద్దు చేసిందని, కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 100 రోజుల్లో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిన ఆర్‌టిసి కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ మాత్రం పూర్తి కాలేదన్నారు. 2023లోనే విలీన ప్రక్రియ ప్రారంభించినా అపాయింట్‌మెంట్ డేట్‌ను ప్రకటించలేదని, ట్రేజరీ ద్వారా వేతనాలు చెల్లించడం లేదన్నారు. ఆర్‌టిసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ తక్షణం అపాయింట్‌మెంట్ డేట్ ప్రకటించాలని బాబు కోరారు. 2017 వేతన సవరణను ట్రేడ్ యూనియన్ లేకుండా ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. 21శాతం ఫిట్‌మెంట్ ప్రకటించడం వలన ఆర్‌టిసి కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఆర్‌టిసి కార్మికులకు 21 శాతం పెరిగిన తర్వాత వేలకు వేలు పెరిగాయని ప్రచారం జరుగుతుందని కానీ స్వల్పంగానే వేతనాలు పెరిగాయని హెచ్ఆర్‌ఎ తగ్గితే మళ్లీ తగ్గుతాయన్నారు. తొమ్మిది డిఎల బకాయిలున్నాయని వాటిని వెంటనే చెల్లించాలని ఆర్‌టిసిఎంప్లాయిస్ యూనియన్ పోరాడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భారతీయ న్యాయ సహిత చట్టంతో డ్రైవర్లు పని చేయలేని పరిస్థితి ఉందని ఆ చట్టాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్‌టిసి ప్రయాణికులు పెరిగారని అందుకు తగ్గట్లు సిబ్బందిని, బస్సుల సంఖ్యను పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## నేటి నుంచి రాష్ట్ర మహాసభలు

ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మూడవ మహాసభలు ఈనెల 16, 17 తేదీలలో ఖమ్మంలోని టిఎన్‌జీవోస్ ఫంక్షన్‌హాల్‌లో జరగనున్నాయని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాబు తెలిపారు. ఈ మహాసభలను ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావులు ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని అన్ని డిపోలకు, రీజియన్లకు ప్రాతినిథ్యం వహిస్తూ 250 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని, ఈ మహాసభలలో ఆర్‌టిసి కార్మికుల సమస్యను చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు బాబు తెలిపారు. సమావేశంలో యూనియన్ గౌరవాధ్యక్షులు వెంకటగౌడ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఇ.వెంకన్న, రాష్ట్ర నాయకులు తిమ్మినేని రామారావు, పాటి అప్పారావు, ఖమ్మం రీజియన్ కార్యదర్శి పిల్లి రమేష్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి తోట రామాంజనేయులు, నాయకులు బుచ్చిబాబు, బివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించాలి

ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు శ్రీరాం



**ప్రజాపక్షం/పాన్‌గల్ :** గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్లు, కార్యదర్శుల జాయింట్ చెక్ పవర్ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించి గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించేందుకు మార్గం సుగమం చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కె.శ్రీరాం డిమాండ్ చేశారు. పాన్‌గల్ మండలం కేతేపల్లి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో సర్పంచ్, ఉప సర్పంచ్‌కు జాయింట్ చెక్ పవర్ ఉండేదని, నిధులు డ్రా చేసి పారిశుద్ధ్య కార్మికులకు, వాటర్‌మెన్స్‌కు జీతాలు ఇచ్చి, తక్కిన నిధులతో ఇతర అభివృద్ధి పనులు చేసేవారన్నారు. సర్పంచుల పదవి కాలం ముగియటంతో ఫిబ్రవరి రెండో తేది నుంచి స్పెషల్ ఆఫీసర్ల పాలన వచ్చిందన్నారు. పంచాయతీల నిధుల డ్రా కోసం స్పెషలాఫీసర్, గ్రామ కార్యదర్శి జాయింట్ చెక్ పవర్ ఇస్తామని కోరిందన్నారు. ఈ మేరకు జిల్లాలోని ఎంపీడీఓలు, డిపిఓల ద్వారా ఆన్‌లైన్ జాయింట్ చెక్ పవర్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి రెండు నెలలు కావస్తున్నా ఇంత వరకు ఆమోదం లేదన్నారు. నిధులు డ్రా చేసే పరిస్థితి లేకపోవడంతో జిల్లాలోని 255 పంచాయతీలలో మందిలాది మంది పారిశుద్ధ్య కార్మికుల జీతాల చెల్లింపు ఆగిపోయిందన్నారు. స్పెషల్ ఆఫీసర్లను ఎంపీడీఓలను డిపిఓను అడిగితే జాయింట్ చెక్ పవర్‌కు ఆమోదముద్ర వేస్తేనే జీతాలు ఇచ్చే వీలు ఉంటుందని చెబుతున్నారని తెలిపారు. జిల్లాలో సుమారు వేయిమంది పారిశుద్ధ్య కార్మికులు జీతాలు రాక ఇబ్బంది పడుతున్నారని విమర్శించారు. వెంటనే జీతాలు చెల్లించకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో కుర్మయ్య, మద్దిలేటి, కురుమయ్య, పకీర తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలతో సింగరేణి కార్మికుల సతమతం

పరిష్కారానికి ఎఐటియుసి వినతి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని జిడికే వన్ ఇంక్లయిన్ కార్మికులు సమస్యలతో సతమతమవుతున్నరని, వాటిని వెంటనే పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సింగరేణి గుర్తింపు సంఘం ఎఐటియుసి శుక్రవారం గని మేనేజర్‌కు ఇచ్చిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ మాట్లాడుతూ వన్ ఇంక్లైన్ లో కార్మికులు గనిలో సర్ఫేస్ వరకు మ్యాన్ రైడింగ్ లేకపోవడంతో గని పైకి రావడానికి ఇబ్బందులు పడుతున్నారని, సర్ఫేస్ మ్యాన్ రైడింగ్ ఏర్పాటు చేయాలని, గనిలో ప్రస్తుతం ఉన్న ఎస్‌డిఎల్ యంత్రాలు పూర్తిగా చెడిపోయి ఉత్పత్తికి ఆటంకం ఏర్పడి కార్మికులు వాటిని నడపడానికి ఇబ్బందులు పడుతున్నారని, వివిధ వృత్తుల్లో పనిచేస్తున్న వారికి రూములు లేక ఇబ్బందులు పడుతున్నారని, సెల్ ఫోన్‌లను భద్రపరిచేందుకు లాకర్‌లను ఏర్పాటు చేయాలని, మహిళా కార్మికులకు రెస్ట్, వాష్ రూములు లేక ఇబ్బందులు పడుతున్నారని, మ్యాన్ వేలో మస్టర్ పడే దగ్గర డిస్ప్లే బోర్డులు పెట్టించాలని, అండర్ మేనేజర్ రూము నుండి డిస్ట్రిబ్యూషన్ పాయింట్ వరకు రోడ్డు వేయాలని, క్యాంటీన్ ముందు ఉన్న వాటర్ ట్యాంక్‌ను కొత్తగా నిర్మించాలని, ఇసుక బంకర్‌ల సమస్యను పరిష్కరించాలని, క్యాంటీన్లో టిఫిన్స్ ఫస్ట్ షిఫ్ట్‌లో ఉన్న విదంగా సెకండ్ షిఫ్ట్‌లో కూడా ఏర్పాటు చేయాలని, స్టవింగ్ చేసే మెటీరియల్ క్వాలిటీ మెరుగు పరిచి జామ్ కాకుండా, బారికేడ్లు పగలకుండా చూడాలని, జిడికే వన్ ఇంక్లయిన్ మెయిన్ గేటు నుండి వన్ ఇంక్లయిన్ రైల్వే అండర్ బ్రిడ్జి వరకు ఉన్న రోడ్డు డ్యామేజ్ అయిందని ,కొత్త రోడ్డు వేయాలని తదితర సమస్యలపై వినతిపత్రం ఇవ్వడం జరిగిందని, అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, పిట్ సెక్రటరీ మానాల శ్రీనివాస్, నాయకులు సిర్ర మల్లికార్జున్, సంపత్ రావు, నగేశ్, వొల్లాల మల్లయ్య, శేశాల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



**శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఎస్ అండ్ పిసి డిపార్ట్మెంట్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని గుర్తింపు కార్మిక సంఘం ఎఐటియుసి యూనియన్ నాయకులు అన్నారు. శుక్రవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో సెక్యూరిటీ జిఎం దీక్షితులుకు వినతిపత్రం అందజేశారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీ సైదాలు మాట్లాడుతూ శ్రీరాంపూర్ డివిజన్‌లో సెక్యూరిటీ గార్డ్స్ కొరత అధికంగా ఉన్నందున ఇంటర్నల్ సెక్యూరిటీ గార్డ్స్ నియమకాలు చేపట్టాలన్నారు. చెక్ పోస్టులలో కూలర్స్, కుర్చీలు తాగునీరు ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్ రావు, ఫిట్ కార్యదర్శి ఆడెపు మల్లికార్జున్, అఫ్రోజ్ ఖాన్, పి.అశోక్, ఎ. శ్రీధర్, పిసదానందం, బి.రామచందర్, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వందరోజుల్లో రూ.100 కోట్ల అభివృద్ధి

విప్ బీర్ల ఐలయ్య



**ప్రజాపక్షం/ఆలేరు :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు అయినప్పటికీ ఆలేరు నియోజకవర్గంలో రూ.100 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించామని ఖర్చు చేశామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. శుక్రవారం ఆలేరు మండలంలోని మందనపల్లి గ్రామంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామాల్లో నీటిఎద్దడి రాకుండా చూసుకోవాలని,అందుకు ప్రతి గ్రామ స్పెషల్ ఆఫీసర్ పనిచేయాలని తెలిపారు ఏదైనా అవసరం ఉంటే నేరుగా నన్నే సంప్రదించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆలేరు నియోజకవర్గంలో ఇండ్లు కట్టుకునే వారికే ఇసుక పర్మిషన్ ఇవ్వాలని విచ్చలవిడిగా ఇసుక రవాణా జరగవద్దని అలా జరిగినట్లయితే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. గ్రామాలలో ఏ ఒక్క బెల్ట్ షాపు కూడా నడవద్దని హెచ్చరించారు. ప్రభుత్వం ఆలేరు నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు చేసిందని, అందుకు ఒక గ్రామానికి 20 నుండి 30 ఇండ్లు ఇస్తామని తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు తొందర్లోనే ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం తొందరలోనే తీపి కబురు చెబుతుందని తెలిపారు గత ప్రభుత్వాలు చేయలేని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా చేస్తుందన్నారు. పార్లమెంటు ఎన్నికలలో ఆలేరు నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి భారీమెజార్టీ ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఎంపిపి గంధ మల్ల అశోక్, వైస్ ఎంపిపి గాజుల లావణ్య వెంకటేష్, వెంకటేశ్వర రాజు, పారునంది భాస్కర్, ఉట్కూరు సురేష్, ,వెంకటేష్, కడగంచి రాజు, సుంకరి విక్రమ్, చిలుక కిష్టయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## త్రివేంద్రం రైల్వే డివిజన్ అభివృద్ధి

# ప్రాజెక్టులకు నిధులివ్వాలి

రైల్వేమంత్రికి సిపిఐ ఎంపి బినొయ్ విశ్వం లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సదరన్ రైల్వేలో కీలకమైన స్టేషన్లలో ఒకటైన త్రివేంద్రం సెంట్రల్ రైల్వే స్టేషన్, దక్షిణ కేరళ ప్రాంతం పట్ల రైల్వే శాఖ వివక్షతను తక్షణమే విడనాడాలని సిపిఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ పార్లమెంటరీ పార్టీ నాయకులు బినొయ్ విశ్వం అన్నారు. ప్రజల డిమాండ్లు, ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని త్రివేంద్రంకు వందేభారత్ రైలు, మంచి నాణ్యతతో మరిన్ని రైళ్లు, కోచ్‌ల కేటాయింపు, సమగ్ర ఈ ప్రాంతం అభివృద్ధికి హైస్పీడ్ కనెక్టివిటీ ప్రాజెక్టులకు మద్దతు ఇవ్వడంతో సహా రైల్వే మౌలిక సదుపాయాలను కల్పించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు బినొయ్ విశ్వం శుక్రవారం ఒక లేఖ రాశారు. భారతీయ రైల్వే త్రివేంద్రం పట్ల నిరంతర నిర్లక్ష్యం, వివక్ష చూపుతున్నాయన్నారు. త్రివేంద్రం డివిజన్‌లో డబ్లింగ్ రైలు మార్గాలు, ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం, విద్యుదీకరణ తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధి, స్టేషన్ల ఆధునీకరణపై దృష్టి సారించే అనేక ప్రాజెక్టుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని బినొయ్ విశ్వం తన లేఖలో పేర్కొన్నారు. ఇటీవల త్రివేంద్రం డివిజన్‌కు కేటాయించిన వందే భారత్ రైలును అధికారులు రద్దు చేశారని, ఇటువంటి నిర్లక్ష్య వైఖరి త్రివేంద్రంలో అభివృద్ధి అవకాశాలను అడ్డుకుంటున్నాయన్నారు. కేరళ రాజధాని త్రివేంద్రం భారతదేశంలో అత్యంత శక్తివంతమైన, వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలలో ఒకటని, కనెక్టివిటీని పెంచినట్లయితే త్రివేంద్రం ఆర్థిక వృద్ధిని, సామర్థ్యాన్ని ఉపయోగించుకోవచ్చని తెలిపారు. రైల్వే కనెక్టివిటీ, రవాణా అత్యంత సమర్థవంతమైన మాధ్యమాలలో ఒకటని, దురదృష్టవశాత్తు, భారతీయ రైల్వేలో తగిన కేటాయింపులు, ప్రణాళిక లేకపోవడం మొత్తం దక్షిణ కేరళ ప్రాంతం అభివృద్ధికి ఆటంకం కలిగిస్తోందన్నారు. త్రివేంద్రం సెంట్రల్ స్టేషన్‌కు తగిన నిధుల కేటాయింపు, సమగ్ర అభివృద్ధి కోసం ప్రజలు వేచి చూస్తున్నారన్నారని ఆయన తెలిపారు.

# మోడీ రోడ్ షో - సిపిఐ శ్రేణులపై పోలీస్ నిర్బంధాలు



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మల్కాజిగిరి ప్రాంతంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీరోడ్ షో నేపథ్యంలో పోలీసులు ఓవర్ యాక్షన్ చేశారు. ఎక్కడికక్కడ బారికేడ్లు పెట్టి పలు రహదార్లను మూసి వేయటంతో వాహనదారులు ఉదయం నుండే నానాఇబ్బందులకు గురయ్యారు. సాయంత్రం సమయంలో నిత్యం రద్దీగా ఉండే చిలుకలగూడ, మిర్జాలిగూడ, మెట్టుగూడ, మల్కాజిగిరి చౌరాస్తా, ఈస్ట్, వెస్ట్ ఆనంద్‌బాగ్, మౌలాలి, తార్నాక, లాలాగూడ లాంటి ప్రధాన రహదార్లలో పెద్దఎత్తున మోహరించిన పోలీసులు అడుగడుగునా వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తూ మరో రహదారి చూసుకోండంటూ నిలువరించారు. రోడ్ షో జరిగిన మిర్జాలిగూడ నుండి ఆనంద్‌బాగ్ చౌరాస్తా వరకు తెల్లవారు జాము నుండే ప్రత్యేక పోలీసులు భారీగా చేరుకొని రహదార్లకు రెండు వైపులా బ్యారికేడ్లు ఏర్పాటు చేసి పాదచారులతో సహా వాహనదారుల సంచారం లేకుండా చేయటం ద్వారా ఆ ప్రాంతమంతా అప్రకటిత కర్ఫ్యూ వాతావరణంలా మారింది.

ఇదిలా ఉండగా ప్రతిపక్ష పార్టీల్లో ప్రధానంగా సిపిఐ, అనుబంధ సంస్థలైన ఎఐవైఎఫ్, రైతు సంఘాల నేతలు, కార్యకర్తల ఇళ్లకు సంబంధింత ప్రాంత పోలీసులు, టాస్క్ ఫోర్స్ బృందాలు పెద్దసంఖ్యలో తెల్లవారు జామునే వెళ్ళి అదుపులోకి తీసుకొని వెళ్ళి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించి సాయంత్రం వదిలి పెట్టారు. హయత్ నగర్ సమీపంలోని గౌరెల్లి ప్రాంతం నుండి ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్య ప్రసాద్‌ను టాస్క్ ఫోర్స్ బృంద పోలీసులు 30 మందికి పైగా వెళ్లి అరెస్టు చేసారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర,



సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వివిఎస్‌బోస్, నాచారం డివిజన్ కార్యదర్శి, కృపాకర్, మిరియాల సాయిలులను నాచారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## అక్రమ అరెస్టులు హేయకరం : వివిఎస్‌బోస్

ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీ పక్షాన ప్రధాని ప్రచారం చేసుకోవాలే తప్పా, ప్రతిపక్షపార్టీ నాయకులను అక్రమంగా అరెస్టులు చేయటం ప్రజాస్వామ్యాన్ని కాలరాయటమే అని వివిఎస్‌బోస్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొని వచ్చిన పౌరసత్వ సవరణ చట్టాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ, లౌకిక విలువలకు తూట్లు పొడిచే వినాశకర చర్యలకు పూనుకొంటోందన్నారు. నాచారం పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పార్టీ శ్రేణులతో అక్కడి కానిస్టేబుల్ సుదర్శన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ అనేది లేకుండా అసభ్య పదజాలాలతో దురుసుగా ప్రవర్తించాడని ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర ఆరోపించారు. పోలీసుల అక్రమ అరెస్టులు నిరసిస్తూ బోస్, ధర్మేంద్ర, నాచారం డివిజన్ కార్యదర్శి, కృపాకర్, మిరియాల సాయిలు తదితరులు ధర్నా చేసి తమ నిరసన వ్యక్తం చేసారు.

## అరెస్టు అప్రజాస్వామికం : బాలమల్లేష్

**మల్కాజ్‌గిరి:** ప్రధాని నరేంద్ర మోడీ నగర పర్యటనకు వస్తున్న సందర్భంగా సిపిఐ శ్రేణులను ఎక్కడికక్కడ నిర్బంధించడంతో పాటు అక్రమంగా అరెస్టులు చేయడాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎన్.బాలమల్లేష్ తీవ్రంగా ఖండించారు. మోడి రాజకీయ పర్యటనకు వస్తే తమ పార్టీ నాయకులను అరెస్టు చేయడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారానికి ఆయనకు ఎంత హక్కు ఉంటుందో, భావ ప్రకటన చేసుకునే హక్కు తమకు కూడా ఉంటుందని అన్నారు. పోలీసులు అసాంఘిక శక్తులను అరెస్టు చేసినట్లుగా తమనాయకులను అరెస్టు చేయడం దారుణమన్నారు.

## జనానికి మోడీ అభివాదం

**మల్కాజ్‌గిరి :** మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో బిజెపి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ చేపట్టిన రోడ్‌షో శుక్రవారం విజయవంతంగా జరిగింది. ప్రధాని వెంట మల్కాజ్‌గిరి పార్లమెంటు బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఉన్నారు. మల్కాజ్‌గిరి సర్కిల్ పరిధిలోని మీర్జాలగూడ చౌరస్తా నుంచి మల్కాజ్‌గిరి చౌరస్తా వరకు 1.3 కి.మీ దూరం జరిగిన రోడ్ షోలో ప్రధాని మోడీ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ రోడ్‌షోలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలకు, వేలాది మంది ప్రజానీకానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : K Sreenivas Reddy,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com